


www.prajapaksham.in
PRAJAPAKSHAM

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం ★★★




సంపుటి 09, సంచిక: 214 | శనివారం | 04-07-2026 | ఖమ్మం
Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00



# 'సర్' ప్రక్రియ నత్తనడక

భారత ఎన్నికల కమిషన్ ఆదేశంపై జూన్ 25న ప్రారంభమైన ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సర్వే (ఎస్ఐఆర్–సర్) ప్రక్రియ మొత్తంమీద నత్తనడకన సాగుతున్నట్లు, ముఖ్యంగా నగరాలు, పట్టణాలలో మరీ నెమ్మదిగా సాగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. జులై 31 ముసాయిదా ఓటర్ల జాబితాల ప్రచురణ గడువు. షెడ్యూలు ప్రకారం బూత్‌లెవల్ అధికారులు (బిఎల్‌ఒలు) ముందుగా ఇంటింటికీ వెళ్లి నమోదు ఫారాలు ఇవ్వాలి. వాటిపై ఓటరు పేరు వగైరా ముద్రించి ఉంటాయి. రెండో దఫా వచ్చి ఫారం నింపటానికి సహాయపడాలి. లోగడ ముమ్మర సర్వే నిర్వహించిన 2002 నాటి ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదై ఉంటే ఆ ఓటరు కార్డు నెంబరు తదితర వివరాలు పొందుపరచాలి. చాలామంది ఓటర్ల వద్ద 24 ఏళ్లనాటి కార్డులు సురక్షితంగా ఉండే అవకాశాలు తక్కువ. ఆ తర్వాత కాలంలో ఓటరుగా నమోదైన వారు తమవద్ద ఉన్న తాజా ఓటరు కార్డుతోపాటు 2002 జాబితాలో ఉన్న తల్లిదండ్రుల సమాచారం, వారు లేని సందర్భంలో బంధువుల సమాచారం పొందుపరచాలి. వెబ్‌సైట్‌ల ద్వారా, స్మార్ట్‌ఫోన్‌ల ద్వారా 2002 నాటి ఓటర్ల జాబితాలు అన్వేషించే అవకాశమున్నా అది చాలా శ్రమ, సమయంతో కూడినపని. కిరాయి ఇళ్లు మారుతుండే వారి పరిస్థితి మరీ అయోమయం. ఇక్కడే బిఎల్‌ఒల సహాయం అవసరమవుతుంది.

సర్ ప్రక్రియ నిర్వహణకోసం బిఎల్‌ఒలను నియమించి వారికి శిక్షణ ఇచ్చినా, రాజకీయ పార్టీల ప్రతినిధులు వారివెంట ఉన్నా నగరాలు, పట్టణాలలో ఓటరు నమోదు ఫారాల పంపిణీ 40శాతం దాటినట్లు లేదు. జనాభా నివాస ప్రాంతాల్లో మార్పులు, కొత్తగా వచ్చిన గృహ సముదాయాలు, పెద్దసంఖ్యలో జనాలు వలస వెళ్లటం ఇత్యాది అనేక సమస్యలున్నాయి. ముఖ్యంగా పేదలు, దళితులు, ఇతర బలహీన వర్గాలు ఈ కేటగిరీలో ఉంటారు. మరణించినవారి పేర్లు, ఒకటికన్నా ఎక్కువ చోట్ల నమోదైన ఓట్లు, శాశ్వతంగా నివాస ప్రాంత మార్పుకు సంబంధించిన ఓట్లను కచ్చితమైన ధృవీకరణతో తొలగించటం నిరభ్యంతరం. కాని అశ్రద్ధతో, కొన్ని సందర్భాల్లో రాజకీయ ఒత్తిళ్లతో ఓట్లను తొలగించటం, నమోదు ఫారాలు పంపిణీ చేయకుండానే ఇచ్చినట్లు లెక్కలు రాయటం, రాజకీయులు వాటిని భర్తీ చేసి గుండుగుత్తగా సమర్పించినా ఆమోదించటం, జాబితాల తయారీలో, ముద్రణలో సర్వసాధారణంగా జరిగే తప్పుల కారణంగా లీగల్ వ్యత్యాసాల పేరుతో ఓట్లు తొలగించటం వంటి అక్రమాలకు ఎన్నికల అధికారులు ఒడిగడితే అది ప్రతి వయోజనుడికీ ఓటు హక్కు ఇచ్చిన రాజ్యాంగాన్ని ధిక్కరించటం, ఏ రాజకీయ పార్టీకో ఉద్దేశపూర్వకంగా సహాయం చేయటం అవుతుంది. ఇటువంటి అక్రమాల కారణంగానే బిహార్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో జరిగిన కుట్రలు, కుయుక్తులు అనుభవంలోకి వచ్చాయి. ఓటు హక్కు అనేది రాజకీయ పార్టీకి సంబంధించింది కాదు, పౌరుని ప్రాథమిక హక్కు పరిరక్షణ. ఆ బాధ్యతను పౌరునిపైనే పెట్టటం సరైనది కాదు. ఇంతకుమునుపు సర్ నిర్వహించిన అరడజను రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది నెలల ముందు ఓట్ల ముమ్మర రివిజన్ చేబట్టి ఆ ఎన్నికల షెడ్యూలుకోసం ఎంతో తొందరపడ్డారు. ఇప్పుడు సర్ చేబట్టిన రాష్ట్రాల్లో, ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు లేవు. అందువల్ల ఎన్నికల కమిషన్ 20వ తేదీనాటికి పరిస్థితిని సమీక్షించుకుని తన రివిజన్ షెడ్యూలును పొడిగిస్తూ పునర్నిర్ణయం చేయవచ్చు.

బిఎల్‌ఒలకు ఇది కఠిన పరీక్షా సమయం. వారం గడిచినా ఏ బిఎల్‌ఒ తమ ఇంటికి రాకపోవటంతో ఓటర్లలో అసహనం, ఆందోళన పెరుగుతున్నది. కొద్దిరోజుల క్రితంవరకు తమకు ఫారాలు అందలేదని హైదరాబాద్ సిటీ, రంగారెడ్డికి చెందిన పలువురు బిఎల్‌ఒలు అంటున్నారు. ఒకవేళ బిఎల్‌ఒ వచ్చినా తమ పేర్లు లేనందున తమను మరో బిఎల్‌ఒ వద్దకు వెళ్లమంటున్నారని ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్క బిఎల్‌ఒ 1200–1300 ఓటర్లను కనీసం మూడుసార్లు కలవాలి. రాష్ట్రంలో బుధవారంనాటికి మొత్తం 2.56 కోట్ల ఓటరు నమోదు ఫారాలు పంపిణీ జరిగినట్లు (75.73 శాతం కవరేజి) ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయ ప్రకటన తెలిపింది.

కాగా హైదరాబాద్ మహానగరంలో బుధవారంనాటికి ఫారాల పంపిణీ 40 శాతంలోపే ఉంది. కాబట్టి ముఖ్య ఎన్నికల అధికారి ఈ నగరంపై ప్రత్యేక దృష్టి పెట్టి బిఎల్‌ఒల పనిని వేగిరపరచాలి. నగరంలో నివసిస్తున్న పదులవేలమంది ఓట్లు వారి స్వస్థలాల్లోనే ఉన్నాయి. వారు పలు కారణాలరీత్యా అక్కడే ఓటు హక్కు కోరుకుంటారు. 2024 ఓటర్ల జాబితాలో పేరున్న వారందరికీ నమోదు ఫారాలు ఇవ్వగలిగితే నమోదు రేటు పెరుగుతుంది.

నగరంలో ఎప్పుడూ ఓటింగ్ శాతం తక్కువగానే ఉంటుంది. ఓటరు నమోదే గణనీయంగా తగ్గితే ఓటింగ్ శాతం మరింత తగ్గి ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియ వక్రీకరణ పొందుతుంది. కాబట్టి అధికారులు వేగిరం పనులు పూర్తి చేయాలి. ●



## కెసిఆర్ రుణాలను చెల్లిస్తున్నారా?

తెలంగాణ రాష్ట్రంలో 2014 జూన్ నుంచి 2023 డిసెంబర్ వరకు బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో కెసిఆర్ చేసిన అప్పు అక్షరాలా రూ.8,21,651కోట్లు. మా రెండున్నరేళ్ల పాలనలో చేసిన అప్పు రూ. 1,77,000 కోట్లు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి, వ్యవస్థలను నిర్వీర్యం, రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన కెసిఆర్, ఇప్పుడు తాను రాను అంటే ఎలా? బయటకు వచ్చి సమాధానం చెప్పాలి. అబద్ధాలను పోగేసి ప్రచారం చేయడం తప్ప, ప్రజలకు బిఆర్ఎస్ నాయకులు చేసిందేమీ లేదు. 'గోబెల్స్' ప్రచారానికి పాల్పడటం బిఆర్ఎస్‌కు అలవాటుగా మారింది. రైతుల నుంచి డబ్బులు వస్తాయని కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారా రుణాలు తీసుకొచ్చారు. ప్రజల నుంచి పన్నుల రూపంలో డబ్బులు వస్తాయని మిషన్ భగీరథ ప్రాజెక్టుకు మిషన్ భగీరథ కార్పొరేషన్ ద్వారా అప్పు చేశారు. కానీ ప్రస్తుతం ఆ కార్పొరేషన్లు తీసుకున్న రుణాలను ప్రభుత్వం కాకపోతే కెసిఆర్ చెల్లిస్తున్నారా?

\- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



## సైన్స్‌కే సవాల్.. సూర్యుడితో స్నేహం!

సృష్టిలో లవణోత్పత్తి అనగానే ఎవరికైనా సముద్ర తీరాలే గుర్తుకు రావడం సహజం. ప్రపంచవ్యాప్తంగా జరిగే ఉత్పత్తిలో అత్యధిక భాగం సముద్ర జలాల ఆవిరిద్వారానే సాగుతోందని వివిధ పారిశ్రామిక అధ్యయనాలు సూచిస్తున్నాయి. అయితే, సముద్రంతో ఎటువంటి ప్రత్యక్ష సంబంధం లేకపోయినా భూగర్భంలో సహజంగా లవణీయత అధికంగా ఉండే కొన్ని ప్రత్యేక భౌగోళిక ప్రాంతాల్లో తెల్లని స్ఫటికాల ఉత్పత్తి సాధ్యమవుతోంది. అంతర్జాతీయంగా అమెరికాలోని గ్రేట్ సాల్ట్ లేక్ పరిసరాలు, రాజస్థాన్‌లోని సంభార్ సరస్సు ప్రాంతం, గుజరాత్‌లోని లవణ క్షేత్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి దలాయి పాలెంలో భూగర్భ జలాల ఆధారంగా సాగుతున్న ఉప్పు ఉత్పత్తి స్థానికంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. తీరంలేని చోట సాగర వైభవాన్ని తలపించేలా సాగుతున్న ప్రక్రియ భౌగోళిక శాస్త్రవేత్తలు, భూగర్భ జల నిపుణుల దృష్టిని ఆకర్షిస్తోంది. భూమి గర్భంలో దాగిన లవణ సంపదను, సూర్యుడి అపార శక్తిని ఉత్పాదక వనరులుగా మలచుకున్న వ్యవస్థ ప్రకృతి ఆధారిత ఆర్థిక స్వయం సమృద్ధికి ప్రతీకగా నిలుస్తోంది.

భూగర్భ శాస్త్రవేత్తల విశ్లేషణల ప్రకారం కోట్ల సంవత్సరాల క్రితం సంభవించిన భౌగోళిక మార్పులు, పురాతన సముద్రాల ఆనవాళ్లు, ఖనిజ నిక్షేపాల ఏర్పాట్లు వంటి కారణాల వల్ల కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాల్లో సహజ లవణీయత ఏర్పడుతుంది. స్థానికంగా లభించే నీటిని బోర్ల ద్వారా పైకి తీసి ప్రత్యేక మడుల్లో నిల్వ చేస్తారు. అనంతరం సూర్యరశ్మి సహాయంతో నీటిని క్రమంగా ఆవిరిచేయడం ద్వారా లవణాల సాంద్రత పెరిగి చివరకు స్ఫటికాలు ఏర్పడతాయి. వివిధ అంతర్జాతీయ, జాతీయ అధ్యయనాలు అధిక లవణీయత కలిగిన భూగర్భ జలాలు ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో సహజ సిద్ధంగా లభిస్తాయని పేర్కొంటున్నాయి. అదే విధంగా భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాల లవణీయత సహజ భౌగోళిక పరిస్థితుల ఫలితమని నిపుణులు వివరిస్తున్నారు. భూగర్భ జలాల్లోని సోడియం క్లోరైడ్, మెగ్నీషియం, కాల్షియం వంటి ఖనిజాల పరిమాణం ప్రాంతానికొకలా ఉండటంతో ఉత్పత్తి నాణ్యత, వినియోగ అవసరాలు కూడా మారుతూ ఉంటాయి. అందువల్ల ఇది ఆధునిక శాస్త్రానికి విరుద్ధమైన ప్రక్రియ కాదు. ప్రకృతి ఆధారిత సాంప్రదాయ పరిజ్ఞానం, శాస్త్రీయ సూత్రాలు, స్థానిక అనుభవ జ్ఞానం కలిసిన అద్భుత సమ్మేళనం ఇది.

కృత్రిమ మేధస్సు యుగం ప్రపంచాన్ని అపూర్వ వేగంతో ముందుకు నడిపిస్తున్నా, ప్రకృతి మాత్రం ఇంకా కొన్ని శాశ్వత సత్యాలను నిశ్శబ్దంగా మన ముందుంచుతూనే ఉంది. భూమి గర్భంలో దాగి ఉన్న లవణ జలాలు, ఆకాశంలో నిరంతరం మండే సూర్యుడు, మట్టిపై చెమట చిందించే శ్రమజీవి, కలిసినప్పుడు పుట్టేది కేవలం ఒక ఉత్పత్తి కాదు. ప్రకృతి, శ్రమ, సహనాల మధ్య కుదిరిన ఒక అద్భుత ఒప్పందం. తరతరాల అనుభవం, ప్రకృతిపై అచంచల విశ్వాసం, కష్టాన్ని సంపదగా మార్చే మానవ సంకల్పం కూడా. సముద్రం లేకున్నా లవణ సంపదను సృష్టిస్తున్న వ్యవస్థలో ప్రకృతి విజ్ఞానం ఉంది, జీవితాన్ని గెలిచే జ్ఞానం ఉంది. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా, ప్రకృతితో సహజీవనం చేస్తూ సంపదను సృష్టించే జ్ఞానమే నాగరికతకు నిజమైన పునాది అని లవణ క్షేత్రాలు మనకు గుర్తు చేస్తున్నాయి. సూర్యుడు, భూమి, శ్రమజీవి కలిసి సృష్టిస్తున్న తెల్లని సంపద ప్రకృతి, మనిషి సహకారానికి సజీవమైన నిదర్శనం.

ఫిరోజ్ ఖాన్, 9640466464

# విధ్వంసం చేయదలిస్తే, యుద్ధమే అక్కరలేదు



ప్రొ.దేవరాజు మహారాజు

వివేచన గలవాడి అభిప్రాయాన్ని మూర్ఖుడు యథాతథంగా వెలిబుచ్చలేడు. వాడికి అర్థమైన రీతిలో అర్థమైనంతే చెపుతాడు. దాన్ని మనం లెక్కలోకి తీసుకోనక్కరలేదు. మూర్ఖుడు వినేది ఒకటి. అర్థం చేసుకునేది మరొకటి ఉంటుంది. – *బెట్రెండ్ రస్సెల్.*

'దేశభక్తి అనే పదం, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు మూర్ఖపాలకులు వాడే ముసుగు' – అన్నాడు మరొక తత్వవేత్త. అబద్ధాల్ని గట్టిగా నమ్మేవాళ్ళు మనమొక నిజాన్ని చెప్పినపుడు 'ఆధారమేమిటి'? – అని యాగీ చేస్తారు. వాళ్ళు నమ్మే అబద్ధాలకు ఆధారాలేమున్నాయోనన్నది మాత్రం వారు ఆలోచించుకోరు.

ఇరాన్‌లో బాంబులు పేలుతున్నా, మన భారతదేశం ప్రశాంతంగానే ఉంది. అందుకు మోదీ నిర్ణయాలే కారణం అంటున్నారు ఆయన భక్తులు. వాస్తవమేమంటే – అసలు అక్కడ యుద్ధాలు మొదలుకాకముందే, మన దేశంలో విద్వేష యుద్ధం 12ఏళ్ళుగా నడుస్తోంది. విదేశాంగ విధానం లోపించి, పెట్రోలు, గ్యాస్ ధరలు, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగి, సామాన్యులు బతకలేకపోతున్నారు. ట్రంప్‌కు భయపడి, మోదీ చేస్తున్న గులాంగిరితో దేశ ప్రతిష్ట పూర్తిగా ధ్వంసమైంది. చావుకు యుద్ధమే అక్కరలేదు. ఈ దేశ ప్రజల చావుకు మన విశ్వగురువు తగిన బందోబస్తు చేస్తూనే వచ్చాడు. గాలి కాలుష్యం, నీరు కాలుష్యం, ఫ్లైఓవర్లు కూలిపోయి, విమానాలు, రైలు, రోడ్డు ప్రమాదాలు జరుగుతూ.. హత్యలు, మానభంగాలు, హాస్పిటల్స్‌లో ఆక్సిజన్ లేకపోవడాలు – గ్లాస్ లేక, కరెంటు లేక కట్టెల పొయ్యి వెతుక్కునే స్థితి తెచ్చింది మన విశ్వగురుడే కదా? హోటళ్ళు, హాస్టళ్ళూ మూతపడే విధంగా పరిస్థితిని మురగబెట్టింది – ఈ దేశంలోని ఒక టెలిప్రాంప్టర్ రీడరే కదా?

మల్ మల్ ధోయే శరీర్‌కా/ధోయేన మన్‌క మైల్
నహోయె గంగా గోమతి/రహే బైల్ కె బైల్ –

అన్నాడు కబీర్. క్రైస్తవ దేశం అమెరికా, యూదుల దేశం ఇజ్రాయెల్‌లు కలిసి పర్మిషన్ ఇస్తే గాని, ముస్లిం దేశమైన ఇరాన్‌కు పోయి చమురు తెచ్చుకునే పరిస్థితిలో లేడు ఈ గల్లొటియా గురువు! అతనూ, అతని అంధ భక్తులూ కలిసి ఈ దేశాన్ని 'హిందూ రాష్ట్ర'గా మారుస్తారట! కాస్త, మైండ్‌లో మెదడుందా? అని అడుగుతున్నారు సామాన్య పౌరులు.

గాజు భవనాల్లో ఉండేవారు ఇతరుల ఇళ్ళపైకి రాళ్ళు విసరకూడదు – కాని, అంత పరిజ్ఞానం లేని ఇండియన్ హోంమినిస్టర్ అమిత్ షా – అస్సాం లో జరిగిన అన్యాయం గురించి మాట్లాడుతూ "కాంగ్రెస్ తమ పదిహేనేళ్ళ పాలనలో అస్సాం హెల్త్‌కేర్ బడ్జెట్‌లోంచి ప్రతియేటా 150 కోట్లు దిగమింగింది." అని అన్నాడు. ఆ పని చేసింది హిమంత బిశ్వశర్మ. 2006–2014 మధ్య కాలంలో అస్సాం ఆరోగ్యశాఖామంత్రి ఆయనే! ఆ కాంగ్రెస్ మంత్రినే తమలో చేర్చుకొని, శుద్ధి చేసి – బిజెపి, అతణ్ణి ముఖ్యమంత్రిగా కూర్చోబెట్టింది! ఆయన చేసిన అవినీతి కాంగ్రెస్‌పై రుద్ది – ప్రస్తుత తమ ముఖ్యమంత్రి సచ్ఛీలుడు అని ప్రకటించుకున్నాడు శీలవంతుడైన అమిత్‌షా – దేశ ప్రజలకు విషయాలు అర్థం కావన్న భ్రమలో ఉన్నట్టుంది హోమ్‌శాఖా మంత్రి.

"తక్కువ ప్రతిభ ఉన్న మందబుద్ధులకే అమితమైన గర్వం, అహంకారం, తమపై తమకు విశ్వాసం ఉంటాయి! కారణం ఏమిటంటే – ఇలాంటి మూర్ఖుల చుట్టూ, ఇలాంటి వారే మరికొంతమంది చేరి ప్రశంసలు గుప్పిస్తుంటారు." – అని చెప్పినవాడు డచ్ దేశపు మానవ వాది – డిసిడిరియస్ ఎరాస్మస్! ఆయన 1509లో చెప్పినా, కొందరికి విషయం ఇప్పటికీ అర్థంకాదు. ఆరెస్సెస్ వారికి చీమూ, నెత్తురూ ఉంటే 'భారత్ మాతాకీ జై' నినాదాన్ని, 'జైహింద్' – నినాదాన్ని వదిలేయాలి. ఎందుకంటే ముస్లింలను ద్వేషించే ఈ సంస్థ సభ్యులు, 'భారత్ మాతాకీ జై' నినాదాన్ని రూపొందించింది ఒక ముస్లిం – అజీముల్లా ఖాన్ అని తెలుసుకోవాలి! అలాగే 'జైహింద్'కు రూపకల్పన చేసినవాడు అబిద్ హసన్ – హైదరాబాదీ ముస్లిం అని తెలుసుకున్నారో లేదో – తెలుసోకపోతే, ఇప్పుడైనా తెలుసుకోవడం మంచిది. అయితే, 'కాషాయ దేశభక్తులు అసలైన చరిత్ర తెలుసుకోగలుగుతారా?' అని ప్రశ్నించినవాడు మాత్రం పినరయ్ విజయన్, కేరళ మాజీ ముఖ్యమంత్రి. ఈయనకే కాదు దేశంలోని కోట్లాది భారతీయులక్కూడా ఈ అనుమానం ఉంది.

మోదీ దినచర్యను బాగా గమనించి, ఒక జర్నలిస్ట్ ఈ విధంగా రాశాడు – రోజుకు పద్దెనిమిది గంటలు పనిచేయాలి అంటే ఎంత కష్టం? ప్రఖ్యాత బ్రాండ్ జార్జియా ఆర్మానీ సూటు ధరించాలి. కెన్నెత్ కోల్ షూ వేసుకుని, మొవాడో వాచ్ పెట్టుకోవాలి. మేకప్ చేయించుకొని, కూపర్ విజన్ సన్ గ్లాసెస్ పెట్టుకోవాలి. హెయిర్ కేర్, ఫెర్ఫ్యూమ్ అయ్యాక, ఐఫోన్ చేతిలోకి తీసుకోవాలి. రిహార్సల్స్, లైట్స్, కెమెరా, యాక్షన్, డైరెక్షన్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సెల్ఫీలు – ఖరీదైన మష్రూమ్ రోటీతో లంచ్ – రెస్ట్. తిరిగి వేరే సూట్ ధరించి, రిపీట్ మోడ్‌లో పనిచేయాలి.ఎంత కష్టం? ఎంత కష్టం? ఇంత కష్టపడి అహోరాత్రులు దేశం కోసం పనిచేస్తుంటే వారి బిజెపి పార్లమెంట్ మెంబర్ ఇలా చెపుతాడేమిటో– "నరేంద్ర మోదీ పదవి నుంచి తొలగితే చాలు. మరుసటి రోజు అతను జైల్లో ఉంటాడు. ఇక జీవితమంతా కూడా అక్కడే గడుపుతాడు" – అని! ఇదొక్కటే కాదు, సోషల్ మీడియాలో సుబ్రహ్మణ్యస్వామి, మోదీ గురించి చెప్పిన విషయాలు తిరుగుతూనే ఉన్నాయి. ఆసక్తి గలవారు వెతుక్కోవచ్చు.

మోదీ మిత్రులు కొనేసిన మీడియా సంస్థల్లో పనిచేయడం ఇష్టం లేక, కొందరు బయటకు వచ్చేసి, స్వతంత్ర జర్నలిస్టులుగా పనిచేస్తున్నారు. జనాని కి కొన్ని వాస్తవాలు చేరవేస్తున్నారు. అలాంటి వారిలో ఓ స్వతంత్ర జర్నలిస్ట్ కవర్ చేసిన సంఘటన ఇలా ఉంది –

ఎలక్షన్ ప్రచార సభ ముగించుకొని మోదీ తిరిగి వెళ్లిపోతుంటే కొందరు గ్రామస్థులు ఆయన కాన్వాయ్‌ను ఆపారు. తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. ' ఓ అదెంత పని? చెప్పండి చిటికెలో తీర్చేస్తానన్నాడు, గ్రామస్థులు రెండు సమస్యలున్నాయని చెప్పారు. 1.ఆ ఊళ్లో ఆసుపత్రి ఉంది కానీ డాక్టర్ లేడు. ఆ మాట వినగానే మోదీ తన ఐఫోన్ తీసి, ఫోన్ కలిపి ఎవరితోనో మూడు నిమిషాలు మాట్లాడాడు. "అయిపోయింది! మీ ఆసుపత్రికి డాక్టర్ సాబ్ వస్తాడు– సరే ఇంకో సమస్య అన్నారు కదా? అదేమిటో చెప్పండి!' అని అడిగాడు.

"అయ్యా ! మా ఊరి దరిదాపుల్లో ఎక్కడా సెల్ సిగ్నల్ రాదు. దయచేసి ఓ సెల్ టవర్ పెట్టించండి" – అని అడిగారు గ్రామస్థులు. మోదీ మొహం వేలాడేసి – ' కాన్వాయ్‌ని ముందుకు పోనీయండి!' అని ఆర్డర్ వేశాడు. గత 12 ఏళ్లుగా ఆయన ప్రభుత్వం ఆ విధంగా ముందుకు పోతూనే ఉంది.

బిజెపి వేలమందిని నియమించుకొని, ప్రపంచవ్యాప్తంగా తప్పుడు కథనా లు ప్రచారం చేస్తూనే ఉంది అన్నది నిజం! వారు చెప్పే కథనం ప్రకారం, వారు కాంగ్రెస్‌ను ఖాన్‌గ్రేస్ – అని అంటారట. కాంగ్రెస్ – ఖాన్ అనే శబ్దం నుండి వచ్చిందని వీరి సిద్ధాంతం. ఇందిరాగాంధీ ఖాన్‌ను పెండ్లి చేసుకుందని అందువల్ల ఖాన్‌ల పార్టీ – కాన్‌గ్రేస్ – అని తీర్మానించి జనంలో ప్రచారం చేస్తున్నారు. ఇందిరాగాంధీ వివాహం, ఖాన్ అనే ముస్లింతో కాలేదని వీరికి తెలియదు. తెలిసినా, అబద్ధాలు ప్రచారం చేయదల్చినప్పుడు ఇక నిజాలతో ఏం పని? అడ్డదిడ్డంగా ఏదైనా మాట్లాడొచ్చు కదా? ఇందిరాగాంధీ భర్త పేరు ఫిరోజ్‌గాంధీ. ఆయన ముస్లిం కాదు. పార్సీ కుటుంబీకుడు. వారి ఇంటిపేరు గాంధీ. దాన్ని వారు గాంధీ అని కూడా పలుకుతారు. అది ఇంగ్లీషులో రాస్తే గాంధీ అవుతుంది. ఈయనకు మహాత్మా గాంధీకి ఏం సంబంధం లేదు.

ఫిరోజ్‌గాంధీ స్వాతంత్ర్య సమరయోధుడు. జైలుకు వెళ్లాడు. ఇందిరా–ఫిరోజ్‌ల పెళ్లి ఆనంద్‌భవన్‌లో హిందూ సాంప్రదాయాల ప్రకారం 26 మార్చి 1942లో జరిగింది. ఇందిర తల్లి కమలానెహ్రూ టి.బితో బాధపడుతూ ఉండేది. ఫిరోజ్ ఒక కొడుకులాగా బాధ్యత తీసుకుని ఆమెను సానిటోరియంలకు తీసుకుపోయేవాడు. ఆ కుటుంబ సాన్నిహిత్యమే ఇందిర–ఫిరోజ్‌ల పెళ్లికి దారితీసింది. కమలానెహ్రూ మరణశయ్యపై ఉన్నప్పుడు ఫిరోజ్ పక్కనే ఉన్నాడు. ఈ విషయా లు తెలుసుకోకుండా అభాండాలు వేసే నీచ బుద్ధిని మనం ఎక్కడికక్కడ ఎండగడుతూ ఉండాలి!.

కశ్మీర్‌ను నెహ్రూ వల్లే కోల్పోయామని మోదీ అబద్ధాలు చెపుతున్నాడు. ఆనాడు కశ్మీర్‌ను జిన్నాకు వదిలేద్దామని సర్దార్ పటేల్ అంటే – నెహ్రూ పట్టుబట్టి కశ్మీర్‌ను భారత్‌లో అంతర్భాగం చేశాడు. ఇది ఆన్ రికార్డు–పార్లమెంట్ లో ఉంది! ఏది నిజం? ఏది అబద్ధం అని దేశ ప్రజలు ఆలోచించుకునేలోపు, అంధభక్తులు మరో కొత్త అబద్ధాన్ని ఆవిష్కరిస్తారు. ఏది ఏమైనా జనాన్ని మతం చుట్టూ గానుగెద్దుల్లా తిప్పుతూ ఉంటారు. దేశప్రజలు ఈ కుట్రను అర్థంచేసుకుంటున్నారు. జిన్నా, సావర్కర్ల స్నేహం ఎంతో గొప్పది. అందుకే ఆర్ఎస్ఎస్ వారు జిన్నాను చంపలేదు, గాంధీని చంపారు. అదే గాడ్సేతో గాంధీకి బదులు జిన్నాను చంపించి ఉంటే, పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి రెండు దేశాలు ఏర్పడి ఉండేవి కావు. సమగ్రత, మత సామరస్యం కోరుకున్నాడు కాబట్టి గాంధీని గాడ్సేతో హత్య చేయించారు. ఈ రోజు వరకు పాక్‌తో మన సంబంధాలు బెడిసికొడుతున్నాయంటే, అక్కడ ఉగ్రవాదం బలపడిందంటే– అందుకు కారణం మనం దేశంలో ఉన్న ఈ ఉగ్రవాద సంస్థే కారణం! అయితే, విషయం పైపైన చూస్తే అర్థంకాదు. లోతుగా మూలాల్లోకి పోయి విశ్లేషించుకోవాలి!

సాధారణ దొంగ మీ మొబైల్, పర్సు, గడియారం, బ్యాగు, బంగారు గొలుసు వంటివి దొంగిలిస్తాడేమో గానీ, బడా రాజకీయనాయకుడు మీ మొత్తం భవిష్యత్తును చివరకు 'ఓటుహక్కు'ను కూడా దొంగిలించేస్తాడు. చాలదూ? విధ్వంసానికి యుద్ధమే చేయాలా?

(కవిరాజు త్రిపురనేని రామ స్వామి, జాతీయ పురస్కార తొలి (గ్రహీత, జీవశాస్త్రవేత్త)

> *బిజెపి వేలమందిని నియమించుకొని, ప్రపంచవ్యాప్తంగా తప్పుడు కథనాలు ప్రచారం చేస్తూనే ఉంది అన్నది నిజం! వారు చెప్పే కథనం ప్రకారం, వారు కాంగ్రెస్‌ను ఖాన్‌గ్రేస్ – అని అంటారట. కాంగ్రెస్ – ఖాన్ అనే శబ్దం నుండి వచ్చిందని వీరి సిద్ధాంతం. ఇందిరాగాంధీ ఖాన్‌ను పెండ్లి చేసుకుందని అందువల్ల ఖాన్‌ల పార్టీ – కాన్‌గ్రేస్ – అని తీర్మానించి జనంలో ప్రచారం చేస్తున్నారు. ఇందిరాగాంధీ వివాహం, ఖాన్ అనే ముస్లింతో కాలేదని వీరికి తెలియదు. తెలిసినా, అబద్ధాలు ప్రచారం చేయదల్చినప్పుడు ఇక నిజాలతో ఏం పని? అడ్డదిడ్డంగా ఏదైనా మాట్లాడొచ్చు కదా?*

# పది కోట్లకు పైగా సభ్యత్వం కలిగిన చైనా కమ్యూనిస్టు పార్టీ

సాత్యకీ చక్రవర్తి

చైనా కమ్యూనిస్ట్ పార్టీ (సిపిసి)లో సభ్యుల సంఖ్య 10. 12 కోట్లకు చేరుకుంది. ప్రపంచంలోనే అత్యధికంగా 18 కోట్ల సభ్యులు కలిగిన పార్టీగా చెప్పుఉంటున్న భారతదేశానికి చెందిన భారతీయ జనతా పార్టీ (బిజెపి) తర్వాత సభ్యత్వం విషయంలో సిపిసి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ రెండు దేశాల జనాభా సుమారు 145 కోట్లు చొప్పున ఉంటుంది. గత పదేళ్లలో బిజెపి సభ్యత్వం వేగంగా పెరగగా, కఠిన నిబంధనలు అవలంభిస్తోన్న కారణంగా సిపిసి సభ్యత్వంలో మితమైన వృద్ధి నమోదైంది.

తాజా నివేదికల ప్రకారం సభ్యుల సంఖ్యా పరంగా భారతదేశంలోని కాంగ్రెస్ పార్టీ సుమారు 5 కోట్ల మంది సభ్యులతో ప్రపంచంలో మూడవ స్థానంలో ఉండగా, అమెరికాలోని డెమోక్రటిక్ పార్టీ 4.7 కోట్ల సభ్యత్వాన్ని కలిగి ఉంది. రిపబ్లికన్ పార్టీ 3.7 కోట్ల సభ్యులతో ఐదవ స్థానంలో ఉంది. చైనాలో ఏక పార్టీ పాలన ఉండగా, భారత్, అమెరికా దేశాలలోని పార్టీలు క్రమం తప్పకుండా జరిగే ఎన్నికల ఆధారంగా పనిచేసే ప్రజాస్వామ్య వ్యవస్థలో కొనసాగుతున్నాయి.

సిపిసి ఆవిర్భావ దినోత్సవం (105వ వార్షికోత్సవం) సందర్భంగా జూన్ 30న కేంద్ర కమిటీ విడుదల చేసిన నివేదిక కొన్ని ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. 2025లో పార్టీ సభ్యుల సంఖ్యలో మితమైన వృద్ధి కనిపించింది. విద్యా అర్హతల పరంగా సభ్యుల కూర్పు మెరుగుపడింది. క్షేత్రస్థాయిలో పార్టీ వ్యవస్థ మరింత పటిష్టంగా మారింది.

నివేదికలోని గణాంకాల ప్రకారం 2025లో పార్టీ సభ్యుల సంఖ్య ఏడాది ప్రాతిపదికన ఒక్క శాతం పెరిగింది. ఆ సంవత్సరంలో 20.86 లక్షలకు పైగా కొత్త సభ్యులు చేరారు. వీరిలో 51.4 శాతం మంది ఉత్పత్తి , శ్రామిక రంగాలలో ముందు వరుసలో ఉన్నవారు కాగా, 54.8 శాతం మంది జూనియర్ కాలేజీ డిప్లొమా లేదా అంతకంటే ఎక్కువ స్థాయి విద్యా అర్హత కలిగి ఉన్నారు. వీరిలో 84 శాతం మంది 35 ఏళ్లు లేదా అంతకంటే తక్కువ వయస్సు కలిగిన వారని నివేదిక పేర్కొంది.

2025 చివరి నాటికి సిపిసి సభ్యత్వం కోసం 2.86 కోట్ల మంది దరఖాస్తు చేసుకోగా, 1.64కోట్ల మంది క్రియాశీల దరఖాస్తుదారులుగా ఉన్నారు.

పార్టీ సభ్యుల కూర్పులో నిరంతర మెరుగుదల కనిపిస్తోంది. 2025 చివరి నాటికి సుమారు 5.97కోట్ల మంది పార్టీ సభ్యులు లేదా మొత్తం సభ్యత్వంలో 59 శాతం జూనియర్ కాలేజీ లేదా అంతకంటే ఎక్కువ స్థాయి విద్యార్హతను కలిగి ఉన్నారని తాజా నివేదిక వెల్లడించింది. ఇది గత సంవత్సరం చివరిలో నమోదైన స్థాయి కంటే 1.4శాతం పాయింట్లు ఎక్కువ.2025 చివరి నాటికి సిపిసిలో మహిళా సభ్యుల సంఖ్య 3.19 కోట్లకు పైగా చేరింది. ఇది మొత్తం సభ్యత్వంలో 31.5శాతానికి సమానం. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 0.6 శాతం పాయింట్ల పెరుగుదలను సూచిస్తుంది. జాతి మైనారిటీ వర్గాలకు చెందిన సభ్యుల వాటా 7.8 శాతంగా (సుమారు 78.8 లక్షల మంది) ఉంది. కార్మికులు, రైతులు సిపిసి సభ్యత్వంలో ప్రధాన భాగంగా కొనసాగుతున్నారు, వీరు మొత్తం సభ్యత్వంలో 32.4 శాతం వాటాను కలిగి ఉన్నారు.

నివేదిక ప్రకారం, పార్టీ సభ్యుల విద్య, నిర్వహణలో మెరుగుదల కొనసాగుతోంది. 2025లో శిక్షణ పొందిన పార్టీ సభ్యుల సంఖ్య అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 3.7 శాతం పెరిగింది.

2025లో అన్ని స్థాయిలలోని పార్టీ సంస్థలు 1.08 లక్షల ఉన్నత ప్రాథమిక స్థాయి పార్టీ సంస్థలను, 5.83 లక్షల విశిష్ట సిపిసి సభ్యులను, 1.65 లక్షల మంది ఆదర్శవంతమైన పార్టీ కార్యకర్తలను సత్కరించాయి. 50 ఏళ్ల పార్టీ సభ్యత్వ అనుభవం కలిగిన సిపిసి సభ్యులకు ఏడాది పొడవునా మొత్తం 9.39 లక్షల స్మారక పతకాలు ప్రదానం చేయబడ్డాయి.

పార్టీ సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకునేవారు, క్రియాశీల అభ్యర్థుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కొత్త సభ్యుల నియామకం కోసం సిపిసి కఠినమైన ప్రమాణాలను, ప్రామాణిక విధానాలను అమలు చేసింది. పార్టీలో చేరే శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, మేధావుల సంఖ్య పెరుగుతూ వస్తోంది, తద్వారా పార్టీ సభ్యత్వ నిర్మాణం మొత్తం మీద మెరుగుపడుతోంది.

నివేదిక ప్రకారం ప్రాథమిక స్థాయి పార్టీ సంస్థలను బలోపేతం చేయడానికి కూడా కృషి జరిగింది.

2025 చివరి నాటికి దేశవ్యాప్తంగా 3,14,000 ప్రాథమిక స్థాయి పార్టీ కమిటీలు ఉన్నాయి. ఇది 2024తో పోలిస్తే 8,000 ఎక్కువ. ప్రాథమిక స్థాయి సాధారణ పార్టీ శాఖలు, పార్టీ శాఖల సంఖ్య వరుసగా 3.33 లక్షలు, 47.8 లక్షలకు పెరిగాయి.

దేశవ్యాప్త గ్రామీణ పునరుజ్జీవనానికి ఊతమిచ్చేలా గ్రామస్థాయి పార్టీ సంస్థలు మరింత బలోపేతం చేశారు. 2025 చివరి నాటికి చైనాలో దాదాపు 4.83 లక్షల మంది గ్రామ పార్టీ శాఖ కార్యదర్శులు ఉన్నారు. వీరిలో 56.5 శాతం మంది జూనియర్ కళాశాల స్థాయి లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగి ఉన్నారు. ఇది 2024తో పోలిస్తే 8.9 శాతం పెరుగుదల.

'అత్యంత పటిష్టమైన వ్యవస్థాగత నిర్మాణం సిపిసి ప్రత్యేక సంస్థాగత బలం,' అని పార్టీ ప్రతినిధి పేర్కొన్నారు. 'సిపిసి కేంద్ర కమిటీ కేంద్రీకృత, సమష్టి నాయకత్వం, ప్రజలతో మమేకమయ్యే అనేక ప్రాథమిక స్థాయి పార్టీ సంస్థల ద్వారా, సిపిసి పరిపాలనా వ్యవస్థ మొత్తాన్ని క్రమబద్ధీకరించింది.'

2017లో సిపిసి 'కొత్త శకం కోసం చైనా లక్షణాలతో కూడిన సోషలిజంపై ఆలోచన (Thought on Socialism with Chinese Characteristics for a New Era)' అనే భావనకు రూపకల్పన చేసింది. ఇది పార్టీ తప్పనిసరిగా అనుసరించాల్సిన, అభివృద్ధి చేయాల్సిన దీర్ఘకాలిక కార్యాచరణ మార్గదర్శిని. కొత్త శకంలో చైనా లక్షణాలతో కూడిన సోషలిజాన్ని సమర్థించడం, అభివృద్ధి చేయడం అనే ప్రయత్నాలకు ఆధారమైన 14 ప్రాథమిక సూత్రాలను ఇది నిర్దేశిస్తుంది. ఇందులో మొదటి సూత్రం 'అన్ని పనులపై పార్టీ నాయకత్వం పాత్ర ఉండడం' కాగా, 14వ సూత్రం 'పూర్తి, కఠినమైన పార్టీ పాలనను అమలు చేయడం' గురించి వివరిస్తుంది.

'పార్టీ నిర్మాణానికి సంబంధించిన ఈ రెండు సూత్రాలు చైనా జాతీయ పాలనలో కీలకమైన అంశాలుగా ఉన్నాయి,' అని చైనా వర్గాలు పేర్కొన్నాయి. 'ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సామాజిక, పర్యావరణ అభివృద్ధికి సంబంధించిన అన్ని కార్యక్రమాలు పార్టీ నాయకత్వంపై ఆధారపడి ఉంటాయి. సమగ్రమైన పార్టీ పాలన ద్వారా ముందుకు సాగుతాయి. 'చైనా లక్షణాలతో కూడిన సోషలిజం' జాతీయ అభివృద్ధి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడంలో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడం అనేది ఒక ప్రాథమిక హామీగా పనిచేస్తుందని ఇది పూర్తిగా రుజువు చేస్తోంది.'

వెన్నెల వేసవి
రూ॥60/-
పేజీలు:54
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in


# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

రాజస్థాన్, ముంబయిలలో వర్ష ప్రళయం
అడల్ట్ కంటెంట్‌పై 'మెటా'ను వివరణ కోరిన కేంద్రం
ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు : కాంగ్రెస్ ఆరోపణ 07

సంపుటి 09, సంచిక: 214 | శనివారం | 04-07-2026 | ఖమ్మం
Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**
పేజీలు: 12+8 | వెల రూ. 5.00



# హడలెత్తిస్తున్న 'ఎల్‌నినో'

భారత్ సహా ప్రపంచ దేశాల ఆందోళన

**న్యూఢిల్లీ:** కొంచెం ఆలస్యంగానైనా నైరుతీ రుతు పవనాలు దేశంలోని పలు ప్రాంతాల్లో విస్తరిస్తున్నాయన్న వార్త సంతోషకరమేగానీ, భారత్‌సహా ప్రపంచ వ్యాప్తంగా దేశాలు ఈ ఏడాది 'ఎల్ నినో' పరిస్థితులు ఏర్పడనుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచ వాతావరణ వ్యవస్థలో అత్యంత ప్రభావవంతమైన సహజ వాతావరణ పరిస్థితిగా ఎల్‌నినోను పేర్కోవచ్చు. భూమధ్యరేఖకు సమీపంలోని మధ్య, తూర్పు పసిఫిక్ మహా సముద్ర ఉపరితల జలాల ఉష్ణోగ్రత సాధారణ స్థాయి కంటే ఎక్కువగా పెరిగినప్పుడు ఈ పరిస్థితి ఏర్పడుతుంది. ఈ సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదల వల్ల వాయుమండల పీడనం, గాలుల దిశ, వర్షపాతం పంపిణీ వంటి అంశాలలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటాయి. ఫలితంగా ప్రపంచంలోని అనేక దేశాలలో వాతావరణ పరిస్థితులు అసాధారణంగా మారి వ్యవసాయం, నీటి వనరులు, ఆర్థిక వ్యవస్థ, జీవవైవిధ్యం, మానవ ఆరోగ్యం వంటి అనేక రంగాలపై ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావం చూపుతాయి. ఎల్‌నినో ప్రభావంలో ప్రధానమైనది వర్షపాతం నమూనాలలో వచ్చే మార్పు. సాధారణంగా ఒక ప్రాంతంలో కురవాల్సిన వర్షపాతం తరువాయి 8లో

బిఆర్‌ఎస్ చేసిన అప్పు

# రూ.8,21,651 కోట్లు

- మా రెండున్నరేళ్ల పాలనలో రూ.1,77,000 కోట్లు అప్పు చేశాం
- బిఆర్‌ఎస్ అప్పులకు రూ.2,08,681 కోట్లను బ్యాంకులకు చెల్లించాం
- కెసిఆర్ బయటకు వచ్చి సమాధానం చెప్పాల్సిందే
- వడ్డీలను తగ్గించడంతో రాష్ట్రానికి రూ. 22,142 కోట్లు ఆదా చేశాం
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క




ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో 2014 జూన్ నుంచి 2023 డిసెంబర్ వరకు బిఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో కెసిఆర్ చేసిన అప్పు రూ.8,21,651 కోట్లు అని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తమ రెండున్నరేళ్ల పాలనలో రూ.1,77,000 కోట్లను అప్పు చేశామని, బిఆర్‌ఎస్ చేసిన అప్పులకు రూ.2,08,681 కోట్లను బ్యాంకులకు చెల్లించామని వివరించారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి, వ్యవస్థలను నిర్వీర్యం, రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన కెసిఆర్, ఇప్పుడు తాను రాను అంటే ఎలా ?, బయటకు వచ్చి సమాధానం చెప్పాల్సిందేనన్నారు. మళ్లీ కెసిఆర్ అధికారంలోకి వస్తారని మీరే చెప్పుకుంటున్నారు. అలాంటప్పుడు మధ్యలో మీ పాత్ర ఏమిటి?, మీ చేతిలో ఏముంది' అని కెటిఆర్, హరీశ్‌రావును భట్టి ప్రశ్నించారు. అబద్ధాలను పోగేసి ప్రచారం చేయడం తప్ప, ప్రజలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి భట్టి విక్రమార్క మాట్లాడారు. అబద్ధాలను ప్రచార అస్త్రాలుగా మార్చుకుని, 'గోబెల్స్' ప్రచారానికి పాల్పడటం బిఆర్‌ఎస్‌కు అలవాటుగా మారిందన్నారు. అబద్ధాల పునాదుల పైన ఏ ఆర్థిక వ్యవస్థను నిర్మించలేమని, వాస్తవాలను ప్రజలు గమనిస్తున్నారని వివరించారు. గత పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, అడ్డగోలుగా అప్పులు చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది వాస్తవం కాదా? అని భట్టి ప్రశ్నించారు. ఎఫ్‌ఆర్‌బిఎం,కార్పొరేషన్ల పేరుతో తీసుకున్న ప్రభుత్వ గ్యారంటీ రుణాలు, ఉద్యోగుల పెండింగ్ బిల్లులు, డిస్కంలు, ఉద్యోగుల బాకీలు మొత్తం అన్ని రకాల అప్పులు కలిపితే మొత్తం రూ. 8,21,651 కోట్లు అని వివరించారు. రాష్ట్ర ప్రతిష్టను కాపాడాలన్న ఉద్దేశంతోనే ఇంతకాలం తాము మౌనంగా ఉన్నామని, కానీ అబద్ధపు ప్రచారాలు తరువాయి 8లో



నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో

# నేడు సిఎం పర్యటన

ప్రజాపక్షం/హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శనివారం నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పర్యటించనున్నారు. ప్రజాప్రతినిధిగా తన తొలి విజయానికి వేదికైన మిడ్జిల్ మండలానికి రేవంత్ రెడ్డి సిఎం హోదాలో వెళ్లనున్న పర్యటన రాజకీయంగా ప్రత్యేకత సంతరించుకుంది. రేవంత్ రెడ్డికి రాజకీయ జన్మనిచ్చిన నేలపై ప్రజలకు కృతజ్ఞతలు తెలపడంతో పాటు పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేయనున్నారు. శనివారం ఉదయం ఉదయం 11.45 గంటలకు హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూల్ జిల్లాకు సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరుతారు. 12.30 గంటలకు ఉర్కొండపేట హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ఆంజనేయస్వామి గుడికి వెళ్లి దర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆలయ అభివృద్ధి పనులకు సిఎం భూమి పూజ చేసి శంకుస్థాపన చేయనున్నారు. ఆలయ ఆవరణలో తన తొలి రాజకీయ ప్రయాణంలో వెంట నడిచిన ఆనాటి అనుచరులు, తరువాయి 8లో

తక్కువ ధరకే బంగారం అంటూ

# రూ.2.21 కోట్లు వసూలు


పోలీసులకు ఫిర్యాదు చేస్తే కుటుంబాన్ని అంతం చేస్తానని బెదిరింపులు

ప్రజాపక్షం/హైదరాబాద్

దుబాయ్ నుంచి తక్కువ ధరకే బంగారం దిగుమతి చేసి సరఫరా చేస్తానని నమ్మించి రూ.2.21 కోట్లకు పైగా వసూలు చేసిన వ్యక్తి, అనంతరం డబ్బులు అడిగిన బాధితుడిని కుటుంబంతో సహా చంపేస్తానంటూ బెదిరించిన ఘటనపై హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆర్థిక నేరాల విభాగం దర్యాప్తు ప్రారంభించింది. పోలీసుల వివరాల ప్రకారం సనత్‌నగర్‌కు చెందిన మెకానికల్ ఇంజనీర్ రాకేష్ బలరాం గౌడ్ ఉన్నత విద్య, ఉద్యోగం కోసం కెనడాలో 11 ఏళ్లపాటు పనిచేసి 2022లో స్వదేశానికి తిరిగి వచ్చాడు. 2023లో మహబూబ్‌నగర్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న సమయంలో కె.లక్ష్మీ కాంత్ రెడ్డితో పరిచయం ఏర్పడింది. తక్కువ ధరకే బంగారం బిస్కెట్లు సరఫరా చేస్తానని, దుబాయ్, శ్రీలంక, ముంబై మార్గంలో బంగారం దిగుమతి చేస్తున్నానని వీడియోలు చూపించి నమ్మించాడు. ఈ క్రమంలో 2024 జూన్ 14న మూడు కిలోల (24 క్యారెట్ల) బంగారం తెస్తానని చెప్పి రూ.2 కోట్లు తీసుకున్నాడు. ఇందులో బాధితుడు ఇతరుల నుంచి అప్పుగా తెచ్చిన రూ.96 లక్షలు, బాధితుడివి రూ.90 లక్షలు కూడా ఉన్నాయి. అనంతరం శ్రీలంకలో 10 కిలోల బంగారంతో పట్టు బడ్డానని, కొంత సమయం ఇవ్వాలని చెప్పి కాలయాపన చేశాడు. తర్వాత మరో 500 గ్రాముల బంగారం ఇప్పిస్తానని నమ్మించి 2024 డిసెంబర్ 15, 17 తేదీల్లో మరో రూ.21 లక్షలు తీసుకున్నాడు. ఈ నగదు చెల్లింపులను బాధితుడు వీడియో రూపంలో కూడా రికార్డు చేశాడు. డబ్బులు తిరిగి కోరగా నిందితుడు స్పందించకుండా తప్పించుకోవడంతో పాటు తనను ప్రశ్నిస్తే కిడ్నాప్ చేసి దాడి చేస్తానని, పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఆరేళ్ల కుమారుడిని అపహరించి తరువాయి 12లో

లోయలోకి పాకిస్థాన్ బస్సు బోల్తా

# 40 మంది దుర్మరణం



**క్వెట్టా :** పాకిస్థాన్‌లోని క్వెట్టా నుండి బయలుదేరి పెషావర్‌కు వెళుతున్న ప్రయాణికుల బస్సు లోయపడిపోవడంతో 40 మంది మరణించారు. మరో ఎనిమిదిమంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువమంది పిల్లలు, మహిళలు ఉన్నారు. అత్యంత కఠినమైన పర్వత ప్రాంతంలో ప్రయాణం చేస్తున్న బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి 80 అడుగులు లోతులో ఉన్న లోయలో పడిపోయింది. దురదృష్టం ఏమిటంటే మార్గమధ్యలో పాడైపోయిన మరోబస్సులో ప్రయాణికులు కూడా ఈ బస్సు ఎక్కారు. వారు కూడా ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 48 మంది ప్రయాణికులున్నారు. బలూచిస్థాన్ రాష్ట్రం షేరానీజిల్లా ధనసర్ నుండి బయలుదేరిన బస్సు ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్ర సరిహద్దు దాటి డేరా ఇస్మాయెల్‌లోకి ప్రవేశించిన వెంటనే ఈ విషాద ఘటన జరిగింది. ఈ ప్రమాద ఘటనపై దర్యాప్తు ప్రారంభించినట్లు బలూచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగ్టి చెప్పారు.రెండు రాష్ట్రాలకు చెందిన సహాయ బృందాలు బాధిత కుటుంబాలకు,ప్రయాణికులకు అండగా ఉండి కావాల్సిన సహాయం అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రమాద ఘటన గురించి తెలిసిన వెంటనే ఝూబ్ అత్యవసర బృందాలు,1132 సహాయ బృందాలు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని సహాయ చర్యలు ప్రారంభించాయన్నారు.



ఇందిరమ్మ రాజ్యం అంటే

# ఇండ్ల కూల్చివేతలేనా?

- పేదల గూడు కోసం ఉద్యమించేది కమ్యూనిస్టులే
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి
- గుండ్ల సింగారం వంటా వార్పులో పాల్గొన్న చాడ, తక్కళ్ళపల్లి

ప్రజాపక్షం/హనుమకొండ

పేదలకు ఇందిరమ్మ రాజ్యం తెస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి రాగానే వారి గూడును కూల్చివేయడం దుర్మార్గమని, ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల ఇండ్ల కూల్చివేతలేనా అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం హనుమకొండ జిల్లా పరిధిలోని గుండ్ల సింగారంలోని సురవరం సుధాకర్ రెడ్డి నగర్ లో ఇండ్ల కూల్చివేత జరిగిన విశ్రమించకుండా ఇండ్ల స్థలాలు, గూడు కోసం పేదలు చేపట్టిన భూపోరాటంలో వంటావార్పు కార్యక్రమానికి చాడ వెంకటరెడ్డి, తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు హాజరై తరువాయి 12లో

ఓటరు తప్పు చేస్తే శిక్ష..

# అధికారి తప్పు చేస్తే బాధ్యత లేదా?

ప్రజాపక్షం/హైదరాబాద్




తెలంగాణలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కొనసాగుతోంది. ఎన్నికల సంఘం లక్ష్యం అనర్హుల పేర్లను తొలగించడం. ఈ ప్రక్రియలో ఓటర్లు సరైన సమాచారం ఇవ్వాలని ఎన్నికల సంఘం పదేపదే సూచిస్తోంది. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం సమర్పిస్తే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని కూడా హెచ్చరిస్తోంది. అయితే ఇక్కడ ఒక సహజమైన ప్రశ్న తలెత్తుతోంది. ఓటరు అన్ని సరైన వివరాలు ఇచ్చినా, వాటిని నమోదు చేసే అధికారి నిర్లక్ష్యం వల్ల లేదా తప్పిదం వల్ల పేరు, వయస్సు, చిరునామా, లింగం లేదా ఇతర వివరాలు తప్పుగా నమోదు అయితే దానికి బాధ్యత ఎవరిది? అలాంటి తప్పులకు కూడా జవాబుదారీతనం ఉండాలా లేదా? 2002 ఓటర్ లిస్ట్‌నే తరువాయి 12లో

రాష్ట్రంలో పత్తి ఉత్పాదకత పెంచేందుకు

# 'మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ'

- 100 శాతం సబ్సిడీతో పత్తి విత్తనాల పంపిణీ
- 19 జిల్లాలలో తొలిదశలో 1.27 లక్షల ఎకరాల సాగు లక్ష్యం
- రూ.57.02 కోట్ల సబ్సిడీతో 50,950 మంది రైతులకు లబ్ధి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో పత్తి సాగును లాభసాటిగా మార్చడంతో పాటు ఉత్పాదకతను భారీగా పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది. 2026 వానాకాలం (ఖరీఫ్) సీజన్‌లో ప్రతిష్టాత్మక 'మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ' (ఎంఎస్‌పి) పథకం కింద రైతులకు ఉచితంగా 100 శాతం సబ్సిడీపై పత్తి విత్తనాలను పంపిణీ వ్యవసాయ శాఖ శ్రీకారం చుట్టింది. ఈ పంపిణీ కార్యక్రమం గురువారం లాంఛనంగా ప్రారంభ కాగా కేంద్రం ప్రభుత్వం ఎంపిక చేసిన 19 జిల్లాలలో స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో రైతు వేదికల వేదికగా ఈ విత్తనాలను లబ్ధిదారులకు అందజేయనున్నారు.ఈ పంపిణీ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా, అత్యంత పారదర్శకంగా, అర్హులైన తరువాయి 12లో




ఉద్యోగాలు భర్తీ చేయాలని

# 15న ఇందిరాపార్క్ వద్ద సిపిఐ(ఎం) ధర్నా

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్రంలో 60 లక్షలు, తెలంగాణలో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తెలిపారు. ఈ ధర్నాలో నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారంహైదరాబాద్‌లో తరువాయి 8లో

## రోడ్లపై పశువులు నిర్మాణ సామగ్రితో ప్రమాదాలు

ప్రజాపక్షం/మహదేవపూర్;రోడ్లపై పశువులు,గృహ నిర్మాణానికి అవసరమగు ఇసుక,కంకర లాంటి నిర్మాణ సామాగ్రి పడవేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని రహదారి భద్రతా నియమాలకు విరుద్ధంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై సాంబమూర్తి శుక్రవారం ప్రకటనలో హెచ్చరించారు.గ్రామంలో పశువులను రహదారిపై వదిలివేయడంతో పాటు నిర్మాణ సామాగ్రిని రహదారులపై వేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు.గ్రామ ప్రజలు దీనిని దృష్టిలో ఉంచుకుని రహదారి భద్రతకు బాధ్యతగా సహకరించాలని తెలిపారు.నిబంధనలు ఉల్లంఘించి ప్రజల ప్రాణాలకు,ఆస్తులకు ప్రమాదం కలిగిస్తే చట్టపరమైన చర్యలతో పాటుజరిమానా,సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేస్తామని తెలిపారు .

## ప్లాస్టిక్ అడగొద్దు..వాడవద్దు..



ప్రజాపక్షం /నడికూడ : నడికూడ మండల పరిధిలోని కంఠాత్మకూర్ గ్రామంలోని షాప్ యజమానులందరికీ ప్లాస్టిక్ వాడకంపై గ్రామపంచాయతీ కార్యాలయం నోటీసులు జారీ చేశారు.సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు,గ్లాసులు,ప్లేట్లు వెంటనే నిలిపివేయాలని క్లాత్ బ్యాగ్లు, పేపర్ కవర్లు,ఆకుల దొప్పలు వాడాలని,నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా,షాప్ సీజ్ చేసే అవకాశం ఉందని గ్రామ పంచాయతీ సెక్రెటరి మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల గ్రామం,డ్రైనేజీలు,పొలాలు నాశనం అవుతున్నాయని పశువులు తిని చనిపోతున్నాయని ఇక నుంచి ఒక్క షాపులో కూడా ప్లాస్టిక్ కనిపించకూడదని నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని షాప్కు వెళ్లేటప్పుడు సంచి తీసుకెళ్లండని ప్లాస్టిక్ అడగవద్దు,వాడవద్దు అని గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా మార్చే దిశగా పంచాయతీ పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కారోబార్ మామిండ్ల రమేష్ పాల్గొన్నారు.

## గిరిజన ఫిల్లింగ్ స్టేషన్లో పెట్రోల్, డీజిల్ కొరత..

ప్రజాపక్షం/గూడూరు;గూడూరు మండలంలోని బొల్లెపల్లి శివారులో ఉన్న గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలోని ఫిల్లింగ్ స్టేషన్లో గత కొన్ని రోజులుగా పెట్రోల్ డీజిల్ అందుబాటులో లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఫిల్లింగ్ స్టేషన్లో నాణ్యమైన ఇంధనం లభిస్తుందనే నమ్మకంతో స్థానిక ప్రజలు ఎక్కువగా ఇక్కడే ఇంధనం నింపించుకునే అలవాటు చేసుకున్నారు.అయితే తరచూ ఇంధనం నిల్వలు లేకపోవడంతో వల్ల వారు నిరాశ చెందుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు పెట్రోల్ బంకులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్లు ఇతర వాహనాలను వినియోగించే రైతులు కూడా ఇంధనం లభించక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.సంబంధిత అధికారులు స్పందించి ఫిల్లింగ్ స్టేషన్లో పెట్రోల్ డీజిల్ నిల్వలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు రైతులు కోరుతున్నారు.

## కాళేశ్వరంలో ముమ్మరంగా కొనసాగుతున్న 'సర్' ప్రక్రియ



ప్రజాపక్షం/కాళేశ్వరం;జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుంది.బిఎల్ఓలు శ్రీదేవి,జ్యోతి,సతీశ్ ఆధ్వర్యంలో గ్రామంలోని ఇంటింటికి వెళ్ళి ఓటరు సవరణ పత్రాలు అందించి నమోదు ప్రక్రియను వేగవంతం చేసారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎలాంటి సందేహాలు ఉన్న స్థానిక ఓటర్లు తమకు ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని గ్రామ ప్రజలను ఈ సందర్భంగా బిఎల్ఓలు కోరారు.

## ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ



ప్రజాపక్షం/జనగామ :ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని సిఇఒ,కార్యాలయం ప్రత్యేక బృందం ప్రతినిధి పద్మావతి అన్నారు. బిఎల్ఒల పనితీరు, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ తీరుపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల కార్యాలయం నుండి వచ్చిన ప్రత్యేక బృందం శుక్రవారం క్షేత్ర స్థాయిలో సమీక్షించింది. ఎస్ఐజిసి పద్మావతి నేతృత్వంలోని ప్రత్యేక బృందం జనగామ పట్టణంలోని పోలింగ్ స్టేషన్ నెంబర్ 254,259,270 తో పాటు స్టేషన్ఘనపూర్ మండలంలోని పోలింగ్ స్టేషన్ 111.116, పరిధిలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, ఇంటింటి సర్వే బిఎల్ఒ నిర్వహిస్తోన్న విధులు, ఓటర్లకు అందిస్తున్న అవగాహనను పర్యవేక్షించారు. బిఎల్ఓలు, సూపర్వైజర్లు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి అర్హత ఓటరు ఎన్యుమరేషన్ ఫారం తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని, ఇంటింటికి వెళ్లి ఓటర్లను వ్యక్తిగతంగా కలిసి ఫారాల పంపిణీ పూర్తి చేయాలని, ఫారాలు సక్రమంగా నింపేలా అవసరమైన అవగాహన కల్పించాలన్నారు. ఓటర్ల వివరాలను నమోదు చేసే సమయంలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత జాగ్రత్తతో వ్యవహరించాలని, ప్రతి వివరాన్ని సంబంధిత ఆధారాలతో ధృవీకరించి నమోదు చేయాలన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా అనర్హులు,ద్వంద్వ నమోదులు లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బిఎల్ఓ యాప్ను సమర్థవంతంగా వినియోగిస్తూ క్షేత్ర స్థాయి సమాచారాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే ప్రత్యేక బృందం పలు ఇళ్లను సందర్శించి ఓటర్లతో నేరుగా మాట్లాడి ఫారాలు అందాయా.. సర్వే నిర్వహించారా..వివరాలు పూర్తిస్థాయిలో నమోదు చేశారా అనే అంశాలపై ఆరా తీయడం జరుగుతుందన్నారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ అవసరమైన సూచనలు చేశారు. ఈ పరిశీలనలో జనగామ ఈఆర్ఓ, ఆర్డీఓ గోపిరాం, ఎఇఆర్ఓ, తహశీల్దార్, మహిపాల్రెడ్డి, స్టేషన్ఘనపూర్ ఆర్డీఓ కిరణ్ ప్రకాష్,ఎఇఆర్ఓ వెంకన్న పాల్గొన్నారు.

# అభివృద్దే మా లక్ష్యం

### ప్రతీ డివిజన్‌కూ రూ.10 కోట్లకు పైగా నిధులు

### వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/కాజీపేట :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా ప్రజల అవసరాల ఆధారంగా అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం రహమత్ నగరలోని మస్జిద్ ఆవరణలో అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొట్టి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంఖుస్థాపన చేశాను. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ ఎబిసికేటగిరీ విధానంలో అత్యవసర పనులకు ప్రాధాన్యత ఇస్తూ నిధులు కేటాయించి అభివృద్ధిని వేగవంతం చేశామని చెప్పారు. గత మూడు సంవత్సరాల్లో నియోజకవర్గంలోని ప్రతీడివిజన్‌కు సుమారు రూ.10 కోట్లకు పైగా అభివృద్ధి నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. గతంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు ఉన్న డివిజన్లకు కనీసం రూ.50 లక్షల నిధులు కూడా అందలేదని, ప్రస్తుతం మాత్రం వివక్ష లేకుండా అన్ని డివిజన్లలో సమాన అభివృద్ధి జరుగుతోందని పేర్కొన్నారు.కాజీపేట పోలీస్ స్టేషన్ నుంచి సోమిడి వరకు ప్రధాన రహదారి అభివృద్ధి, అంతర్గత సిసిరోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థల ఏర్పాటు, ఎస్‌సి కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటి పనులు విస్తృతంగా చేపట్టామని తెలిపారు.ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రహ్మత్‌నగర్ మసీదు పరిసర ప్రాంత అభివృద్ధి, మసీదు వద్ద రహదారి నిర్మాణం వంటి పనులను పూర్తి చేయడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు.కమిషన్లు లేదా వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా ప్రజల అభివృద్ధే తమ ధ్యేయమని, చేసిన పనిని ప్రజలు గుర్తించి అభినందించడమే తమకు పెద్ద బహుమతిగా భావిస్తున్నామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు, అధికారులు,ముస్లిం మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## 12న ఎఐటియుసి జిల్లా మహాసభలు



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** ఈ నెల 12న జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లో జరిగే ఎఐటియుసి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతారాజు సతీష్ పిలుపునిచ్చారు. స్థానిక సివిల్ సప్లై గోదాం కార్మికుల తో కలిసి కరపత్రం ఆవిష్కరణ చేసి మాట్లాడుతూ, కార్మిక హక్కుల కోసం నిరంతరం రాజీలేని సమరశీల పోరాటాలు చేస్తూ దేశంలో ఏర్పడ్డ మొట్టమొదటి కార్మిక సంఘం ఎఐటియుసి అని 1920 అక్టోబర్ 31న ముంబై నగరంలోని ఎఐటియుసి ఆవిర్భావం నుండి నేటి వరకు అనేక పోరాటాల్లో ముందు వరుసలో ఉండి కార్మిక సమస్యలు పరిష్కరించే దిశగా ముందుకు వెళుతూ ఉందన్నారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ పేరుతో కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లిస్తూ వెట్టి చాకిరి చేయిస్తుందన్నారు. కనీస వేతనాలు పిఎఫ్ ఇఎస్ఐ అమలకు నోచుకోవడం లేదన్నారు. అసంఘటితరంగా కార్మికులకు సమగ్ర చట్టాలు చేయడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. జిల్లాలో ఉన్న కార్మికులందరూ పెద్ద ఎత్తున ఈ జిల్లా మహాసభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై నాయకులు ఆరేపల్లి సమ్మయ్య, కట్కూరి కుమారస్వామి, బండారి మధుకర్, శిలపాక నాగరాజు, ముత్యాల మొగిలి, బోయిన కిరణ్, గుర్రం దేవరాజ్, నందిపాట రమేష్, పర్లపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## లారీ అసోసియేషన్ అభివృద్ధికి కృషి



### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** లారీ అసోసియేషన్ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానని, అసోసియేషన్ బిల్డింగ్ నిర్మాణం కోసం రూ.5 లక్షల నిధులు కేటాయిస్తున్నానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హామీ ఇచ్చారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోనిది కాకతీయ ఖని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ముందుగా పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేయగా అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సత్యనారాయణ రావు మాట్లాడుతూ, నియోజకవర్గ బిల్డింగ్ అభివృద్ధి కోసం నా వంతుగా ఐదు లక్షల ఇస్తానని ప్రకటించారు. అసోసియేషన్ అభివృద్ధికి వారి సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని హామీ అన్నారు. మీరంతా కలిసికట్టుగా ఐకమత్యంగా ఉండి మీ సమస్యలను పరిష్కరించుకునే విధంగా అసోసియేషన్ ముందుకు సాగాలని ఎమ్మెల్యే సూచించారు. కోల్డ్ ట్రాన్స్పోర్ట్ టెండర్లను లారీలకే అప్పగించే విధంగా చూస్తానని, ఆటోనగర్ ఏర్పాటు కోసం స్థలం కేటాయించి దానికి సంబంధించిన ఏర్పాట్లను పరిష్కరిస్తానని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కాకతీయ కానీ లారీ అసోసియేషన్ అధ్యక్షులు పులి వేణుగోపాల్ గౌడ్, డిసిసి అధ్యక్షుడు బట్టు కరుణాకర్ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, అసోసియేషన్ ఉపాధ్యక్షులు కౌటం సురేందర్, సహాయ కార్యదర్శి మేకల శ్రావణ్, కోశాధికారి చిత్తారి , ప్రధాన కార్యదర్శి బొంతల రాజు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## వరంగల్ ఈస్ట్‌లో 'సర్' నమోదు ప్రక్రియ

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/ వరంగల్ :** వరంగల్ ఈస్ట్ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్ణీత గడువులోగా వంద శాతం పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఇఆర్ఒలు, సూపర్‌వైజర్లు, బిఎల్ఒలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ఖచ్చితంగా నిబంధనలు పాటిస్తూ ప్రతి బిఎల్ఒ తమ పోలింగ్ కేంద్ర పరిధిలోని ప్రతి ఇంటిని స్వయంగా సందర్శించి ఓటరు వివరాలను నమోదు చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో పేరు మిస్ కాకుండా చూడాలని, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, ఇతర సవరణలను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. వరంగల్ ఈస్ట్‌లో ఇప్పటివరకు ఎంత శాతం ఎస్ఐఆర్ నమోదు పూర్తయిందో, ఏ ప్రాంతాలు వెనుకబడి ఉన్నాయో ఈ ఆర్ఓలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, వెనుకబడిన ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ద్వారా రూపొందించే ఓటరు జాబితా పారదర్శకంగా, లోపాలు లేకుండా, నాణ్యతతో కూడినదిగా ఉండాలని, ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా పునాది అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

**ట్రాన్స్‌జెండర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి...**

వరంగల్ ఈస్ట్ పరిధిలో కొందరు ట్రాన్స్‌జెండర్లు ఎస్ఐఆర్ నమోదుకు ముందుకు రావడంలో సంకోచిస్తున్నట్లు అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, స్పందించిన కలెక్టర్ ప్రతి పౌరుడికి ఓటు హక్కు రాజ్యాంగబద్ధమైన హక్కు అని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లు కూడా దేశ పౌరులేనని, వారిలో ఉన్న అపోహలను తొలగించి ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించి వంద శాతం నమోదు జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలోఅదనపు కలెక్టర్లు సంధ్యారాణి, వైవి గణేష్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, వరంగల్ ఆర్డీవో సుమ తో పాటు సంబంధిత అధికారులు సూపర్వైజర్లు, బిఎల్ వో లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చడమే లక్ష్యం

### పరకాల ఎమ్మెల్యే రేవూరి

**ప్రజాపక్షం/పరకాల :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నదని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం పరకాల మండలం పోచారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పోచారం, నాగారం గ్రామాలలో నిర్మించిన అంగన్వాడీ భవనాలు, నాగారం, లక్ష్మీపురం, హైబోద్ పల్లి గ్రామాలలో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం అంగన్వాడీ చిన్నారులకు అక్షరాభ్యాసం, స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. సంక్షేమ కార్యక్రమాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని,ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని,పార్టీలకు అతీతంగా ప్రతీ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం అన్నారు.వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణయందు విద్యార్థులతో కలసి మొక్కలను నాటారు.

## సింగరేణిని రాజకీయ వేదికగా మార్చొద్దు

### ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సింగరేణి బొగ్గు ఉత్పత్తి, గణాంకాల అంశంపై మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడాలనుకుంటే దానికి సరైన వేదిక తెలంగాణ శాసనసభ. అక్కడ ప్రభుత్వం సమాధానం చెబుతుంది. అవసరమైతే సింగరేణి యాజమాన్యం కూడా అధికారికంగా వివరణ ఇస్తుంది. కానీ గనులపైకి వచ్చి పదేపదే మీడియా సమావేశాలు నిర్వహిస్తూ సింగరేణి సంస్థను రాజకీయ వివాదాల్లోకి లాగడం వల్ల సంస్థ ప్రతిష్ట, పరపతి దెబ్బతింటుందని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలే కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావుపై మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. 2017లో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు 7.5 మిలియన్ టన్నుల అదనపు బొగ్గు ఉత్పత్తి చూపించారని, అప్పట్లో ప్రస్తుతం మీ పార్టీలో ఉన్న ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ బహిరంగంగా విమర్శించిన విషయం అందరికీ తెలిసిందే. అప్పుడు మౌనం వహించిన వారు, ఇప్పుడు నీతులు చెప్పడం రాజకీయ అవకాశవాదానికి నిదర్శనం. మేము ఈవిధానాన్ని తప్పు పడుతున్నాము. ప్రభుత్వం ఎవరిదైనా, తప్పు జరిగితే ప్రశ్నించడం మా విధానం. బొగ్గు ఉత్పత్తి గణాంకాలపై అనుమానాలు ఇవాళ కొత్తగా వచ్చినవి కావు. సింగరేణి ప్రతిష్టకు భంగం కలిగించే రాజకీయాలను ఎవరు చేసినా తీవ్రంగా వ్యతిరేకిస్తాం. మా యూనియన్ గౌరవ అధ్యక్షులు కూనంనేని సాంబశివరావు ఎమ్మెల్యే మిమ్మల్ని ఎల్లప్పుడూ "హరీష్‌రావు" అని గౌరవంగా సంబోధించారు. విభేదాలు ఉండవచ్చు, విమర్శలు చేయవచ్చు. కానీ వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసే భాషను ఉపయోగించడం ప్రజాస్వామ్య సంస్కృతికి తగదు. రాజకీయాల్లో పరస్పర గౌరవాన్ని పాటించడం ప్రతి నాయకుడి బాధ్యత అన్నారు.మణుగూరు డీప్‌సైడ్ బ్లాక్ సింగరేణికే కేటాయించాలని నిరాహార దీక్షలు చేస్తున్న సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నకు మా గౌరవ అధ్యక్షులు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇచ్చిన సమాధానాన్ని కావాలనే వక్రీకరించడం దురుద్దేశపూరితం. కార్మికుల గౌరవాన్ని, సంస్థ విశ్వసనీయతను కాపాడాలన్నదే ఆయన ఉద్దేశం. సింగరేణిని రాజకీయాలకు అతీతంగా ఉంచడం, కార్మికుల హక్కులను కాపాడడం, సంస్థ ప్రతిష్టను పరిరక్షించడం, సంస్థ భవిష్యత్తును సురక్షితంగా ఉంచడం ఎఐటియుసిలక్ష్యం.ఈవిషయంలో కార్మిక సోదరులు ఐక్యమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## యూరియా యాప్‌తో రైతులకు తిప్పలు

### మహబూబాబాద్ జిల్లా సిపిఐ కార్యదర్శి బి. విజయ్ సారథి

**ప్రజాపక్షం/గూడూరు;** మహబూబాబాద్ జిల్లా గూడూరు కొత్తగూడ గంగారం బయ్యారం గార్ల తదితర ఏజెన్సీ మండలాల్లో యూరియా పంపిణీ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న యాప్ రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆండ్రాయిడ్ ఫోన్లు లేకపోవడం మొబైల్ నెట్ వర్క్ సరిగా అందుబాటులో లేకపోవడంతో యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవడం సాధ్యం కావడం లేదని వారు చెబుతున్నారు. అంతేకాకుండా ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ఏజెన్సీ ప్రాంతం రైతులు కోరుతున్నారు.ఇదిలా ఉండగా ఎరువుల ధరలు కూడా భారీగా పెరగడంతో చిన్న సన్నకారు రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచడంతో పాటు ధరలను నియంత్రించాలనివారుడిమాండ్‌చేస్తున్నారు.

**యూరియా యాప్ సేవలను వెంటనే రద్దు చేయాలి**

రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్న యూరియా యాప్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎరువుల ధరలను తగ్గించి అందరి రైతులకు సకాలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. యాప్ కారణంగా రైతులకు యూరియా అందకపోతే ఇప్పటికే పెట్టిన పెట్టుబడి వృథాకావడంతో పాటు పంటలు కూడా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లో స్మార్ట్‌ఫోన్లు నెట్‌వర్క్ సమస్యల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సమస్యకు ప్రభుత్వం తక్షణ పరిష్కారం చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు,

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మరింత పురోగతి



**ప్రజాపక్షం/జనగామ :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మరింత పురోగతి సాధించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. గుడిసెల్లో నివసించే పేదలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు పక్కా ఇళ్లు అందే విధంగా కృషి చేయాలన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. రెండవ విడతకు సంబందించి గుడిసెల్లో నివసించే నిరుపేదలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, అర్హులైన వారిని మాత్రమే ఎంపిక చేయాలన్నారు. అనర్హులు లబ్ధిపొందకుండా పూర్తి స్థాయిలో పరిశీలించాలన్నారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేస్తూ గ్రౌండిగ్, బేస్‌మెంట్, రూఫ్ ధవల వారిగా పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ ప్లాగ్‌షిప్ కార్యక్రమమైన ఇందిరమ్మ ఇళ్లం నిర్మాణం పురోగతి సాధించేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ పిడి మాతృనాయక్, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

**పారదర్శకంగా పరీక్షల నిర్వాహణ**

జిల్లా స్థాయిలో వివిధ ప్రభుత్వ శాఖల్లో అవుట్ సోర్సింగ్ ప్రాతిపధికన భర్తి చేయనున్న పోస్టుల నియామక ప్రక్రియను పూర్తి పారదర్శకతతో నిబంధనలకు అనుగుణంగా నిర్వయించినట్లు జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వయించిన నియామక పరీక్షల సరళిని శుక్రవారం కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బెన్షాలోమ్‌తో కలిసి జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించేలా పరీక్షలను నిష్పక్షపాతంగా నిర్వయించడం జరిగిందన్నారు. జులై 2న వ్యవసాయ విస్తరణ అధికారి పోస్టులకు ఉదయం 11 గంటల నుండి 12.30 గంటల వరకు పరీక్ష జరిగిందని, 111 మంది ధరఖాస్తు చేసుకోగా 94 మంది హాజరై పరీక్షలు రాశారన్నారు. జులై 3న వైద్య శాఖకు సబందించి ల్యాబ్ టెక్నిషన్ పోస్టులకు ఉదయం 11 గంటల నుండి 12.30య గంటలకు వరకు విద్యాశాఖకు సంబందించి పార్ట్ టైం టీచర్ పోస్టులకు మద్యాహ్నం 1 గంటల నుండి 2.30 గంటల వరకు పరీక్షలు నిర్వయించడం జరిగిందన్నారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

## ప్రతీ పేదవాడి ఇంటి కలలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/పాలకుర్తి:** ప్రతి పేదవానికి ఇంటిని నిర్మించి వారి కలలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మండలంలోని తొర్రూరు జె గ్రామంలో నూతనంగా స్వర్ణ గోనె అనసూర్య, రేణుక, భాగ్యమ్మ నూతన ఇందిరమ్మ ఇండ్లను ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్ పర్సన్ లావుడియ మంజుల భాస్కర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ నాయకులు బాలరాజు, సంపత్, మైసిరెడ్డి, కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ కిరణ్, మల్లారెడ్డి, కార్తీక్ రెడ్డి, మధు, ప్రభాకర్, సోమన్న, సోమయ్య, ఐలయ్య, మహేందర్, కుమార్, ఆదినారాయణ, దామోదర్ రెడ్డి, సోమ నారాయణ, పాల్గొన్నారు.

**అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**

రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల సంక్షేమమే ధేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గీత కార్మికులకు రక్షణ కిట్లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్లు గీత కార్మికుల భద్రతకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వృత్తి నిర్వహణలో ప్రమాదాలను తగ్గించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. సీఎం నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం అన్ని వృత్తి వర్గాల సంక్షేమమే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ డిబిఒ నరసింహారావు, జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ అంజిరెడ్డి, పాలకుర్తి ఎక్సైజ్ సిఐ సంతోష్ రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ మంజుల భాస్కర్, అండాలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్‌లు, నాయకులు, గీత కార్మికులు పాల్గొన్నారు.



## ఏజెన్సీ ప్రాంతంలో కంటి దవాఖానాతో ప్రజలకు మేలు

సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి :** ఆళ్లపల్లి మండల కేంద్రంలోని భగత్‌సింగ్ సెంటర్‌లో దేవ్‌విజన్ సెంటర్ అండ్ ఆప్టికల్స్ ప్రారంభోత్సవానికి శుక్రవారం ముఖ్య అతిథిగా సిపిఐ కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా పాల్గొని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో కంటి దవాఖాన పెట్టడం వలన ఇక్కడ ప్రజలు సుదూర ప్రాంతాలకు పోకుండా ఇక్కడే కంటి పరీక్షలు చేసుకుని అవసరమైన కళ్ళజోళ్ళు ఇవ్వడం వలన ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. అలాగే ఇక్కడ ప్రజలు ఆర్థికంగా వెనకబడి ఉండటం వల్ల బీద ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి ఉచిత ఆపరేషన్లు నిర్వహించే విధంగా యాజమాన్యం దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ఆయన కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఆళ్లపల్లి యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గంగమ్మ తల్లి ఆలయానికి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, మాజీ వైస్ ఎంపిపి రేసు ఎల్లయ్య, ప్రొప్రైటర్ కండె దేవేందర్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి వజ్జ పగడయ్య, వార్డు సభ్యులు సీత, సిపిఐ నాయకులు మలిపెద్ది లాజర్, ముక్తార్ పాషా, గుంతోజు శివ, ముస్తాక్, కందిమల్ల రాజు, నరెడ్ల బిక్షం, కసనబోయిన నరేష్, ఎల్లబోయిన ఉప్పలయ్య, రేసు సురేందర్, గోగ్గల రాజేందర్, శ్రీరామ్, హరీష్, నాతి దుర్గేష్, కుంట వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్‌ఓలు బాధ్యతాయుతంగా పనిచేయాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** బిఎల్‌వోలు బాధ్యతాయుతంగా పనిచేసి సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎఎల్ఎంటిలు, ఎఇఆర్‌వోలు తెలిపారు. సర్ కార్యక్రమంపై శుక్రవారం ఖమ్మం నగరంలో బిఎల్‌ఓలకు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఓటరు వివరాలను ఖచ్చితంగా సేకరించి పరిశీలించిన అనంతరం ఖచ్చితంగా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. శిక్షణ సందర్భంగా బిఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న పనితీరును పరిశీలిస్తూ ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్ల వివరాలను నమోదు చేస్తున్నారా, సమాచారాన్ని యాప్‌లో సక్రమంగా నమోదు చేస్తున్నారా అనే అంశాలను పరిశీలించారు. ప్రతి ఓటరుకు సంబంధించిన వివరాలు ఖచ్చితంగా నమోదు కావడంతో పాటు మ్యాపింగ్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.



## సైబర్ నేరాలకు పాల్పడుతున్న మహిళ అరెస్ట్

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : ఆన్‌లైన్‌లో ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి లక్షల రూపాయలు దోచుకున్న సైబర్ నేరస్తురాలని ఖమ్మం సైబర్‌క్రైం పోలీసులు కేరళ రాష్ట్ర త్రివేంద్రం సిటిలో అరెస్టు చేసినట్లు పోలీసు కమిషనర్ సునిల్ దత్ తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. త్రివేంద్రంకు చెందిన మహిళా న్యాయవాది ఆర్యదాస్ శైలజ ఖమ్మం జిల్లాకు చెందిన ఒక ప్రైవేట్ ఉద్యోగికి వాట్సప్‌లో పరిచయం అయింది. తరచూ ఫోన్, చాటింగ్ చేస్తూ పరిచయం పెంచుకుంది. తాను కేరళ రాష్ట్రంకు చెందిన న్యాయవాదినని ఆన్‌లైన్‌లో తక్కువ పెట్టుబడులు పెడితే ఎక్కువ లాభాలు సంపాదించవచ్చని నమ్మబలికింది. అందుకు సంబంధించి ఎనమ్ ఆసెట్ మెనేజ్‌మెంటు పోర్ట్‌ఫోలి లిమిటెడ్ కంపెనిలో ట్రేడింగ్ ద్వారా పెట్టుబడులుపెట్టి లాభాలు పొందాలని చెప్పింది. ఆమె మాటలు నమ్మిన సదరు ఉద్యోగి వాట్సాప్, ట్రేడింగ్ లింకుల ద్వారా సుమారు 15 లక్షల రూపాయల వరకూ పెట్టుబడులు పెట్టాడు. కొంత కాలానికి ఆమె నుంచి ఎంతకు స్పందన రాకపోవడంతో మోసపోయినట్టు గుర్తించి సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించిన సైబర్ పోలీసులు చివరి సారిగా రెండు లక్షల రూపాయలు పంపిన బ్యాంక్ అకౌంట్ ఆధారంగా కేరళలోని త్రివేంద్రంకు చెందిన మహిళా న్యాయవాదిగా గుర్తించారు. సిపి సునిల్‌దత్ ఆదేశాల మేరకు సైబర్ డిస్ఫి ఫణింధర్ నేతృత్వంలో బృందం త్రివేంద్రంకు చేరుకుని ఆమెను ఆరెస్ట్ చేశారు. సదరు నిందితురాలు ఖమ్మం జిల్లానే కాకుండా వివిధ రాష్ట్రాలలో ఇదే తరహాలో 38 క్రైం లింకుల కేసులో 3 కోట్ల రూపాయల వరకూ వసూలు చేసినట్లు గుర్తించారు. ట్రాన్సిట్ వారంటె పై నిందితురాలు ఆర్యదాస్ శైలజను శుక్రవారం ఖమ్మం తీసుకువచ్చి స్థానిక సైబర్ క్రైం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన సైబర్ క్రైం డిఎస్‌పి సిహెచ్‌ఆర్‌వి ఫణింధర్, సిఐ రవికుమార్, ఎస్సైలు రంజిత్‌కుమార్, విజయ్‌కుమార్, సైబర్ క్రైం స్టేషన్ సిబ్బందిని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అభినందించారు.

## ప్రభుత్వ వైద్య సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి

డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ డి.రామారావు

**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం :** జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అన్ని వైద్య సంస్థల్లో సేవల నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు తెలిపారు. ఖమ్మం నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు తెలిపారు. ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో ఉన్న వేగ వేగ హోమియోకేర్ క్లినిక్ ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, అనంతరం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, ఖమ్మంలో ఉన్న జిల్లా క్షయ వ్యాధి నివారణ కేంద్రం, పాలియెటివ్ కేర్ సెంటర్, డయాబెటిక్ సెంటర్, రేడియోలోజీ డిపార్మెంట్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలు, రోగుల నమోదు వివరాలు, చికిత్స విధానం, రికార్డుల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, అవసరమైన మందులు, పరికరాల లభ్యత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులకు వేచి ఉండే సమయాన్ని తగ్గిస్తూ సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంలో పనిచేయాలని సూచించారు. అదేవిధంగా ప్రతి రోగికి ప్రభుత్వ ఆసుపత్రిల్లో అందుబాటులో ఉన్న వైద్యసేవలను పూర్తిస్థాయి అందించడంతో పాటు, పరిశుభ్రమైన వాతావరణాన్ని నిర్వహించాలని, రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డి రామారావు ఆదేశించారు.

# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

రూ.2.93 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/పాల్వంచ :** శాశనసభ ఎన్నికలలో నన్ను నమ్మి అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల పరిధి రేగులగూడెం, చంద్రాలగూడెం, బంజెర, మల్లారం, మందరెకలపాడు తదితర గ్రామాలలో శుక్రవారం పలు గ్రాంట్ల ద్వారా విడుదలైన రూ.2.93 కోట్ల విలువైన పలు అంతర్గత రహదారులు, బిటి రోడ్స్ రెన్యువల్ లాంటి పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. దీనిలో రేగులగూడెం నుండి మామిడిగూడెం వరకు లక్ష్మీదేవిపల్లి నుండి మల్లారం వరకు బిటి రోడ్ రెన్యువల్ నిర్మాణ పనులకు 1.40లక్షలు కేటాయించారు. అనంతరం ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గంలో గ్రామీణ ప్రధాన రహదార్ల నిర్మాణాలు ఇప్పటికే తుది దశకు చేరుకొన్నాయని తెలిపారు. అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, బిటి రెన్యూవల్స్ పనులు సైతం ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడుతూ నిధులను వెచ్చిస్తున్నామని స్పష్టం చేశారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నానని అన్నారు. తనను నమ్మి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి ఆకాంక్షల మేరకు నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నామని ధీమా వ్యక్తం వ్యక్తం చేశారు. కెటిపిఎస్ విస్తరణ, పాల్వంచ స్థలాల క్రమబద్ధీకరణ, విమానాశ్రయం, ఓఆర్ రోడ్లు, పరిశ్రమల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వాటిని సాధించి ప్రజలకు బహుమతిగా ఇచ్చేవరకు విశ్రమించబోనని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్‌పాషా, కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, నయిమ్ ఖురేషి, కాంగ్రెస్ నాయకులు ఎర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, తహసీల్దార్ దారా ప్రసాద్, పంచాయతీరాజ్ డిఇ రాజశేఖర్, సిపిఐ నాయకులు కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, వైఎస్ గిరి, వేములపల్లి శ్రీనివాసరావు, ఆలపాటి ప్రసాద్, దారా శ్రీను, చిల్ల క్రిష్ణ, సమ్మయ్య, వెంకటముత్యం, వాసు, అమృతరావు, చర్ప రాజేష్, సర్పంచులు, ఉపసర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఇవిఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఆర్డీఓ కార్యాలయం ఆవరణలో ఉన్న ఇవిఎం గోదామును కలెక్టర్ అంకిత్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు భద్రతా ఏర్పాట్లను ప్రతీ నెలా క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే పరిశీలించినట్లు చెప్పారు. తనిఖీల్లో భాగంగా ఇవిఎంలు, వివిప్యాట్లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించడంతో పాటు సిసి కెమెరా నియంత్రణ గదిని సందర్శించి కెమెరాల పని తీరును రికార్డింగ్ వ్యవస్థను తనిఖీ చేశారు. గోదాము పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, భద్రతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అనుమతి లేని వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ గోదాములోనికి అనుమతించరాదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. అనంతరం తనిఖీ రిజిష్టర్‌లో సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీఓ మధు, ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయికృష్ణ, ఎన్నికల సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిని రాజకీయ వేదికగా మార్చొద్దు

తప్పు జరిగితే ప్రశ్నించడమే మా విధానం

కూనంనేని వ్యాఖ్యలను ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తున్నారు

గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి సంస్థను రాజకీయ వేదికగా వినియోగించుకోవడం మానుకోవాలని, కార్మికుల చెమటచుక్కలను స్వప్రయోజనాలకు వాడుకోవద్దని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన 'ప్రజాపక్షం'తో మాట్లాడుతూ కార్మికుల చెమటచుక్కలను రాజకీయ స్వప్రయోజనాల కోసం వాడుకోవద్దని హితవుపలికారు. బొగ్గు ఉత్పత్తి గణాంకాలపై చర్చించాలనుకుంటే సరైన వేదిక శాసనసభే అని, గనుల వద్ద మీడియా సమావేశాలు నిర్వహించడం ద్వారా సింగరేణి ప్రతిష్ట దెబ్బతింటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా బొగ్గు ఉత్పత్తి గణాంకాలపై తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తిన విషయాన్ని ఆయన గుర్తుచేస్తూ అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా తప్పు జరిగితే ప్రశ్నించడమే తమ విధానమని స్పష్టం చేశారు.

రాజకీయ అవసరాలకు అనుగుణంగా సింగరేణిని వివాదాల్లోకి లాగడం సరైంది కాదని, సంస్థ ప్రతిష్టకు భంగం వాటిల్లే చర్యలను ఎఐటియుసి ఎప్పటికీ వ్యతిరేకిస్తూనే ఉంటుందని తెలిపారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) గౌరవ అధ్యక్షుడు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వాస్తవపు వ్యాఖ్యలను ఉద్దేశపూర్వకంగా వక్రీకరించారని రాజ్‌కుమార్ ఆరోపించారు. బొగ్గు చోరీకి గురికాలేదని మాత్రమే కాకుండా తప్పుడు ఉత్పత్తి లెక్కలు చూపించడం కూడా తప్పేనని ఆయన స్పష్టంగా చెప్పారని వివరించారు. కార్మికులు అయోమయానికి గురికాకూడదనే ఉద్దేశ్యంతోనే ఆ వ్యాఖ్యలు చేశారని చెప్పారు. రాబోయే సింగరేణి సంస్థ గుర్తింపు సంఘం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సంస్థను రాజకీయ ప్రచారానికి వాడుకోవడం మానుకోవాలని ఆయన హితవు పలికారు. గనులపై, అధికారులపై అనవసరపు ఒత్తిడి తేవడం వల్ల కార్మికుల్లో అభద్రతాభావం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణిని రాజకీయాలకు అతీతంగా ఉంచడం, కార్మికుల హక్కులను పరిరక్షించడం, సంస్థ ప్రతిష్టను కాపాడం, భవిష్యత్‌ను సురక్షితం చేయడమే సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) లక్ష్యమని చెప్పుకొచ్చారు. ఈ విషయంలో కార్మికులంతా ఐక్యంగా ఉండాలని కొరిమి రాజ్ కుమార్ పిలుపునిచ్చారు.



## ఘనంగా మెకానిక్‌ల దినోత్సవం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రపంచ ద్విచక్ర వాహన మెకానిక్‌ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఖమ్మం నగర టూ వీలర్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో మెకానిక్ డే సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ బుల్లెట్ అన్వర్ షాప్ నందు వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో యూనియన్ అధ్యక్షులు వంగాల కొండలరావు పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ కష్టపడి పనిచేసే మెకానిక్‌లకు యూనియన్ తరుపున నిరంతరం అండగా ఉంటున్నామన్నారు. సభ్యత్వం కలిగిన ప్రతి మెకానిక్‌కు యూనియన్ ఎల్లప్పుడు తోడుగా ఉంటుందన్నారు. మెకానిక్ కుటుంబంలోని చదువుకున్న విద్యార్థులకు యూనియన్ తరుపున ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. ఆపదలో ఉన్న మెకానిక్ సోదరులకు యూనియన్ తరుపున ఆపన్న హస్తం అందిస్తున్నామన్నారు. ప్రభుత్వపరంగా మెకానిక్ సోదరులకు ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి దుంపల నాగరాజు, జహంగీర్, షేక్ అబ్బాస్, మేడి పాండు, మెకానిక్ సోదరులు పాల్గొన్నారు.



## ప్రతీ గ్రామంలోనూ ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

ఖమ్మం అడిషనల్ కలెక్టర్ శ్రీజ

**ప్రజాపక్షం/ఏన్కూరు:** గ్రామంలో ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతల నిర్మాణం త్వరగా చేపట్టాలని ఖమ్మం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీజ తెలిపారు. మండల పరిధిలోని భగవాన్‌నాయక్ తండ గ్రామంలో శుక్రవారం ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంటల నిర్మాణాన్ని ప్రతి ఒక్కరు నిర్మించుకోవాలని కోరారు. పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. భూగర్భ జలాలను పెంచేందుకు పంట పొలాల్లో పంట కుంటలను నిర్మించేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో వైరా ఏడిఏ కరుణ శ్రీ, ఏవో నరసింహారావు, ఎంపీఓ జేవీఎస్ నారాయణ, గ్రామ పంచాయితీ సర్పంచ్ మణి, పంచాయితీ కార్యదర్శి మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

# పండుగలా వనమహోత్సవం

విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు, ప్రజలతో భారీ వనమహోత్సవ ర్యాలీ

మొక్కలు నాటిన ఎమ్మెల్యే దంపతులు





**ప్రజాపక్షం/సత్తుపల్లి :** సత్తుపల్లి పట్టణంలో ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన వన మహోత్సవ కార్యక్రమం పండుగలా జరిగింది. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారి ఆశా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, సంస్థ ఫౌండర్, రాష్ట్ర నాయకుడు దయానంద్ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో సుమారు 15 వేల మందితో భారీ వనమహోత్సవ ర్యాలీ వైభవంగా సాగింది. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమం సత్తుపల్లి పట్టణ చరిత్రలోనే అతిపెద్ద పర్యావరణ ర్యాలీలలో ఒకటిగా నిలిచింది.

జెవిఆర్ కాలేజ్ గ్రౌండ్‌లో ప్రారంభమైన కార్యక్రమానికి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి, జిల్లా కలెక్టర్ దివాకర్ ముఖ్య అతిథులుగా హాజరై వనమహోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం జెవిఆర్ కాలేజ్ నుంచి పాత సెంటర్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన వేలాది మంది విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు, యువత, ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతు ప్రకటించారు. ర్యాలీలో జానపద కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులతో కలిసి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ ర్యాలీలో పాల్గొని వారితో మమేకమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ మాట్లాడుతూ ఇంత భారీ స్థాయిలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని, తాను ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలతో నిర్వహించిన పర్యావరణ కార్యక్రమంలో పాల్గొనడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ రిహానా కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, వార్డ్ కౌన్సిలర్లు, ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నర్సింహారావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్రతీ అర్హుడూ ఓటరు జాబితాలో ఉండాలి



మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో ఉండేలా బిఎల్‌వోలు, బిఎల్ఎలు కృషి చేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఖమ్మం నగరంలో పలు ప్రాంతాల్లో బిఎల్‌వోలు చేపట్టిన ఎన్యూమరేషన్ ప్రక్రియను మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీకి చెందిన బూత్ లెవల్ ఏజెంట్లతో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఫోన్ ద్వారా సమావేశంలో పాల్గొని బిఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికీ సమర్థవంతంగా తీసుకెళ్లాలని, అర్హులైన ప్రతి ఓటరుకు సహాయం అందించాలని, పార్టీ బలోపేతానికి అంకిత భావంతో పనిచేయాలన్నారు. అనంతరం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఇంటినీ సందర్శించి ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. ఫారాలు నింపడంలో ఇబ్బందులు ఎదుర్కొనే వారికి సహకారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాల కృష్ణ, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, నాయకులు పగడాల నాగరాజు, బత్తుల మురళి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

**ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసిన మాజీ మంత్రి పువ్వాడ :** ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తమ కుటుంబ సభ్యుల ఎన్యూమరేషన్ ఫారాలను సంబంధిత బిఎల్‌వో షాహీన్ కమల్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

# నకిలీ నెంబర్ ప్లేట్లతో ఇసుక అక్రమ రవాణా

మూడు లారీలు, ఎస్కార్ట్ కారు సీజ్

నలుగురు అరెస్ట్...ఒకరు పరార్



**ప్రజాపక్షం/వైరా :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ హైదరాబాద్‌కు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు లారీలతో పాటు ఓ లారీకి ఎస్కార్ట్ వాహనంగా ఉన్న కారును గురువారం రాత్రి వైరా పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. ఈ అక్రమ ఇసుక వ్యాపారాన్ని నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఒకరు పరారీలో ఉన్నారు. అరెస్ట్ చేసిన నలుగురు వ్యక్తులను మధిర కోర్టులో రిమాండ్‌కు తరలించారు. ఈ అక్రమ వ్యాపారం చేస్తూ పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునేందుకు నిరంతరం అక్రమ ఇసుక లారీలకు ఎస్కార్ట్ వాహనం కార్ ఏర్పాటు చేసుకొని మారుకు నకిలీ రిజిస్ట్రేషన్ నెంబర్లు మారుస్తూ అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నారు. వారి వద్ద ఉన్న నకిలీ నెంబర్లు తయారు చేసే రేడియం స్టిక్కర్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వైరా ఎస్సై పుప్పాల రామారావు తెలిపిన వివరాలు ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ,తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు ఇసుక రీచ్ నుంచి తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు నిరంతరం ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. గురువారం సాయంత్రం వైరా ఎస్సై పుప్పాల రామారావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సోమవారం గ్రామ సమీపంలో ఉన్న గ్రీన్ ఫీల్డ్ హైవే ఎగ్జిట్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో కొవ్వూరు నుంచి హైదరాబాద్‌కు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు లారీలను, ఎస్కార్ట్‌గా ఉన్న ఒక స్విఫ్ట్ డిజైర్ కారును పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. కారును పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. అంతే కాకుండా పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునేందుకు లారీలు, ఎస్కార్ట్‌గా ఉన్న కారు నెంబర్లను నిరంతరం మార్చేందుకు ఉపయోగించే రేడియం స్టిక్కర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న నల్గొండ జిల్లాకు చెందిన లారీ యజమానులు, నల్గొండ జిల్లాకు చెందిన లారీ యజమానులు, డ్రైవర్లు, ఇస్లావత్ భిక్షు, ముక్కుమాల యాదయ్య, దామ సైదులు, వాంకుడోత్ లింగా నాయక్, బచ్చుబోయిన యాదయ్యలపై వైరా పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిలో బచ్చుబోయిన యాదయ్య పరారీలో ఉండగా, మిగిలిన నలుగురిని అరెస్ట్ చేసిన మధిర కోర్టులో రిమాండ్‌కు పంపారు. ఈ సందర్భంగా ఎస్సై పుప్పాల రామారావు మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేసే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం నిఘా ఉంచుతామని స్పష్టం చేశారు. ఇసుక అక్రమ రవాణా సమాచారాన్ని ప్రజలు పోలీసులకు అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలో గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ఎస్సై పవన్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలి

కలెక్టర్ కోయ శ్రీహర్ష





**ప్రజాపక్షం/పెద్దపల్లి :** జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆహార పదార్థాల నిల్వ, తయారీ, పరిశుభ్రత, వడ్డింపు వంటి అన్ని అంశాల్లో ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్లలో పనిచేసే సిబ్బందికి ఆహార భద్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని,వినియోగదారుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.నిబంధనలు ఉల్లంఘిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లను తాత్కాలికంగా మూసివేసి,అవసరమైన లోపాలను సరిదిద్దిన అనంతరం మాత్రమే తిరిగి నిర్వహణకు అనుమతులు ఇస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు.మే 29న మంథని మార్కెట్ ప్రాంతంలోని శ్రీ సాయి ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ మెస్, జూన్ 13న గోదావరిఖనిలోని డెస్టినేషన్ రెస్టారెంట్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో అపరిశుభ్రత, నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి ఆయా రెస్టారెంట్లను తాత్కాలికంగా మూసివేసినట్లు తెలిపారు.తదనంతరం ఆయా సంస్థల నిర్వాహకులు పరిశుభ్రత, ఆహార భద్రత ప్రమాణాలకు అనుగుణంగా అవసరమైన మార్పులు చేపట్టడంతో, ఫుడ్ సేఫ్టీ అధికారుల పునఃపరిశీలన అనంతరం శ్రీ సాయి ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ మెస్‌కు జూన్ 4న, డెస్టినేషన్ రెస్టారెంట్‌కు జూన్ 30న తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేందుకు అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు.జిల్లాలోని ఇతర హోటళ్లు, రెస్టారెంట్లలో కూడా ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ఎక్కడైనా అపరిశుభ్రత లేదా నిబంధనల ఉల్లంఘన గుర్తించిన వెంటనే సంబంధిత సంస్థలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.హోటల్, రెస్టారెంట్ నిర్వాహకులు ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తూచా తప్పకుండా పాటించి ప్రజలకు నాణ్యమైన,సురక్షితమైన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ప్రకటన లో పేర్కొన్నారు.

**విదేశీ ఉద్యోగాల కోసం జూలై 20 వరకు దరఖాస్తులు ఆహ్వానం:** తెలంగాణ ఓవర్సీస్ మానపవర్ కంపెనీ ద్వారా విదేశాల్లో ఉపాధి అవకాశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.వివిధ దేశాల్లో అందుబాటులో ఉన్న ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు 2026 జూలై 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.జర్మనీ లో ట్రాన్స్‌మిషన్ లైన్ టెక్నీషియన్/ఎలక్ట్రీషియన్, రిజిస్టర్డ్ నర్సులు,నాన్‌హెల్త్ ఆస్బిల్డుంగ్, ఫిజియోథెరపిస్టులు,కమర్షియల్ వెహికల్ టెక్నీషియన్.ఒమాన్ లో ఎంబ్రాయిడరీ టైలర్, అగ్రికల్చర్ & లాండ్రీ వర్కర్లు, ఇండస్ట్రియల్ నర్సులు.ఖతార్ లో హోమ్ కేర్ నర్సులు,సివిల్ ఇంజినీర్లు, సివిల్ సూపర్వైజర్లు, కాస్టింగ్ ఆఫీసర్లు.ఇజ్రాయెల్: హోమ్ బేస్డ్ కేర్ గివర్స్, దుబాయ్ లో బైక్, టాక్సీ డ్రైవర్లు, స్టీల్ ఫిక్సర్, ఆర్‌సీసీ వర్కర్, టైల్ మేసన్, షట్టరింగ్ కార్పెంటర్, సివిల్ ఫోర్‌మన్, సివిల్ సైట్ ఇంజినీర్, హెల్పర్,జపాన్ లో హోమ్ కేర్ నర్సులు,కెనడా లో హోమ్ కేర్ నర్సులు,సౌదీ అరేబియా లో టెక్నీషియన్లు,రష్యా లో టెక్స్‌టైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఏసీ టెక్నీషియన్, ఫిట్టర్,ఎలక్ట్రీషియన్, వెల్డర్.గ్రీస్ లో హౌస్ కీపింగ్, వెయిటర్లు, రిసెప్షనిస్టులు, పెయింటర్లు, టైల్ మేసన్లు.మారిషస్ లో హౌస్ కీపింగ్, క్యాషియర్, షెల్ఫ్ వర్కర్లు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని,ఈ ఉద్యోగాలకు 18 నుండి 40 సంవత్సరాల మధ్య వయస్సు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు 2026 జూలై 20వ తేదీలోపు సమీకృత కలెక్టరేట్ లోని జిల్లా ఉపాధి కార్యాలయం, రూమ్ 233, పెద్దపల్లిలో సంప్రదించాలని, మరిన్ని వివరాలకు www.tomcom.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని, ఇతర వివరాలకు 7382452944 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.విదేశాల్లో ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని యువత తమ భవిష్యత్తును మెరుగుపరచుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరిసిల్ల సుభాష్ నగర్ సిపిఐ కార్మిక భవనంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. గతంలో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించమని జిల్లా కలెక్టర్ కు, తహసీల్దార్ కు వినతి పత్రం అందజేసినప్పటికీ ఫలితం శూన్యం అన్నారు. ఇసుక కోసం ఆన్లైన్ పర్మిషన్ తీసుకొచ్చి చాలాన్ కట్టినటువంటి డీడీలకు కొత్త కార్యదర్శులను నియమించినప్పటికీ వారికి యాప్ లో లాగిన్ కాక పర్మిషన్లు ఇవ్వలేక కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. కొత్తగా నియమించిన కార్యదర్శులకు లాగిన్ ఆక్సిస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతిరోజు ఇసుక మొరం కు పరిమిషన్లు ఇవ్వాలని కోరారు. ఇసుక పర్మిషన్లు ఇవ్వడం లేట్ అయితే వర్షాకాలంలో వాగులు పారుతే ఇసుక తీయలేని పరిస్థితి ఎదురవుతుందన్నారు. ఇసుక లేక కార్మికులకు పని దొరకక కుటుంబాలను పోషించడం కష్టతరం అవుతుందన్నారు. వెంటనే పర్మిషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బొల్లె బాబు, కొలిపాక వినోద్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలం ధర్మారం గ్రామ సర్పంచ్ పరుమాల సుమలత మల్లేష్ ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపి చీర కానుకగా అందజేసి, మండలంలో తక్కలపల్లి, పోలాస, జాబితాపూర్ గ్రామాలలో లబ్ధిదారుల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి హాజరై శుభాకాంక్షలు తెలిపి చీరను జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ కానుకగా అందజేశారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు గజంగి నందయ్య, ఎఎంసి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, ఎంపిఓ రవిబాబు,సర్పంచుల జిల్లా ఫోరం అధ్యక్షులు బొలిశెట్టి గంగారెడ్డి, సర్పంచులు మిల్కురి శంకర్, వడ్లూరి లక్ష్మి , శంకర్ రెడ్డి, మాజీ సర్పంచులు నారాయణ రెడ్డి,చిర్ర నరేష్,హనుమాన్ రెడ్డి,మహేశ్వర్ రావు,నాయకులు జయరాం సురేష్, వార్డు సభ్యులు,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## ఇవిఎం గోదామును అదనపు కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవిఎం గోదామును శుక్రవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి.శ్రీనివాస్ రెడ్డి రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎంల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదాం వద్ద సిబ్బంది హాజరుతీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవిఎం గదుల వివి ప్యాట్ గదుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ రాజేశ్ కాంగ్రెస్ ప్రతినిధి మడుపు మోహన్, బిజెపి ప్రతినిధి నాంపెల్లి శ్రీనివాస్, బిఆర్ఎస్ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్ ఎంఐఎం ప్రతినిధి మజీద్ హుస్సేన్, సయ్యద్ ఇబ్రహీం, టిడిపి ప్రతినిధి ఎర్రవెల్లి రవీందర్, సిపిఎం ప్రతినిధి నరేశ్ బిఎస్పి ప్రతినిధి సిరిసిల్ల అంజయ్య, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తితో ఆర్థిక ప్రగతి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఇందిరా మహిళా శక్తి యూనిట్లు మహిళా సంఘాల ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్నాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కింద తంగళ్ళపల్లి మండల కేంద్రంలో స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జీ) మహిళలు వెంకట సాయి కోల్డ్ ప్రెస్ ఆయిల్ & ఫ్లోర్ మిల్ యూనిట్, కోవిదా మిల్క్ పాయింట్ ఏర్పాటు చేసుకోగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం ప్రారంభించారు. వాటి పని తీరు, ఉపాధి, ఆదాయం తదితర వివరాలను మహిళలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి కింద రెండు యూనిట్లు ప్రారంభించామని తెలిపారు. ఒక యూనిట్లో కోల్డ్ ప్రెస్సింగ్ ఆయిల్, పిండి గిర్ని, ఇతర దాదాపు ఆరు యంత్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు. దాదాపు రూ. 11 లక్షల 50 వేలతో యూనిట్ ప్రారంభించారని వివరించారు. దీనికి పీ ఎం ఎఫ్ ఎం ఈ కింద రూ . 3 లక్షల 50 వేల సబ్సిడీ అందుతుందని వెల్లడించారు. అలాగే మరో మహిళ డైరీ యూనిట్ ను ఏర్పాటు చేసుకున్నారని, దీనికి మహిళా సంఘాల నుంచి దాదాపు రూ.5 లక్షల రుణం ఇప్పించామని తెలిపారు. ఇక్కడ ఇతర డైరీ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలో ఇలాంటి మరిన్ని యూనిట్లు ఏర్పాటు చేసేందుకు మహిళలు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. యూనిట్లు ఏర్పాటు చేయడంతో ఉపాధితోపాటు మహిళా సాధికారతకు దోహదం చేస్తుందని వివరించారు. నిన్న బ్యాంకర్ల సమావేశంలో ఇదే విషయంపై చర్చించి.. మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. జిల్లాలోని గ్రామీణ మహిళా, పురుష అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆర్ సేథీ ఆద్వర్యంలో అందుబాటులో ఉందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ మల్లికార్జున రావు, ఏఎంసీ వైస్ చైర్మెన్ నర్సింగం, ఇంచార్జి తహసీల్దార్ మురళి, ఇంచార్జి ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ మీర్జా, సర్పంచ్ లక్ష్మీరాజం, తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ అన్ ఫిట్ కార్మికులకు సూటబుల్ జాబ్

ఎఐటియుసి పోరాట ఫలితం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి అండర్ గ్రౌండ్ గనులలో పనిచేస్తూ అనారోగ్యం కారణంగా మెడికల్ అన్‌ఫిట్ అయి, సర్ఫేస్‌లో జనరల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మైనింగ్ స్టాఫ్, ఈ అండ్ ఎం సూపర్‌వైజర్లు, ట్రేడ్స్‌మెన్లకు సూటబుల్ జాబ్ ఇవ్వాలని గుర్తింపు సంఘం ఏఐటియుసి చేసిన ఆందోళనకు యాజమాన్యం దిగివచ్చిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఏఐటియుసి పట్టుదలతో జూన్ 8న ఇచ్చిన సమ్మె నోటీసులో ఈ డిమాండ్‌ను ప్రధానంగా పెట్టడం జరిగిందని, దీనిపై జూన్ 25న హైదరాబాద్‌లో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వద్ద జరిగిన చర్చల్లో, జూలై 10లోపు సమ్మె డిమాండ్లపై పరిష్కారం కోసం యాజమాన్యం, యూనియన్ కలిసి మాట్లాడుకోవాలని సూచించిన నేపథ్యంలో యాజమాన్యం జూలై 6న కొత్తగూడెం మేయిన్ హాస్పిటల్‌లో వైద్య పరీక్షలకు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు. వైద్య పరీక్షల అనంతరం అర్హులైన వారికి సూటబుల్ జాబ్ కేటాయించే ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆయన అన్నారు. ఏఐటియుసి పోరాట ఫలితంగా జూలై 6న జరిగే మెడికల్ టెస్టులకు సంబంధిత కార్మికులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు. సూటబుల్ జాబ్ వచ్చేదాకా ఏఐటియుసి పోరాటం ఆగదని ఆయన తెలిపారు.కనుక కార్మిక వర్గం ఏఐటియుసి చేసిన పోరాటం వల్లనే ఇది సాధ్యం అయిందన్న విషయాన్ని గుర్తెరగాలని ఆయన పేర్కొన్నారు.

## ముళారంపూర్ ఎరువుల దుకాణం తనిఖీ



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ముళారంపూర్ గ్రామంలోని ఎరువుల దుకాణాన్ని మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూరియా విక్రయాలు తప్పనిసరిగా యూరియా బుకింగ్ యాప్, ఈ పోస్ మిషన్ ద్వారానే నిర్వహించాలని డీలర్‌కు ఆదేశించారు. ఎరువుల నిల్వలు, అమ్మకాల వివరాలను స్టాక్ రిజిస్టర్లలో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు.ప్రభుత్వ నిబంధనలు యఫ్‌సిఓ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలతో పాటు ఎరువుల విక్రయ లైసెన్స్‌ను కూడా రద్దు చేస్తామని రాజ్ కుమార్ హెచ్చరించారు.

## 100 శాతం రాయితీపై పత్తి విత్తనాలు పంపిణీ

**ప్రజాపక్షం/కొండపాక :** రైతుల ఆదాయం పెంపు, పత్తి దిగుబడుల వృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ పథకం కింద రైతులకు 100 శాతం రాయితీపై పత్తి విత్తనాలను అందజేస్తోంది. అధిక సాంద్రత పత్తి సాగుకు అనుకూలమైన ప్రత్యేక రకాల విత్తనాలను ఈ పథకం ద్వారా పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి శివరామకృష్ణ తెలిపారు. కొండపాక మండలానికి 200 ఎకరాలకు సరిపడా పత్తి విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేసినట్లు తెలిపారు. ప్రతి రైతుకు ఒక ఎకరానికి ఆరు పత్తి విత్తనాల ప్యాకెట్లు ఉచితంగా అందజేస్తామని, మహిళా రైతులు, ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. మండలంలోని వెలికట్ట ఎక్స్ రోడ్డులో ఉన్న ఆగ్రో రైతు సేవా కేంద్రంలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకువచ్చి డిక్లరేషన్‌పై సంతకం చేసి విత్తనాలను పొందాలని సూచించారు.

## ‘సర్’ ప్రక్రియలో అప్రమత్తంగా వ్యవహరించాలి

టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు



**ప్రజాపక్షం/పెద్దపల్లి /ముత్తారం :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా కాంగ్రెస్ పార్టీ, బిఎల్ ఏ లు,సూపర్వైజర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు అన్నారు.పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో శుక్రవారం ముత్తారం మండలం,మంథని మండలం, మంథని పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఏ, సూపర్వైజర్లకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మార్గనిర్దేశనం చేశారు.ఈ సందర్భంగా శ్రీను బాబు మాట్లాడుతూ, ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి పునాది అని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పరిశీలించాలని సూచించారు. అవసరమైన ఫారాలు సక్రమంగా నింపించి, ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. సర్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించడం కూడా బిఎల్ఏ లు, సూపర్వైజర్ల బాధ్యతేనని పేర్కొన్న ఆయన, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తే ప్రత్యేక సవరణ కార్యక్రమం విజయవంతమవుతుందని అన్నారు. అనంతరం సూపర్వైజర్ల సందేహాలను నివృత్తి చేసి, ప్రక్రియ నిర్వహణకు సంబంధించిన పలు సూచనలు చేశారు.సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఎల్ఏ లు,సూపర్వైజర్లు పాల్గొన్నారు.

**యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి**

శుక్రవారం మంథని పట్టణంలోని సూరయ్యపల్లి గ్రామానికి చెందిన ఆర్ల వినీత్ నూతనంగా ఏర్పాటు సొల్యూషన్స్’ సంస్థను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూయువత కేవలం ఉద్యోగాల కోసమే కాకుండా,స్వయం ఉపాధి వైపు అడుగులు వేసి తోటి వారికి కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలన్నారు.అలాగే యువ పారిశ్రామికవేత్తలు సొంతంగా వ్యాపారాలు ప్రారంభిస్తూ ఉపాధి అవకాశాలను సృష్టించడం అభినందనీయమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు అన్నారు. నూతనంగా ప్రారంభమైన సమైర ఎనర్జీ సొల్యూషన్స్ సంస్థ విజయవంతంగా ముందుకు సాగాలని,మరింత మంది యువతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులకు ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, యువకులు నిర్వాహకులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ తోపాటు ఉన్నారు.

## దొంతరవేన వెంకన్న మృతి బాధాకరం

సిపిఐ జిల్లా మాజీ కౌన్సిల్ సభ్యుడు

సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్





**ప్రజాపక్షం/కరీంనగర్:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా మాజీ కౌన్సిల్ సభ్యులు దొంతరవేన వెంకన్న ఆకస్మిక మరణం అత్యంత బాధాకరమని ఆయన మృతి పట్ల సిపిఐ జిల్లా సమితి పక్షాన సంతాపాన్ని ప్రకటిస్తున్నట్లు సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తెలిపారు. చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకన్న గత ముప్పయి ఏళ్లకు పైగా కమ్యూనిస్టు పార్టీ లో పని చేస్తున్నాడని, పార్టీ పట్ల నిబద్ధతతో, నిజాయితీగా ఉండేవాడని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి పరితపించేవాడని, గ్రామంలో రైతుల పక్షాన, కార్మికుల పక్షాన నిలుస్తూ వారి సమస్యల పరిష్కారం కోసం నిత్యం నాయకుల, ప్రజాప్రతినిధుల, అధికారుల దృష్టికి తెచ్చేవాడని అలాంటి మంచి మనస్సున్న గొప్ప వ్యక్తి మరణం పట్ల సిపిఐ జిల్లా సమితి పక్షాన సంతాపాన్ని ప్రకటిస్తూ,వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని వెంకటరెడ్డి,శ్రీనివాస్ తెలిపారు.

**వెంకన్న మృతదేహంపై ఎర్ర జెండా కప్పి నివాళ్ళర్పించిన సిపిఐ నాయకులు:** చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సిపిఐ మాజీ జిల్లా కౌన్సిల్ సభ్యులు దొంతరవేని వెంకన్న అకాలమరణం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కి, వారి కుటుంబానికి తీరని లోటు అని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, మాజీ జెడ్పిటిసి అందే స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం వెంకన్న మృతి చెందడంతో ఆయన మృతదేహంపై ఎర్ర జెండా జెండాను కప్పి నివాళ్లర్పించారు. అంత్యక్రియల కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, గూడెం లక్ష్మి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ,జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్న స్వామి, చాడ శ్రీధర్ రెడ్డి, కాంతాల శ్రీనివాస్ రెడ్డి, సీతారాంపూర్ మాజీ సర్పంచ్ గోలీ బాపురెడ్డి,శాఖ కార్యదర్శులు మంద ఎల్లయ్య, ఎం.డి ఉస్మాన్ పాషా పాల్గొన్నారు.

## సింగరేణి రిటైర్డ్ కార్మికులను వేధిస్తున్న సిఎంపిఎఫ్ అధికారులు

గోదావరిఖని ఆఫీస్‌లో పి.ఎఫ్, పెన్షన్ సెటిల్‌మెంట్లలో తీవ్ర జాప్యం

ఎఐటియుసి ఆగ్రహం



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** సింగరేణి కంపెనీలో 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న కార్మికులకు పి.ఎఫ్. సెటిల్‌మెంట్ తో పాటు పెన్షన్ వెంటనే వచ్చేలా ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఈ సంవత్సరం జనవరి నుండి గోదావరిఖని సి.ఎం.పి.ఎఫ్ కార్యాలయంలో చాలా కేసులు పెండింగ్ లో పెట్టి రిటైర్డ్ కార్మికులను తీవ్రంగా వేధిస్తున్నారని ఏఐటియుసి కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు.రామగుండం, బెల్లంపల్లి రీజియన్ కార్మికుల పి.ఎఫ్,పెన్షన్ ఫైళ్లు నెలల తరబడి పెండింగ్ లో ఉన్నాయని,కొత్తగూడెం రీజియన్‌లో సెటిల్‌మెంట్లు సకాలంలో పూర్తవుతున్నాయని,కానీ గోదావరిఖని సి.ఎం.పి.ఎఫ్ ఆఫీస్ లోనే జాప్యం జరుగుతోందని, డేటా సరిగా లేదని, అదనపు సమాచారం కావాలని* అంటూ అధికారులు తాత్సారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ మధ్యనే పదవీ బాధ్యతలు తీసుకున్న రీజినల్ కమిషనర్ గతంలో విజిలెన్స్ లో పని చేసి ఇక్కడికి బదిలీ అయ్యారని, సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలు సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయం లో ధన్‌బాద్‌లో ఉన్న పై అధికారులకు ఏఐటియుసి తరపున ఫిర్యాదు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.సంబంధిత ఏటిబి సెల్, కంపెనీ అధికారులతో చర్చలు జరిపామని ఆయన అన్నారు.సింగరేణిలో 60 ఏళ్లకు రిటైర్ అయి 61వ ఏట్లో ఉన్న కార్మికుల పి.ఎఫ్, పెన్షన్ ఫైళ్లు వెంటనే క్లియర్ చేయాలని, పెళ్లిళ్లు, చదువుల కోసం పెట్టుకున్న లోన్ అప్లికేషన్లను కూడా తక్షణమే మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గోదావరిఖని సి.ఎం.పి.ఎఫ్ ఆఫీస్ లో రిటైర్డ్ కార్మికుల కు ఇబ్బందులు లేకుండా సమర్థవంతమైన వ్యవస్థ ను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు, రిటైర్డ్ కార్మికులను వేధించే పద్ధతి మార్చుకోకపోతే ఏఐటియుసి ఆధ్వర్యంలో భారీ ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాల పనులు గడువులోగా పూర్తి

ఎంపి ధర్మపురి అరవింద్



**ప్రజాపక్షం/జగిత్యాల:** అమృత్ 2.0, స్వచ్ఛ భారత్ మిషన్, , 15వ ఆర్థిక సంఘం, జాతీయ ఆరోగ్య మిషన్, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, పీఎం శ్రీ, పీఎం కుసుమ్, జాతీయ రహదారులు తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల కింద చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం జగిత్యాల సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, అదనపు ఎస్పీ చేతన్ నితిన్, అదనపు కలెక్టర్ రాజ గౌడ్ లతో కలిసి నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశంలో వివిధ శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు పురోగతిని సంబంధిత శాఖ అధికారులు వివరించారు.ఈ సందర్భంగా ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ అమృత్ 2.0 కింద చేపట్టిన తాగునీటి సరఫరా పనులను క్షేత్ర స్థాయిలో మరింత వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో 14 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల బాలికలకు హెచ్.పి.వీ. టీకాల కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని అన్నారు. 10 వేల మంది బాలికలకు టీకాలు వేయాలనే లక్ష్యం ఉండగా ఇప్పటివరకు 3,300 మందికి మాత్రమే టీకాలు అందినట్లు పేర్కొంటూ ప్రత్యేక కార్యాచరణతో లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు.ఆర్మూర్–జగిత్యాల–నిజామాబాద్ నాలుగు లేన్ల జాతీయ రహదారికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, కాంట్రాక్టర్ ఎంపిక ప్రక్రియ తుది దశలో ఉందన్నారు. మరో రెండు నెలల్లో పనులు ప్రారంభమయ్యే అవకాశమున్నందున అప్పటిలోగా పెండింగ్‌లో ఉన్న సుమారు 1,200 ఎకరాల భూసేకరణ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. జగిత్యాలలో కేంద్ర విద్యాలయం ఏర్పాటుకు తప్పనిసరిగా 10 ఎకరాల భూమిని కేటాయించాలని సూచించారు. అంతకంటే తక్కువ విస్తీర్ణంలో కే.వి. స్కూల్ నిర్వహించడం ఇబ్బంది గా ఉంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ అమృత్ 2.0 పథకం కింద జగిత్యాలలో రూ.38.60 కోట్లు, కోరుట్లలో రూ.41.50 కోట్లు, మెట్‌పల్లిలో రూ.19.40 కోట్లు, రాయకల్‌లో రూ.15.20 కోట్లు, ధర్మపురిలో రూ.23 కోట్ల వ్యయంతో తాగునీటి సరఫరా పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో ఏ.భిక్యా నాయక్ , పాత రమేష్, వడ్డేపల్లి శ్రీనివాస్, ఎర్ర లక్ష్మి ,రఘువరన్, గౌతమ్ రెడ్డి,జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక మాఫియాపై పోలీసుల ఉక్కుపాదం



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా, నిల్వలను అరికట్టేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఆదేశాలమేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిరంతరం పెట్రోలింగ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎలగందుల గ్రామ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన రెండు భారీ ఇసుక దంపులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించి దాడి చేశారు. ఈ దాడుల్లో మొత్తం 65 ట్రాక్టర్ ట్రిప్పుల అక్రమ ఇసుకను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రామడుగు మండలం వన్నారం గ్రామానికి చెందిన సూతూరి శ్రీనివాస్‌కు చెందిన 40 ట్రిప్పుల ఇసుక, ఎలగందల్ గ్రామానికి చెందిన సింది రామ్‌సుందర్‌కు చెందిన 25 ట్రిప్పుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఈ 65 ట్రిప్పుల ఇసుక నిల్వలను తదుపరి చర్యల నిమిత్తం కొత్తపల్లి, రామడుగు పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా గౌష్ ఆలం మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తవ్వడం,నిల్వ చేయడం, రవాణా చేయడం వంటి చర్యలను ఎట్టిపరిస్థితుల్లో నూ సహించబోమని హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణా, నిల్వలపై జిల్లావ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగుతుందని నిబంధనలు ఉల్లంఘించేవారిపై మైనింగ్ చట్టాలు, ఇతర సంబంధిత చట్టాల ప్రకారం అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ స్పష్టం చేశారు.

# ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు

## కాంగ్రెస్ పార్టీ ఆరోపణ



**న్యూఢిల్లీ:** దేశంలో ఎన్నికల వ్యవస్థ, ప్రజాస్వామ్యం ప్రస్తుతం తీవ్రమైన ముప్పును ఎదుర్కొంటున్నాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికత దెబ్బతింటున్నాయని పేర్కొంటూ, 24 ప్రతిపక్ష పార్టీల నాయకులు, ఒక స్వతంత్ర ఎంపితో కలిసి ఇటీవల భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ వెల్లడించారు. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికలను పరిరక్షించడం సుప్రీంకోర్టు రాజ్యాంగబద్ధమైన బాధ్యతగా ఆయన అభివర్ణించారు. ప్రతిపక్షాల లేఖలో ఎన్నికల సంఘం పనితీరుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పారదర్శకత లోపించిందని, పరిపాలనా గందరగోళం నెలకొందని ఆరోపించారు. తదుపరి అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉన్నందున ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసి, భవిష్యత్తులో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు ధ్రువీకరించే విధానంలో నిర్వహించాలని కోరారు. గతంలో అమలులో లేని డాక్యుమెంటేషన్ విధానాన్ని అనుసరించడం పట్ల కూడా వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే ఎన్నికల సంఘం అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని, పశ్చిమ బెంగాల్‌లో లక్షలాది ఓటర్ల పేర్లు ఓటరు జాబితాల నుంచి తొలగిచారని ఆరోపించారు. ఢిల్లీ, హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల నిర్వహణపై కూడా సందేహాలు వ్యక్తం చేశారు. అవసరమైతే బ్యాలెట్ పేపర్ విధానాన్ని పునరుద్ధరించడంపై దేశవ్యాప్తంగా విస్తృత చర్చ జరగాలని ప్రతిపక్షాలు సూచించాయి. కేంద్ర దర్యాప్తు సంస్థలు అయిన సిబిఐ, ఇడి, ఎన్ఐఎలను ప్రధానంగా ప్రతిపక్షాలపై మాత్రమే ఉపయోగిస్తున్నారని, ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయడానికి, ఎన్నికైన ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు వాటిని వినియోగిస్తున్నారని కూడా లేఖలో ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని సంస్థలు స్వతంత్రంగా పనిచేయాల్సి ఉండగా, అవే ప్రభుత్వ అజెండాను అమలు చేసే సాధనాలుగా మారితే దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ప్రతిపక్ష నేతలు హెచ్చరించారు. అన్ని వ్యవస్థలు విఫలమైనప్పుడు ప్రజలు చివరి ఆశగా న్యాయవ్యవస్థను ఆశ్రయిస్తారని, అందువల్ల ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు సుప్రీంకోర్టు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ప్రజలు ప్రభుత్వానికి బానిసలు కారు

## బాంబే హైకోర్టు వ్యాఖ్య.. బహిష్కరణ ఉత్తర్వులు చెల్లవని స్పష్టీకరణ



**ముంబయి:** ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నిరసనలు, ఆందోళనల్లో పాల్గొన్నారనే కారణంతోనే పౌరులను వారి ప్రాంతం నుంచి బహిష్కరించే (ఎక్స్‌టర్న్‌మెంట్) ఉత్తర్వులు జారీ చేయడం చట్టబద్ధం కాదని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. ప్రజలు ప్రభుత్వానికి బానిసలు కాదని, ప్రభుత్వ చర్యలను ప్రశ్నించడం, వ్యతిరేకించడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ హక్కు అని న్యాయస్థానం పేర్కొంది. ఈ వ్యాఖ్యలతో పాటు స్థానిక రాజకీయ నాయకుడు సయీద్ అహ్మద్ అబ్దుల్ వాహిద్ చౌదరిపై విధించిన ఏడాది కాలం బహిష్కరణ ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. ప్రభుత్వ నిర్ణయాలు, కేంద్ర ప్రభుత్వం, బిజెపి, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమాలు నిర్వహించారనే ఆరోపణలతో చౌదరిపై పలు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అనంతరం ఆయనపై బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేయడంతో వాటిని సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి మాధవ్ జామ్‌దార్, నినాదాలు చేయడం లేదా ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఆందోళనలు నిర్వహించడం ఒక్కటే బహిష్కరణకు కారణం కాదని స్పష్టం చేశారు. అలాంటి ఉత్తర్వులు వ్యక్తి భావ ప్రకటన స్వేచ్ఛ, గౌరవప్రదమైన జీవనం సాగించే హక్కు వంటి ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తాయని పేర్కొన్నారు. రికార్డులో ఉన్న ఆధారాలను పరిశీలించిన తర్వాత, చౌదరి నిర్వహించిన నిరసనల వల్ల ప్రజలకు హాని జరిగినట్లు ఎలాంటి సాక్ష్యాలు లేవని న్యాయస్థానం గమనించింది. కేవలం అనుమతి లేకుండా ఆందోళనలు నిర్వహించారనే కారణంతో మహారాష్ట్ర పోలీసు చట్టం కింద బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేయడం సమంజసం కాదని తీర్పు వెల్లడించింది. విచారణ సందర్భంగా న్యాయమూర్తి సరదాగా చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. 'ప్రస్తుతం మహారాష్ట్ర రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపులు విస్తృతంగా జరుగుతున్నాయి' అని వ్యాఖ్యానిస్తూ, చౌదరి కూడా పార్టీ మారితే తనపై నమోదైన కేసులు 'వాషింగ్ మెషీన్‌లో వేసినట్లుగా' మాయమయ్యే అవకాశం ఉందని వ్యంగ్యంగా అన్నారు. ఈ వ్యాఖ్యలు న్యాయస్థానంలో నవ్వులు పూయించినప్పటికీ, ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన మౌలిక స్వేచ్ఛ అనే విషయాన్ని హైకోర్టు తన తీర్పులో స్పష్టం పేర్కొంది.

# అడల్ట్ కంటెంట్‌పై 'మెటా'ను వివరణ కోరిన కేంద్రం



**న్యూఢిల్లీ:** పిల్లలపై లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్‌ను ప్రోత్సహించే ప్రకటనలు ఇన్‌స్టాగ్రామ్‌లో కనిపించాయన్న ఆరోపణల నేపథ్యంలో మెటాను కేంద్ర ప్రభుత్వం మరోసారి వివరణ కోరనుంది. ఈ వ్యవహారంపై మెటా ప్రతినిధులను పిలిపించాలని కేంద్ర సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అధికారులను ఆదేశించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ అంశంపై మెటా నుంచి సమగ్ర వివరణను ఐటి మంత్రిత్వ శాఖ కోరనుంది. ఈ వారం మెటాపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ఇది రెండోసారి. ఇటీవల వాట్సాప్‌లో ప్రవేశపెట్టాలని భావిస్తున్న 'యూజర్‌నేమ్' ఫీచర్‌పై కూడా కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఆ ఫీచర్ అమలును తాత్కాలికంగా నిలిపివేయాలని సూచించింది. ఆ ఫీచర్ వల్ల ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్, డిజిటల్ అరెస్ట్ మోసాలు, నకిలీ గుర్తింపులతో జరిగే సైబర్ నేరాలు పెరిగే ప్రమాదం ఉందని ప్రభుత్వం పేర్కొంది. తాజాగా, మెటా సిఫార్సు చేసే అల్గోరిథమ్ ద్వారా పిల్లలపై లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన వీడియోలు వినియోగదారులకు చేరుతున్నాయని, దీంతో సంస్థ భద్రతా వ్యవస్థల్లో తీవ్రమైన లోపాలు ఉన్నాయని కేంద్రం భావిస్తున్నది. అంతేకాకుండా, మెటా ప్రకటనల విధానాలు నగ్నత్వం, లైంగికంగా అసభ్యకరమైన కంటెంట్‌ను నిషేధిస్తున్నప్పటికీ, అలాంటి ప్రకటనలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర వేదికలపై కనిపించాయని బిబిసి నివేదిక వెల్లడించింది.

**అధికారులను కలిసిన 'మెటా' ప్రతినిధులు**

వాట్సాప్‌లో ప్రవేశపెట్టాలని భావిస్తున్న 'యూజర్‌నేమ్' ఫీచర్‌పై కేంద్ర ప్రభుత్వం వ్యక్తం చేసిన ఆందోళనల నేపథ్యంలో మెటా ప్రతినిధుల బృందం శుక్రవారం కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ అధికారులను కలిసింది. ఫోన్ నంబర్‌కు బదులుగా యూజర్‌నేమ్ ఆధారంగా ఇతరులతో సంప్రదించే అవకాశం కల్పిస్తే, నకిలీ గుర్తింపులతో మోసాలకు పాల్పడే అవకాశం పెరిగే ప్రమాదం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. దీనివల్ల ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్ దాడులు, వ్యక్తుల పేరుతో నకిలీ ఖాతాలు సృష్టించడం, అలాగే ఇటీవల పెరుగుతున్న 'డిజిటల్ అరెస్ట్' వంటి సైబర్ నేరాలు అధికమయ్యే అవకాశముందని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. కాగా, ఈ సమావేశంలో ప్రభుత్వ ఆందోళనలను మెటా ప్రతినిధులకు అధికారులు వివరించి, వినియోగదారుల భద్రతకు ఎలాంటి ముప్పు లేకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టిన తర్వాతే ఈ ఫీచర్‌ను అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వం ఈ అంశంపై సంప్రదింపులు పూర్తయ్యే వరకు యూజర్‌నేమ్ ఫీచర్ అమలును నిలిపివేయాలని వాట్సాప్‌ను ఆదేశించింది. ఈ అంశంపై సమగ్ర వివరణ ఇవ్వడానికి మెటాకు మూడు రోజుల గడువు ఇచ్చిన ప్రభుత్వం, నిర్ణీత సమయంలో తమ సమాధానాన్ని సమర్పిస్తామని మెటా తెలిపింది. ఈ ఫీచర్ వల్ల సైబర్ నేరాలు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో సమాచార సాంకేతిక చట్టం (ఐటి చట్టం), ఇతర సంబంధిత నిబంధనల ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని కూడా కేంద్రం కోరింది. భారతదేశంలో కీలక సోషల్ మీడియా మధ్యవర్తిగా ఉన్న వాట్సాప్, ఐటి చట్టం ప్రకారం వినియోగదారుల భద్రతను కాపాడేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాల్సిన చట్టబద్ధ బాధ్యత ఉందని ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది.

# రాజస్థాన్, ముంబయిలలో... వర్ష ప్రళయం

## జైపూర్‌లోని సాంభార్‌లో అత్యధికంగా 8 సెం.మీ. వర్షపాతం నమోదు

## ముంబయిలో 100 మిల్లీ మీటర్ల వర్షపాతం రికార్డు

**జైపూర్ / ముంబయి :** దేశంలోని రాజస్థాన్, మహారాష్ట్రలోని ముంబయిలో పలుప్రాంతాలను భారీ వర్షాలు ముంచెత్తాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. నైరుతి ప్రభావాల ప్రభావంతో రాజస్థాన్ అంతటా విస్తారంగా వర్షాలు కురిశాయి. ఈ విషయాన్ని వాతావరణ శాఖ తెలిపింది. శుక్రవారం ఉదయంతో ముగిసిన 24గంటల వ్యవధిలో జైపూర్‌లోని సాంభార్‌లో అత్యధికంగా 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. చిత్తోర్‌గఢ్ జిల్లాలోని నింబాహెరా, అజ్మీర్‌లోని కేకరి, జైపూర్‌లోని ఫాగి, ఝున్‌ఝునులోని బుహానా ప్రాంతాల్లో, చెరో 7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, భిల్వారాలోని కోట్రిలో 6 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మరికొన్ని ప్రాంతాలలో 6సెం.మీ.కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. వాతావరణ శాఖ ప్రకారం, గత 24గంటల్లో తూర్పు రాజస్థాన్‌లోని పలుచోట్ల ఉరుములు, ఈదురుగాలులు, తేలిక పాటి నుంచి మోస్తరు వర్షపాతం నమోదవగా అక్కడక్కడా భారీ వర్షాలు కురిశాయి. పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాలలో కూడా ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం కురిసింది. భారీ వర్షాల కారణంగా చిత్తోర్‌గఢ్, భిల్వారా, రాజసమండ్ జిల్లాల పట్టణ ప్రాంతాల్లో నీరు నిలిచిపోగా, ఈ జిల్లాలలోని పలు గ్రామాలలో కూడా నీరు చేరింది. జైపూర్‌లోని ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న సవాయ్ మాన్‌సింగ్ ట్రామా సెంటర్‌లోకి వర్షపు నీరు ప్రవేశించింది. ఎమర్జెన్సీ వార్డు, ఇసిజి గది, ఎక్స్‌రే విభాగాన్ని ముంచెత్తింది. దీంతో రోగులు, సహాయకులు, ఆసుపత్రి సిబ్బందికి తీవ్ర అసౌకర్యం కలిగింది. చిత్తోర్‌గఢ్ జిల్లాలోని కపాసన్, నింబాహెరా తహశీల్లలో రాత్రి కురిసిన వర్షాల కారణంగా పలు రహదారులు మూసుకుపోయాయి. శుక్రవారం కోటా, బరన్, ఝలావార్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, జైసల్మేర్, బార్మర్ మినహా రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్లు ఆ శాఖ తెలిపింది. రాబోయే రోజుల్లో తూర్పు, ఆగ్నేయ రాజస్థాన్‌లోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనావేసింది. ఉదయ్‌పూర్, కోటా, అజ్మీర్, భరత్‌పూర్, జైపూర్‌లలోని అక్కడక్కడా ఉరుములతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కూడా వాతావరణ శాఖ హెచ్చరించింది.



**ముంబయినీ...ముంచెత్తిన భారీ వర్షాలు**

ముంబయిలోని పలుప్రాంతాలను భారీ వర్షాలు ముంచెత్తాయి. శుక్రవారం ఉదయం 8గంటలకు, ముగిసిన 24గంటల వ్యవధిలో ముంబయిలోని పలు ప్రాంతాలలో 100 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అయినప్పటికీ, పగటిపూట భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది.ము ంబయి మహానగరంలో ఈదురుగాలుల వేగం గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వరకు చేరుకుంటుందని వాతావరణ శాఖ అంచనా వేసిందని బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) తన తాజా రుతుపవనాల అప్‌డేట్‌లో పేర్కొంది. సెంట్రల్ వెస్టర్న్, హార్బర్ లైన్లలో ఉదయం పూట సబర్బన్ రైల్ సర్వీసులు యథావిధిగా నడుస్తున్నాయని ప్రయాణికులు ఫిర్యాదు చేశారు. ముంబయి నగరానికి మరో జీవనాధారమైన బృహన్‌ముంబై ఎలక్ట్రికల్ బస్ ఎలక్ట్రిక్ సప్లయ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ బస్సు సర్వీస్ కూడా ఎలాంటి ప్రధాన అంతరాయాలు లేకుండా సాధారణంగానే నడుస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం 2.18గంటలకు 4.28 మీటర్ల ఎత్తైన పోటు, ఆ తర్వాత శనివారం మధ్యాహ్నం 2గంటలకు 3.68 మీటర్ల ఎత్తైన పోటు వస్తుందని అంచనా వేస్తున్నట్లు పౌర సంఘం తెలిపింది. కాగా, శుక్రవారం రాత్రి 8.22 గంటలకు, (1.74మీటర్లు), శనివారం ఉదయం 7.44గంటలకు (1.05మీటర్లు) పోటు తగ్గుతుందని అంచనా వేస్తున్నట్లు పేర్కొంది.గురువారం అర్ధరాత్రి నుంచి ముంబయిలో రాత్రి అంతా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దాదర్, అంధేరీ, గోరేగావ్, పరేల్ వంటి లోతట్టు ప్రాంతాలు జలమయమైనప్పటికీ, ఉదయానికి నీరు తగ్గుముఖం పట్టిందని అధికారులు తెలిపారు. తెల్లవారుజామున వర్షతీవ్రత తగ్గగా, ముంబయిలోని కొన్ని ప్రాంతాలలో ఉదయం 8గంటల తర్వాత మళ్లీ వర్షపు జల్లులు మొదలయ్యాయి. వాడీలో అత్యధికంగా 150.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

### కరూర్ తొక్కిసలాట ఘటనపై

# టివికె నేతలు బహిరంగ ప్రకటనలు చేయొద్దు

## 'సుప్రీం'ను ఆశ్రయించిన డిఎంకె

**న్యూఢిల్లీ :** కరూర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సహా తమిళగ వెట్రి కజగం (టివికె) నాయకులు ఎవరు కూడా బహిరంగ ప్రకటనలు, 'తప్పుడు ఆరోపణలు' చేయడం వంటివి చేయకుండా నిరోధించాలని కోరుతూ ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె) శుక్రవారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పెండింగ్‌లో ఉన్న కేసులో తనను కూడా ప్రతివాదిగా చేర్చాలని కోరుతూ డిఎంకె ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.ఎస్.భారతి దాఖలు చేసిన పిటిషన్‌లో, ఈ కేసులో తొలుత ఛార్జిషీట్ దాఖలు చేయబడిన పలువురు వ్యక్తులు 2026 అసెంబ్లీ ఎన్నికల తర్వాత తమిళనాడు కేబినెట్‌లో మంత్రులుగా ఉన్నారని పేర్కొన్నారు. తమిళనాడు మంత్రి ఆదావ్ అర్జున గురువారం చేసిన ఒక బహిరంగ ప్రకటనను పిటిషన్ ప్రస్తావించింది. ఆ ప్రకటనలో కరూర్ ఘటనపై ''పగ తీర్చుకోవాల్సి ఉంది' అని, గత డిఎంకె ప్రభుత్వం పోలీసుల ద్వారా కరూర్ ప్రజలను చంపిందని ఆయన ఆరోపించినట్లు సమాచారం. సాక్షులను ప్రభావితం చేస్తూ, తారుమారు చేస్తూ దర్యాప్తుకు ఆటంకం కలిగిస్తున్న మంత్రి ఆదావ్ అర్జున బహిరంగ ప్రకటనలపై ఫిర్యాదు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని, సిబిఐని ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. కరూర్ తొక్కిసలాట బాధితులను కలవడానికి, కారుణ్య నియామక ఉత్తర్వులతో సహా ప్రభుత్వ ప్రయోజనాలు అందజేయడానికి విజయ్ జులై 10న కరూర్‌కు వెళ్లే అవకాశం ఉందని భారతి పేర్కొన్నారు.'దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నప్పుడు, దర్యాప్తుకు సంబంధించిన విషయంతో సంబంధం ఉన్న వ్యక్తులు లేదా ప్రస్తుతం అధికారంలో ఉన్న రాజకీయ కార్యనిర్వాహక వర్గం, ముఖ్యంగా దర్యాప్తులో ఉన్న అదే సంఘటన నుంచి ఉత్పన్నం అయ్యే ప్రయోజనాలను పంపిణీ చేస్తున్నప్పుడు, అటువంటి కీలక సాక్షులతో సంభాషించడం అనేది, దర్యాప్తు ప్రక్రియ నిష్పక్షపాతత, స్వాతంత్ర్యంపై వాస్తవమైనా లేదా ఊహాజనితమైనా ఒక అనుమానానికి దారితీసే అవకాశం ఉంది'అని పిటిషన్‌లో పేర్కొన్నారు. కరూర్ తొక్కిసలాట ఘటన దేశం మనస్సాక్షిని కదిలించిందని, దీనిపై నిష్పాక్షికమైన లేదా నిష్పక్షపాతమైన విచారణ జరగాలని పేర్కొంటూ,ఈ కేసు దర్యాప్తును సిబిఐకి అప్పగించాలని అత్యున్నత న్యాయస్థానం గతంలో ఆదేశించింది. నటుడు, రాజకీయవేత్త విజయ్‌కు చెందిన తమిళగ వెట్రి కజగం స్వతంత్ర విచారణ కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై ఇచ్చిన ఉత్తర్వులో సిబిఐ దర్యాప్తును పర్యవేక్షించేందుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అజయ్ రస్తోగి నేతృత్వంలో ముగ్గురు సభ్యుల పర్యవేక్షక కమిటీని కూడా సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది.అంతకుముందు, ర్యాలీకి అంచనా వేసిన 10,000మందికి బదులుగా దాదాపు మూడు రెట్లు అధికంగా 27,000 మందిహాజరయ్యారని పోలీసులు తెలిపారు. విజయ్ వేదికకు చేరుకునే విషయంలో ఏడు గంటలు ఆలస్యం చేయడమే ఈ విషాదానికి కారణమని పోలీసులు వెల్లడించిన విషయం విదితమే.

# తమిళనాడు సిఎం విజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు...

## డిఎంకె ఎమ్మెల్యే అనితా అరెస్ట్

**చెన్నై :** తమిళగ వెట్రి కజగం (టివికె) అధ్యక్షుడు, ముఖ్యమంత్రి విజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె) శాసనసభ్యుడు అనితా ఆర్.రాధాకృష్ణన్ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముందస్తు బెయిల్ కోసం ఎమ్మెల్యే అనితా ఆర్.రాధాకృష్ణన్ చేసిన అభ్యర్థనను మద్రాస్ హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో శుక్రవారం ఆయనను తూత్తుకుడి జిల్లాలోని అత్తూరులో పోలీసులు అరెస్ట్ చేశారు. జూన్ 20న తమిళనాడు మాజీ సిఎం ఎం.కరుణానిధి జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి విజయ్‌పై రాధాకృష్ణన్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన విషయం విదితమే. చిత్ర పరిశ్రమ నుంచి విజయ్ రాజకీయ అరంగేట్రాన్ని ఉద్దేశించి వ్యంగంగా మాట్లాడారు. అంతేకాకుండా ఒక నటి ప్రస్తావన గురించి కూడా ఎమ్మెల్యే రాధాకృష్ణన్ తీసుకవచ్చారు. ఈ పరిణామ క్రమంలో ఎమ్మెల్యేపై కేసు నమోదు అయ్యింది. తాజాగా, హైకోర్టు బెయిల్ నిరాకరించడంతో పోలీసులు సదరు ఎమ్మెల్యేను అరెస్ట్ చేయడం జరిగింది. ఈ అరెస్టను డిఎంకె ఎంపి కనిమొళి తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్షాలపై రాష్ట్ర ప్రభుత్వం అణిచివేత చర్యలకు పాల్పడుతోందని కనిమొళి ఆరోపించారు.

### ట్రస్ట్ ఐదేళ్ల ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక రీ-ఆడిట్

# అయోధ్య రామాలయ విరాళాల వ్యవహారం

**అయోధ్య:** శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌లో విరాళాల దుర్వినియోగం, నగదు అక్రమాల ఆరోపణల నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణను మరింత విస్తరించింది. అక్రమాల అసలు పరిమాణాన్ని నిర్ధారించేందుకు ట్రస్ట్ గత ఐదేళ్ల ఆర్థిక లావాదేవీలన్నింటినీ మరోసారి సమగ్రంగా పరిశీలించాలని నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేక రీఆడిట్ చేపట్టనున్నట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ప్రాథమిక విచారణలో కొన్ని ఆర్థిక అవకతవకలకు సంబంధించిన ఆధారాలు లభించిన నేపథ్యంలో ఆలయ నిర్మాణ వ్యయాలు, ట్రస్ట్ ఆదాయవ్యయ ఖాతాలు, విరాళాల నిర్వహణపై లోతైన పరిశీలన జరగనుంది. భక్తులు సమర్పించిన నగదు, బంగారం, వెండి ఆభరణాలు, ఇతర విలువైన కానుకల లెక్కలను కూడా అధికారులు మరోసారి సరిపోల్చనున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న అవినాశ్ శుక్లాను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. విరాళాల లెక్కింపు బాధ్యతల్లో కీలకంగా పనిచేసిన అతడిని స్థానిక న్యాయస్థానం 24 గంటల పోలీసు కస్టడీకి అప్పగించింది. ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న నగదులో అత్యధిక మొత్తం అతడి వద్ద నుంచే లభించినట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తులో భాగంగా పలువురు నిందితుల నుంచి భారీ మొత్తంలో నగదుతో పాటు బంగారం, వెండి, విదేశీ కరెన్సీని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అవినాశ్ శుక్లా వద్ద రూ.20.39 లక్షలు, కరుణేష్ పాండే వద్ద రూ.18.07 లక్షలు, అనుకల్ప్ మిశ్రా వద్ద రూ.16.82 లక్షలు, లవకుశ్ మిశ్రా వద్ద రూ.14.25 లక్షలు, రామశంకర్ మిశ్రా వద్ద రూ.7.32 లక్షలు, రామశంకర్ యాదవ్ అలియాస్ తిన్ను వద్ద రూ.1 లక్ష లభించాయి. అదనంగా 11 గ్రాముల బంగారం, 375 గ్రాముల వెండి, 1,121 అమెరికన్ డాలర్లను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అవినాశ్ శుక్లా నివాసంగా ఉపయోగిస్తున్న అయోధ్యలోని ఓ యోగా కేంద్రంలో నిర్వహించిన సోదాల్లో 'రామరాజ్య కోష్' పేరుతో పేటిఎం క్యూ ఆర్ కోడ్ అమర్చిన విరాళాల పెట్టెను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ విరాళాల సేకరణ, వినియోగంపై కూడా ప్రత్యేకంగా విచారణ కొనసాగుతోంది.

**6న కీలక సమావేశం**

ఈ కేసు దర్యాప్తులో భాగంగా ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా, ఆలయ నిర్మాణం, నిర్వహణతో సంబంధం ఉన్న గోపాల్ రావును సిట్ అధికారులు ఇప్పటికే విచారించారు. విచారణ అనంతరం చంపత్ రాయ్, అనిల్ మిశ్రా తమ పదవులకు రాజీనామాలు సమర్పించినట్లు సమాచారం. ఈ రాజీనామాలపై ఈనెల 6న ట్రస్ట్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది. ప్రస్తుతం బ్యాంకు లావాదేవీల రికార్డులు, సిసిటివి దృశ్యాలు, అధికారులు సేకరిస్తున్నారు. నగదు, ఆభరణాల లెక్కల్లో వ్యత్యాసాలు ఉన్నాయా అనే కోణంలో విచారణ కొనసాగుతుండగా, అవసరమైతే మరికొందరిని కూడా ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# అత్యంత గోప్యం.. ఆర్‌టిఐ కింద అందించలేం

## రామ జన్మభూమి ట్రస్టుపై సమాధానానికి ఎంహెచ్ఎ నిరాకరణ

**న్యూఢిల్లీ:** కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఎ), కేంద్ర సమాచార కమిషన్ (సిఐసి)ఇచ్చిన 2024 ఉత్తర్వుల ప్రకారం, 'శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్' ఏర్పాటుకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన పథకం, సంబంధిత ఉత్తర్వులు అత్యంత గోప్యమైన పత్రాలుగా భద్రపరిచినట్లు వెల్లడైంది. ఈ పత్రాలను సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) కింద అందించాలని నీరజ్ శర్మ అనే వ్యక్తి దరఖాస్తు చేయగా, వాటిని బహిర్గతం చేయడం వల్ల సంబంధిత వ్యక్తుల ప్రాణ భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంటూ ఎంహెచ్ఎ సమాచారం ఇవ్వడానికి నిరాకరించింది. ఈ నిర్ణయాన్ని సిఐసి సమర్థిస్తూ, ఆర్‌టిఐ చట్టంలోని సెక్షన్ 8(1)(జి) ప్రకారం ఈ సమాచారాన్ని వెల్లడించాల్సిన అవసరం లేదని తీర్పు ఇచ్చింది. ఈ వ్యవహారానికి నేపథ్యం అయోధ్య కేసులో తీర్పు అనంతరం 2020 ఫిబ్రవరి 5న కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు శ్రీ రామ్ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌ను ఏర్పాటు చేయడానికి ఒక ప్రత్యేక పథకాన్ని ప్రభుత్వం ఆమోదించింది. ఇందులో ట్రస్ట్ నిర్వహణ, ట్రస్టీల అధికారాలు, రామాలయ నిర్మాణం, ఇతర పరిపాలనా అంశాలకు సంబంధించిన నిబంధనలు పొందుపరిచినట్లు ప్రభుత్వం తెలిపింది. విచారణ సందర్భంగా ఎంహెచ్ఎ మరో కీలక అంశాన్ని ప్రస్తావించింది. ఈ ట్రస్ట్ పూర్తిగా స్వతంత్ర సంస్థ అని, కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహాయం, పరిపాలనా నియంత్రణ లేదా జోక్యం దీనిపై లేదని పేర్కొంది. సుప్రీంకోర్టు తీర్పు అమలులో భాగంగా ట్రస్ట్‌ను ఏర్పాటు చేయడమే ప్రభుత్వ పాత్ర అని స్పష్టం చేసింది. దీనిని అంగీకరించిన సిఐసి, ట్రస్ట్ ప్రభుత్వ ఆధీనంలోని సంస్థ కాదని, ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థ కూడా కాదని పేర్కొంది. అదే కారణంతో ట్రస్ట్‌ను ఆర్‌టిఐ చట్టంలోని 'పబ్లిక్ అథారిటీ'గా పరిగణించలేమని సిఐసి మరో ఉత్తర్వులో స్పష్టం చేసింది. ప్రభుత్వ యాజమాన్యం, నియంత్రణ లేదా గణనీయమైన ఆర్థిక సహాయం లేని సంస్థపై ఆర్‌టిఐ చట్టం వర్తించదని పేర్కొంది. దీంతో శ్రీ రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆర్‌టిఐ పరిధిలోకి రాదని, దాని అంతర్గత పత్రాలు లేదా పరిపాలనా సమాచారాన్ని ప్రజలు సమాచార హక్కు చట్టం ద్వారా పొందలేరని సిఐసి తేల్చిచెప్పింది.


**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ : మల్కాజ్‌గిరి జోన్**

| NIT No. | పని పేరు | అంచనా మొత్తం | బిడ్ సమర్పణకు ప్రారంభ తేది & సమయం / బిడ్ సమర్పణకు ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| NIT No. 35/ EE-I/MKJZ/ MMC/2026-27 | నిర్వహణ పనులు ఇతరాలు-1 | రూ. 2.90 లక్షలు | 04.07.2026 11.00AM 06.07.2026 & 11.30 AM | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సెల్ : 9989930389 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి.
DIPR R.O. No. : 5483-PP/CL/ADVT/2026-27, Date: 03-07-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ : జీడిమెట్ల సర్కిల్-55, క్యూబిజెడ్, సిఎంసి.**

| NIT No.& Date | పని పేరు | అంచనా మొత్తం | ప్రారంభ తేదీ & సమయం | బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం | టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు |
|---|---|---|---|---|---|
| NIT No. 09/DB/ EE-III/JDM/C-55/ QBZ/CMC/2026-27, Dated: 03.07.2026 | సిసి రోడ్లు, క్యాచ్‌పిట్స్ వేయడం (5 పనులు) | రూ. 60.00 లక్షలు | 04.07.2026 @ 3:00 PM | 13.07.2026 @ 3:00 PM | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సెల్ : 9989930549, హెడ్ డ్రాఫ్ట్‌మెన్ సెల్: 8712034411 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-III, జెడిఎం సి-55, సిఎంసి.
DIPR R.O. No. : 5472-PP/CL/ADVT/2026-27, Date: 03-07-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
అమీన్‌పూర్ సర్కిల్-47, శేరిలింగంపల్లి జోన్, eec47.ghmc@gmail.com

కొటేషన్ నోటీసు

కొటేషన్ నోటీసు నెం. Engg - 01/CMC/AMPR-C-47/2026-27, తేది: 02-07-2026.

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, అమీన్‌పూర్ సర్కిల్-47 తరపున, ఈ క్రింది పని కోసం అధీకృత డీలర్లు / కాంట్రాక్టర్లు / ఏజెన్సీల నుండి సీల్డ్ కొటేషన్లు ఆహ్వానించబడుతున్నాయి:

| కొటేషన్ నోటీసు నెం. | కొటేషన్ వివరాలు | Qty | కొటేషన్ తేదీలు | |
|---|---|---|---|---|
| కొటేషన్ నోటీసు నెం. Engg - 01/CMC/ AMPR-C-47/2026-27, తేది: 02-07-2026. | డెస్క్‌టాప్ కంప్యూటర్ HP 15, 12వ తరం (12th Gen), 8GB RAM, 512GB SSD హార్డ్ డిస్క్, 22 అంగుళాల Full HD స్క్రీన్, Windows 11, 3 సంవత్సరాల వారంటీ | 6 | కొటేషన్ల సమర్పణ ప్రారంభ తేది | 03-07-2026 10:30 A.M. |
| | స్కానర్ - DR-C230: 30 ppm (సింప్లెక్స్) / 60 ipm (డ్యూప్లెక్స్), ఫోలియో స్కానింగ్, డబుల్ ఫీడ్ డిటెక్షన్ (అవసరమైతే విస్మరించే సదుపాయం) | 2 | కొటేషన్ల స్వీకరణకు ఆఖరి తేది | 06-07-2026 3:00 P.M. |
| | ప్రింటర్ - ప్రింట్ రిజల్యూషన్: 600 x 600 dpi (నలుపు & తెలుపు). గరిష్ఠ ప్రింట్ పరిమాణం: A4, B5, A5, లీగల్. ప్రింట్ వేగం: 10 ppm వరకు. మీడియా మద్దతు: సాధారణ పేపర్ (20-80 gsm). వార్మ్-అప్ సమయం: 10 సెకన్ల కంటే తక్కువ. | 4 | కొటేషన్ల ప్రారంభ తేది | 06-07-2026 3:30 P.M. |
| | ల్యాప్‌టాప్ - Dell/Lenovo/Asus: ప్రాసెసర్: Intel Core Ultra 7 Processor 255H 2.0 GHz (24MB Cache, 5.1 GHz వరకు, 16 కోర్లు, 16 థ్రెడ్లు), Intel AI Boost NPU (13TOPS వరకు) \| డిస్‌ప్లే: 16.0-అంగుళాల FHD (1920 x 1200) OLED, 16:10 యాస్పెక్ట్ రేషియో, 60Hz రిఫ్రెష్ రేట్, 500 నిట్స్ HDR పీక్ బ్రైట్‌నెస్, 95% DCI-P3 కలర్ గమట్, 89% స్క్రీన్-టు-బాడీ రేషియో \| కీబోర్డ్: నంబర్-కీతో కూడిన బ్యాక్‌లిట్ చిక్లెట్ కీబోర్డ్ [సాఫ్ట్‌వేర్: 1 సంవత్సరం పాటు 100GB క్లౌడ్ స్టోరేజ్‌తో Microsoft 365 Basic + లైఫ్‌టైమ్ వాలిడిటీతో Office Home 2024 \| ఆపరేటింగ్ సిస్టమ్: Windows 11 Home] గ్రాఫిక్స్: ఇంటిగ్రేటెడ్ Intel Arc గ్రాఫిక్స్ \| మెమరీ: 16GB DDR5 RAM \| స్టోరేజ్: 512GB M.2 NVMe PCIe 4.0 SSD \| I/O పోర్ట్‌లు: 2x USB 3.2 Gen 1 Type-A (డేటా వేగం 5Gbps వరకు), 2x USB 3.2 Gen 1 Type-C (డిస్‌ప్లే / పవర్ డెలివరీ సపోర్ట్‌తో, డేటా వేగం 5Gbps వరకు), 1x HDMI 1.4, 1x 3.5mm కాంబో ఆడియో జాక్ \| కనెక్టివిటీ: Wi-Fi 6(802.11ax) (డ్యూయల్ బ్యాండ్) 2x2 + Bluetooth 5.3 వైర్‌లెస్ కార్డ్ (xOS వెర్షన్‌ను బట్టి బ్లూటూత్ వెర్షన్ మారవచ్చు) \| కెమెరా: Windows Hello సపోర్ట్ కోసం IR ఫంక్షన్‌తో కూడిన FHD కెమెరా; ప్రైవసీ షట్టర్ సదుపాయం ఉంది \| బ్యాటరీ: 70WHrs, 4S1P, 4-సెల్ Li-ion | 1 | కొటేషన్ల ప్రారంభ తేది | 06-07-2026 3:30 P.M. |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అమీన్‌పూర్ సర్కిల్-47, ఎస్ఎల్‌పి జోన్, సిఎంసి.
DIPR R.O. No. : 5421-PP/CL/ADVT/2026-27, Date: 03-07-2026

**పురపాలక సంఘ కార్యాలయము, హాలియా, జిల్లా: నల్లగొండ**

బహిరంగ టెండర్ (సీల్డ్ కొటేషన్) ప్రకటన

తై బజారు (మార్కెట్ ఫీజు) వసూలు హక్కు - ఆర్థిక సంవత్సరం 2626-27

తెలంగాణ పురపాలక సంఘాల చట్టం-2019 నిబంధనల ప్రకారం, హాలియా పురపాలక సంఘ పరిధిలోని **తైబజారు (రోజువారి మార్కెట్ మరియు ప్రతి ఆదివారం అంగడి మార్కెట్ ఫీజు వసూలు హక్కును** ఆర్థిక సంవత్సరం 2026-27 (12.07.2026 నుండి 31.03.2027 వరకు) సీల్డ్ కొటేషన్ (టెండర్) ద్వారా కాంట్రాక్టుగా ఇవ్వబడనున్నది. అందువలన ఆసక్తి గల అర్హులైన వ్యక్తులు / సంస్థలు తమ సీల్డ్ కోటేషన్‌ను తేది:05.07.2026 నుండి 08.07.2026 సాయంత్రం 5.00 గంటలలోపు హాలియా పురపాలక సంఘ కార్యాలయంలో సమర్పించవలెను.

టెండర్ నిబంధనలు

1. టెండర్‌లో పాల్గొనే వారికి హాలియా పురపాలక సంఘానికి ఎటువంటి బకాయిలు ఉండరాదు.
2. టెండర్‌లో పాల్గొనదలచిన వారు **రూ.20,000/- (అక్షరాల ఇరవై వేల రూపాయలు మాత్రమే)** DD రూపంలో 'Municipal Commissioner, Haliya' పేరున హాలియా పురపాలక సంఘ కార్యాలయానికి సీల్డ్ కొటేషన్‌తో పాటు పంపవలెను రూ.20000.00 DD పంపినవారు మాత్రమే అర్హులు.
3. తై బజారు టెండర్‌లో పాల్గొనేవారు తై బజారు వేలంపాట ప్రారంభపాట **రూ.3,50,000.00 (అక్షరాల మూడు లక్షల యాభైవేల రూపాయలు)**'గా నిర్ణయించనైనది. కావున వేలంపాటలో పాల్గొనేవారు సీల్డ్ కొటేషన్ పంపేటప్పుడు రూ.3,50,000.00 కంటే ఎక్కువగా కోడ్ చేసి సీల్డ్ కొటేషన్ ద్వారా కార్యాలయానికి పంపగలరు.
4. సీల్డ్ కొటేషన్‌లో అత్యధిక కోట్ చేసిన టెండరుదారుని ఎంపిక చేయబడును.
5. ఎంపికైన టెండరుదారు టెండర్ మొత్తాన్ని రెండు **(2) రోజులలోపు** సగం డబ్బులు చెల్లించవలెను. మిగతా సగం డబ్బులు రెండు దఫాలుగా ఆరు నెలల వ్యవధిలో రెండు సార్లు ఒక్కో దఫా డబ్బులు చెల్లించే వ్యవధి మూడు నెలలకు మించకుండా చెల్లించి అనుమతి ఉత్తర్వులు పొందవలెను.
6. నిర్ణీత గడువులో చెల్లించని యెడల డిపాజిట్ జప్తు చేయబడును మరియు టెండర్ రద్దు చేయబడును. తిరిగి నిర్వహించిన టెండర్‌లో తక్కువ మొత్తం వచ్చినచో వచ్చిన నష్టాన్ని మొదటి టెండరుదారుని నుండి వసూలు చేయబడును.
7. టెండర్ మొత్తం చెల్లించిన తరువాత స్టాంపు పేపర్‌పై ఒప్పంద పత్రం (Agreement) నమోదు చేయవలెను.
8. ఎటువంటి కారణం తెలుపకుండానే ఈ టెండర్‌ను రద్దు చేయు హక్కు హాలియా పురపాలక సంఘ కమిషనర్ గారికి కలదు.

తై బజారు ఫీజు రేట్లు

| క్ర.సం. | వసూలు వివరాలు | రుసుము (రూ.) |
|---|---|---|
| 1 | గంపకు | 15.00 |
| 2 | తోపుడు బండ్లు, కూరగాయల కాంట, సోడా బండి, ఐస్‌క్రీం, గప్‌చుప్, న్యూడిల్స్, మిర్చి బండీ, జ్యూస్ బండి, బజారులో మాంసం వ్యాపారం, రోడ్డుపై చిల్లర దుకాణాలు, గాజులు, కిరాణం, బట్టలు, ఎలక్ట్రికల్, చెప్పులు, తోళ్ళు, మిరపకాయలు మరియు ఇతర సామగ్రి | 30.00 |
| 3 | వ్యాపార అవసరాల కోసం వచ్చిన ప్రతి ఆటో (రోజుకు) | 50.00 |
| 4 | వ్యాపార అవసరాల కోసం వచ్చిన ప్రతి డి.సి.యం. (రోజుకు) | 80.00 |
| 5 | వ్యాపార అవసరాల కోసం వచ్చిన ప్రతి లారీ (రోజుకు) | 100.00 |

**సీల్డ్ కొటేషన్‌లు కార్యాలయానికి తేదీ: 08.07.2026 సాయంత్రం 5.00 గంటలలోపు రావలెను. గడువు మీరిన తదుపరి కార్యాలయానికి వచ్చిన సీల్డ్ కొటేషన్ లను పరిగణలోనికి తీసుకోబడదు మరియు తేదీ: 09.07.2026 మధ్యాహ్నం 12.00 గంటలకు సీల్డ్ కొటేషన్ లో ఓపెన్ చేసి ఎక్కువ కోడ్ చేసినవారిని ప్రకటించబడును.**

స్థలం: పురపాలక సంఘ కార్యాలయం, హాలియా.
గమనిక: పూర్తి టెండర్ నిబంధనలు కార్యాలయ పని వేళల్లో హాలియా పురపాలక సంఘ కార్యాలయంలో తెలుసుకోవచ్చు.

సం/- కమిషనర్
పురపాలక సంఘం, హాలియా
DIPR R.O. No. : 5412-PP/CL/ADVT/2026-27, Date: 03-07-2026

# 'ప్రపంచ కలల భూమి' గత కాలపు స్వర్ణయుగమే

● అమెరికా స్వాతంత్ర్యానికి 250 ఏళ్ళు ● స్వర్ణయుగం ఇక గడచిపోయిన కాలమేఃసర్వే ● నేడు వార్షికోత్సవ వేడుక



**వాషింగ్టన్:**ప్రపంచవ్యాప్తంగా ఎన్నోదేశాలలో యువతీయువకులకు కలలభూమిగా,తమ ఆశయాలు నెరవేర్చుకోవడానికి సరైన శక్తిసామర్థ్యాలున్న వేదికగా భావించే అమెరికా సంయుక్త రాష్ట్రాలు శనివారంనాడు చరిత్రాత్మకమైన 250వ వార్షికోత్సవ వేడుకలు చేసుకుంటున్నది. అమెరికాలో లోతైన పక్షపాతధోరణితో కూడిన విభజన చోటుచేసుకున్న సమయంలో ఈ వార్షికోత్సవ వవేడుకలు వచ్చాయి. ఎన్నో గొప్ప ఆవిష్కరణలకు,వింతలు,విడ్డూరాలకు నిలయమై,సినిమాలు,సంగీతం,పాప్ మ్యూజిక్‌ను ప్రపంచానికకి ఎగుమతి చేసిన దేశం ఈనాడు వన్నె–వాసి కోల్పోతూ నాలుగురోడ్ల కూడలిలో ఉంది. ''అమెరికాలో స్వర్ణయుగం గడచిపోయిన కాలమే, ఇక అది గతమే'' అని అనేకమంది అమెరికన్లు అభిప్రాయపడుతున్నట్లు ''ప్యూ రీసెర్చ్ సెంటర్'' ఇటీవల చేసిన అధ్యయనం వెల్లడించింది. జపాన్‌పై 1945లో అణుబాబు ప్రయోగించినప్పుడు ప్రంపంచం భయంతో చూసింది. ఆధిపత్యాన్ని అగీకరించింది. ఇతర దేశాలపై దాడులు చేస్తున్నప్పుడు అసమానతల సమాజంలో దీనిని ప్రపంచం అనివార్యంగా చూసింది. నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ 1969లో రెండు గంటలసేపు చంద్రుడిపై సంచరించినప్పుడు అమెరికా వైపు ప్రపంచం అబ్బురంగా చూసింది. కానీ ఈనాడు పశ్చిమాసియాలో యుద్ధం జరిగినప్పుడు పరిస్థితులు పూర్తి భిన్నంగా మారిపోయాయి. ప్రపంచ పరిణామక్రమంలో ఆధిపత్యవాదంపై విస్తారమైన చర్చ,వ్యతిరేకత,ఏహత్య పెరిగింది. అమెరికాను ఆరిపోయే ముందు వెలిగే దీపంలా చూస్తున్నారు. ఐక్యరాజ్య సమితి సంస్కరణలు ప్రధానంగా తెరమీదకు వచ్చాయి. చరిత్రగతిలో మార్పు సంభవం అని ప్రపంచం ఆలోచనలోకి వెళ్ళింది. నాడు 1776లో బ్రిటన్ నుండి స్వాతంత్ర్యం పొందిన అమెరికా క్రమంగా విస్తరించి అనేక జాతుల సమాహారంగా,ప్రపంచ ఔత్సాహికులు,ఆవిష్కర్తలకేంద్రంగా ప్రవర్థమానమై ఈనాడు మళ్ళీ తిరోగామి బాటదశలో ఉన్న తరుణంలో ఈ వేడుకలు జరుగుతున్నాయి. వలస ప్రజల శక్తిసామర్థ్యాలతో మహోన్నత ఆర్థిక వ్యవస్థగా ఎదిగిన అమెరికా కయ్యానికి కాలు దువ్వేదేశంగా మారి, మితవాద నాయకత్వం నేతృత్వంలో స్థానికత నినాదంతో ప్రతిభావంతులను తిరస్కరించి కొత్త తరాన్ని దూరం చేసుకునే స్థాయికి చేరకుంది. ఈ చరిత్రాత్మకమైన వార్షికోత్సవవేళ ''అమెరికా కల''ను నెరవేర్చుకోవడానికి అక్కడకు వెళ్ళిన వేలు,లక్షలమంది అనిశ్చితిలో పడ్డారు. ఉద్యోగాలు కోల్పోయి,గుర్తింపు కూడా కోల్పోతూ భవిష్యత్తు అగమ్యగోచరమై ఆందోళనతో ఉన్న దశలో ఈ వేడుకలు జరుగుతున్నాయి.ఈ పరిస్థితులమధ్య అమెరికాలోని మైనే అనే చిన్నపట్టణంలో స్థిరపడిన సామాలియా శరణార్థి అబ్దినోర్ ఇష్టిన్ (41) స్థానిక మీడియాతో మాట్లాడుతూ, ''నా అమెరికా కల–అందుకు తగిన సామర్థ్యం సజీవంగా ఉంది, కానీ అవకాశాలే బలహీనపడ్డాయి'' అని వ్యాఖ్యానించారు. దారుణమైన మురికివాడలో పుట్టి,స్వశక్తితో ఎదిగి, హాలీవుడ్ సినిమాలు చూసి ఇంగ్లీషు భాష అనర్గళంగా నేర్చుకుని స్వదేశంలో ''అబ్ది అమెరికా'' అనే ముద్దుపేరుతో గుర్తింపు పొంది, కష్టపడి అమెరికా చేరిన అబ్దినోర్ ఇష్టిన్ ఇప్పుడు ఎటూతోచక నాలుగురోడ్ల చౌరాస్తాలో నిలబడిపోయాడు. ఇలా అబ్దిలాంటి వేలమంది అనేక దేశాలకు చెందిన వారు అమెరికాలో ఉన్నారు.అదేవిధంగా కాలిఫోర్నియాలో స్థిరపడిన నటుడు,కెనడియన్ ల్యాక్ మిల్లెన్ (24)మాట్లాడుతూ, హాలీవుడ్‌లో నటులకు సినిమా అవకాశాలు తగ్గిపోయాయని, తాను తిరిగి కెనడా వెళ్ళాలనుకుంటున్నాననీ చెప్పారు. కాగా అసోసియేటెడ్‌ప్రెస్–నార్క్ ఇటీవల నిర్వహించిన ఒక సర్వేలో ''అమెరికాలో కలనెరవేర్చుకునే అవకాశాలు ఇంకా మిగిలే ఉన్నాయని మూడింట ఒకవంతు ప్రజలు మాత్రమే ఇప్పటికీ నమ్ముతున్నారు'' అని వెల్లడైంది.

# యూరప్ వడగాలుల్లో గతనెల 3,700 మంది మృతి



**పారిస్:**యూరప్‌వ్యాప్తంగా గతనెలలో భయంకరమైన వడగాలులకు మొత్తం 3,700 మంది పైగామరణించారు. ఒక్క ఫ్రాన్స్‌లోనే వడగాలి మృతుల సంఖ్య 2,025కు చేరుకుంది. 45 ఏళ్ళు వయసుదాటివారి మరణాలు బాగా పెరిగినట్లు ఫ్రాన్స్ ఆరోగ్యశాఖామంత్రి స్టెఫానీ రిస్ట్ చెప్పారు. దీనికితోడు దక్షిణ ఫ్రాన్స్‌లోని సెయింట్ మేరీ లావిర్ ప్రాంతంలె కార్చిర్చు చెలరేగింది. 3000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఫ్రాన్స్ ప్రధానమంత్రి సెబాస్టియన్ లెకార్నూ మాట్లాడుతూ, ఈ వేసవికాలం మొదలైనప్పటి నుండీ 7000 కార్చిచ్చులు రగిలాయని,8,700 హెక్టార్ల అటవీ ప్రాంతం మంటల్లో బూడిద అయ్యిందని చెప్పారు. ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీ, ఇటలీ,స్పెయిన్,నెదర్లాండ్స్‌దేశాలలో ఈ మరణాలు సంభవించాయి. ప్రస్తుతం తూర్పు యూరప్‌లో వేడి గాలులు ప్రభావం చూపిస్తున్నాయి. ప్రస్తుతం తూర్పు యూరప్‌లో వేడి గాలులు ప్రభావం చూపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో వడగాలులు మరింత ప్రభావం చూపిస్తాయని వాతావరణ నిపుణునలు హెచ్చరించారు. జూన్ నెలలో యూరప్‌దేశాలలో వడగాలులు గరిష్ఠంగా 44 డిగ్రీల సెంటీగ్రేడ్స్ స్థాయికి చేరుకుని సరికొత్త రికార్డులు సృష్టించాయి. మరణించినవారిలో ఎక్కువమంది 70 ఏళ్ళు పైబడిన వృద్ధులు,పిల్లలు ఉన్నారు. ఫ్రాన్స్‌లో జూన్ నెలాఖరులో 2000 మందిపైగా మరణించారు. విపరీతమైన చలివాతావరణం కారణంగా ఈ ప్రాంతాలలో ఇళ్ళకు వెంటిలేషన్ లేకుండా పూర్తిగా మూసివేసి ఉంటాయి. దీంతో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరగడంతో వెంటిలేషన్ లేక చాలామంది వేడి భరించలేక మరణించారు. బెల్జియంలో 1200 మంది మరణించినట్లు అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. నెదర్లాండ్స్‌లో 480 మంది మరణించారు. వీరిలో ఎక్కువమంది 80 ఏళ్ళు వయసు దాటినవారే ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా భూతాపాన్ని శరవేగంగా స్వీకరిస్తున్న మొదటిఖండంగా యూరప్‌ను గుర్తించారు శాస్త్రవేత్తలు.

# ఇజ్రాయెల్‌లో ప్రజా నిరసన


భద్రతా వైఫల్యంపై విచారణకు డిమాండ్



**టెల్‌అవీవ్:**హమాస్ ఉగ్రవాదుల హింసాత్మక దండయాత్రకు 1000 రోజులు పూర్తయిన సందర్భంగా ఇజ్రాయెల్ రాజధాని నగరం టెల్‌అవీవ్‌లో ఉన్న హోస్టేజ్ స్క్వేర్ వద్ద శుక్రవారం వేలాదిమంది ప్రజలు గుమిగూడారు. హమాస్ దాడికి నిరసన వ్యక్తం చేశారు. మరణించిన తమ ప్రియతమ కుటుంబ సభ్యులకు ఇజ్రాయెలీలు నివాళులు అర్పిస్తూ వారిని స్మరించుకున్నారు.హమాస్ దాడిని నివారించడంలో విఫలమైన పాలకుల అసమర్థ చర్యలకు కారణాలు చెప్పాలని, హమాస్ దండయాత్రపై విచారణా కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రజలు సామూహికంగా డిమాండ్ చేశారు. టెల్‌అవీవ్ మేయర్ రాన్ హుల్దాన్,ప్రభుత్వ వ్యరేక ఉద్యమంలో కీలకపాత్ర వహించిన హమాస్ బందీ తల్లి ఐనాయ్ జంగౌకర్ సహా మాజీ బందీలు,వారి కుటుంబీకులు,మృతుల కుటుంబీకులు పాల్గొన్నారు. 2023 అక్టోబరు ఏడోతేదీ హమాస్ ఉగ్రవాదులు సరిహద్దులు దాటి వందలమంది ఇజ్రాయెల్ నగర శివారు ప్రాంతాలపై దాడి చేశారు. ఈ దాడుల్లో 1250 మంది ఇజ్రాయెలీ ప్రజలు మరణించగా అనేకమందిని కిడ్నాప్ చేసి బందీలుగా తీసుకుపోయారు. ఆ తర్వాత గాజాలో యుద్ధం ప్రారంభమై గత ఏడాది అక్టోబరు వరకూ దురాక్రమణ మారణకాండ కొనసాగింది. ఈ ఏకపక్ష యుద్ధంలో 73,000 మంది పాలస్తీనియన్లు మరణించగా, మరో 1.70 లక్షలమంది గాయడ్డారు. కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత జరిగిన ఇజ్రాయెల్ సైన్యం చేసిన దాడుల్లో గడచిన తొమ్మిది నెలలుగా మరో 1500 మంది మరణించారు.

# ఖమేనీకి భారత్ సహా పలు విదేశీ ప్రముఖుల నివాళులు

ఎల్లుండి నుండి పలుచోట్ల అంతిమయాత్ర



**టెహ్రాన్:**అమెరికా సర్వోన్నత నాయకుడు మొజ్తాబా ఖమేనీ తండ్రి, ఇస్లామిక్ విప్లవ నాయకుడు, అమెరికా దాడిలో ప్రాణాలు కోల్పోయన ఆ దేశాధితనేత ఆయెతొల్లా అలీ ఖమేనీకి శుక్రవారం పలు విదేశీ ప్రముఖులు అంతిమ నివాళులు అర్పించారు. చైనా, రష్యా, భారత్, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, బ్రిటన్, డెన్మార్క్, ఆస్ట్రియా, ఇటలీ, ఇరాక్, టర్కీ, లెబనాన్, సిరియా, బోస్నియా, హెర్జ్‌గొవినా, హంగేరీ, స్పెయిన్, ఈక్వెడార్ సహా అనేక దేశాల నాయకులు, మతపెద్దలు, ఇతర సంఘాల బృందాలు నివాళులు అర్పించినవారిలో ఉన్నారు. టెహ్రాన్‌లోని విశాలమైన గ్రాండ్ మొసెల్లాహాలుకు ఖమేనీ భౌతిక కాయాన్ని శుక్రవారం తెల్లవారుజామున తరలించారు. పలుదేశాల ప్రముఖులు,ఇస్లామిక్ గ్రూపుల నాయకులు, మత పెద్దలు,విద్యావేత్తలు, యుద్ధవ్యతిరేక, ఆధిపత్య వ్యతిరేక ప్రముఖులు,పాలకులు భౌతికదేహం వద్ద నివాళులు అర్పించారు. వీరిలో పలువురు దేశాధ్యక్షుడు, మంత్రులు ఉన్నారు. ఆయనతోపాటు హత్యకు గురైన ఆయన భార్య, కుమార్తె, అల్లుడు, మనుమరాలు, ఇతర కీలక ప్రముఖుల మృతదేహాలను కూడా అక్కడ ఉంచారు. ప్రజలు దుఃఖిస్తూ, గుండెలు బాదుకుంటూ విలపిస్తున్నారు. దేశ ప్రజలు మూడు రోజుల అంత్యక్రియల్లో పాల్గొని నాయకుడికి నివాళులు అర్పించాలని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ పిలుపు ఇచ్చారు. ఇరాన్ ప్రభుత్వ ఆహ్వానం మేరకు భారత్ తరపున విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ సహాయమంత్రి పవిత్రా మార్గరిటా, బీహార్ గవర్నసయ్యద్ అస్నా న్ హస్నైన్‌లు శుక్రవారం టెహ్రాన్‌కు వెళ్ళారు. పాకిస్థాన్ తరపున ప్రధానమంత్రి షెహబాజ్ షరీ ఫ్, ఆ దేశ సర్వసేనాధిపతి ఆసిఫ్ మునీర్ కూడా శుక్రవారం టెహ్రాన్ చేరుకున్నారు. ఈ విషాద సమయంలో ఇరాన్ ప్రజలకు పాకిస్థాన్ పూర్తి సంఘీభావం ప్రకటించిందని షరీఫ్ చెప్పారు.ఇరాన్‌ను ఖమేనీ 37 సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా పరిపాలించారు. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాలలో ఆయన భౌతిక కాయాన్ని ఊరేగిస్తారు. ఈనెల ఆరో తేదీ నుండి తొమ్మిదో తేదీ వరకూ నిర్వహించే ఊరేగింపు కార్యక్రమాలలో లక్షలాదిమంది ప్రజలు పాల్గొంటారు. ఖమేనీ భౌతిక కాయాన్ని ఆయన స్వస్థలం మషాద్‌లో తొమ్మిదో తేదీన ఖననం చేస్తారు. దీనికి ముందుగా ఇరాన్,ఇరాన్‌లలో ఉన్న ప్రముఖ షియా కేంద్రాలైన ఖోమ్, నజ ఫ్, కెర్బలాలకు కూడా భౌతిక కాయాన్ని తీసుకువెళతారు. రాబోయే సోమవారం నుండి ఆయన అంతిమయాత్ర కార్యక్రమం ప్రారంభమవుతుంది. భారత్ సహా వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు చేరుకున్నారు. తండ్రిస్థానంలో దేశ సకల బాధ్యతలు తన భుజస్కంధాలపై వేసుకున్న మొజ్తాబా ఖమేనీ భద్రతా కారణాల రీత్యా కన్నతండ్రి అంత్యక్రియల కార్యక్రమాలలో పాల్గొనడం లేదని ఇరాన్ పాలకులు స్పష్టం చేశారు. పైగా ఆయన ఫిబ్రవరి నెలాఖరున అమెరికా దాడి తర్వాత గుర్తు తెలియని ప్రదేశంలో చికిత్స తీసుకున్నారు.

# చైనా–ఇరాన్ మధ్య వ్యూహాత్మక బంధం

ముఖాముఖీ చర్చలో ఘాలిబాఫ్ పిలుపు

**టెహ్రాన్:**చైనా–ఇరాన్ దేశాలమధ్య వ్యూహాత్మక, రాజకీయ, పార్లమెంటరీ సంబంధాలు లోతుగా, బలంగా విస్తరించాలని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాఘెర్ ఘాలిబాఫ్ పిలుపు ఇచ్చారు. హోర్ముజ్ జలసంధిలో చైనా నౌకలకు ఇరాన్ పూర్తి వెసులుబాటు కల్పించిందని, ఈ వ్యూహాత్మక జలమార్గంలో అమెరికా జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఇరాన్ అంగీకరించబోదని స్పష్టం చేశారు. ఈ ఏడాదిలో రెండు దేశాలమధ్యా దౌత్య సంబంధాలకు 55వ వార్షికోత్సవాన్ని కూడా నిర్వహిస్తున్నారు. ఇరుదేశాల సమగ్ర వ్యూహాత్మక బంధానికి కూడా ఈ ఏడాది పదో వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమం సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించేందుకు శుక్రవారం టెహ్రాన్‌లో పర్యటించిన చైనా బృంద నాయకుడితో ఘాలిబాఫ్ ముఖాముఖీ సమావేశం జరిపారు. గతంకంటే భిన్నంగా ఇప్పుడు రెండు దేశాలమధ్య వ్యూహాత్మక సంబంధాలు విస్తరించాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు.

## క్రైస్తవ మిషనరీపై లోతైన విచారణ

**న్యూఢిల్లీ:** అమెరికాకు చెందిన క్రైస్తవ మిషనరీ సంస్థ 'ది టిమోతి ఇనిషియేటివ్' (టిటిఐ)విదేశీ డెబిట్ కార్డుల ద్వారా భారతదేశంలో అక్రమంగా భారీ మొత్తంలో నగదు ఉపసంహరించిందన్న ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (ఇడి) మరింత లోతైన విచారణను కొనసాగిస్తున్నది. ఈ వ్యవహారంలో విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సిఆర్‌ఎ) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని కోరుతూ కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ)కి ఈడీ నివేదిక పంపనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ కేసులో బెంగళూరు, మైసూరు, అస్సాంలోని గోల్‌పారా, ఛత్తీస్‌గఢ్‌లోని ధమ్‌తరి ప్రాంతాల్లో ఇడి గత ఏప్రిల్‌లో సోదాలు నిర్వహించింది. ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ అందించిన అనుమానాస్పద లావాదేవీల నివేదిక ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన ఇడి, అమెరికాలోని ట్రూయిస్ట్ బ్యాంక్ జారీ చేసిన డెబిట్ కార్డుల ద్వారా భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థను పక్కనబెట్టి విదేశీ నిధులు దేశంలోకి ప్రవేశించి నగదుగా ఉపసంహరించబడినట్లు గుర్తించింది. దర్యాప్తులో సేకరించిన ఆధారాల ఆధారంగా కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ పోలీసు శాఖలు ఇప్పటికే వేర్వేరు కేసులు నమోదు చేశాయి. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కూడా ప్రత్యేక కేసు నమోదు చేసే దిశగా ఇడి చర్యలు చేపడుతోంది. సోదాల అనంతరం టిటిఐ వెబ్‌సైట్ భారత్‌లో అందుబాటులో లేకుండా మారడమే కాకుండా, అమెరికాలోని సర్వర్లలో భద్రపరిచిన డిజిటల్ సమాచారం కూడా తొలగించినట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ సంస్థ ఎఫ్‌సిఆర్‌ఎ కింద నమోదు కాలేదని, అయినప్పటికీ 2019 నుంచి వెయ్యికి పైగా విదేశీ డెబిట్ కార్డులను భారత్‌లో వినియోగానికి పంపిణీ చేసినట్లు విచారణలో వెల్లడైందని ఇడి ఒక ప్రకటనలో తెలిపింది. గత కొన్నేళ్లలో నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో ఈ కార్డుల ద్వారా సుమారు రూ.6.5 కోట్ల నగదు ఉపసంహరణ జరిగినట్లు గుర్తించినట్లు వెల్లడించింది. అలాగే 2025 నవంబర్ నుంచి 2026 ఏప్రిల్ వరకు దాదాపు రూ.95 కోట్ల విదేశీ నిధులు ఈ విధానంలో భారత్‌కు చేరినట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి.

# 'ఇ–రిక్షా' డ్రైవర్లలో అభద్రతా భావం

**న్యూఢిల్లీ:** ఢిల్లీలోని ఇ–రిక్షా డ్రైవర్లలో అభద్రతా భావం, ఆందోళన నెలకొంటున్నాయి. స్మార్ట్‌ఫోన్‌లోని ఒక బ్లూటూత్ ఆధారిత యాప్‌ను ఉపయోగించి కొందరు వ్యక్తులు లిథియం అయాన్ బ్యాటరీలతో నడిచే ఇ–రిక్షాలను దూరం నుంచే అకస్మాత్తుగా నిలిపివేస్తున్నారనే ఆరోపణలు రావడంతో డ్రైవర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఢిల్లీ ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేసింది. మెట్రో స్టేషన్ల పరిసరాలు, రద్దీ రహదారులపై ప్రయాణికులను తీసుకెళ్లే ఇ–రిక్షాలు ఒక్కసారిగా ఆగిపోతే వెనుక నుంచి వేగంగా వచ్చే వాహనాలు ఢీకొనే ప్రమాదం ఉందని డ్రైవర్లు చెబుతున్నారు. పంజాబీ బాగ్–పీరాగఢి, వెస్ట్ ఎన్‌క్లేవ్–పితంపురా, కోహాట్ ఎన్‌క్లేవ్–నేతాజీ సుభాష్ ప్లేస్ వంటి మార్గాల్లో నడిపే డ్రైవర్లు, ఈ సమస్య వల్ల ప్రయాణికుల భద్రతతో పాటు తమ ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది డ్రైవర్లు తొలుత దీనిని బ్యాటరీ లోపంగా భావించి మరమ్మతులకు డబ్బు ఖర్చు చేశామని, తర్వాత ఇది మొబైల్ యాప్ ద్వారా జరుగుతున్న వ్యవహారమని తెలిసిందన్నారు. రహదారి మధ్యలో వాహనం ఆగిపోతే ప్రయాణికులు చార్జీలు చెల్లించకుండా వెళ్లిపోతున్నారని, దీంతో ఆర్థిక నష్టంతో పాటు మానసిక ఒత్తిడి కూడా ఎదురవుతోందని పేర్కొన్నారు. సాంకేతిక నిపుణుల ప్రకారం, కొన్ని లిథియంఅయాన్ బ్యాటరీల్లో బ్లూటూత్ సదుపాయం కలిగిన బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (బిఎంఎస్) ఉంటుంది. సరైన భద్రతా వ్యవస్థలు లేకపోతే, సమీపంలో ఉన్న ఎవరైనా మొబైల్ యాప్ ద్వారా బ్యాటరీకి అనుసంధానమై దాని డిశ్చార్జ్‌ను నిలిపివేయగల అవకాశం ఉంటుంది. దీంతో ఇ–రిక్షా ఒక్కసారిగా ఆగిపోతుంది. పాత లెడ్‌యాసిడ్ బ్యాటరీలతో నడిచే వాహనాలకు ఈ సమస్య ఉండదని నిపుణులు చెబుతున్నారు. కొంతమంది వ్యక్తులు వినోదం కోసం ఇ–రిక్షాలను ఈ విధంగా నిలిపివేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనల వల్ల రహదారి ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, ఆరోపణల నిజానిజాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఢిల్లీ ప్రభుత్వం రవాణా శాఖను ఆదేశించింది.

## నేడు సిఎం పర్యటన

(3వ పేజీ తరువాయి)

ముఖ్య నాయకులతో, ఆనాటి పెద్దలతో మాటామంతీ జరిపి, వారితోనే మధ్యాహ్న భోజనం చేస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఉర్కొండపేట నుంచి రోడ్డు మార్గంలో మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌కు బయలుదేరుతారు. 2.45 గంటలకు మిడ్జిల్ మండలం వెల్జాల ఎక్స్‌రోడ్స్‌కు చేరుకుని దివంగత స్థానిక సీనియర్ నేత గోపాల్ రెడ్డి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరిస్తారు. అక్కడి నుంచి మిడ్జిల్ బహిరంగ సభా ప్రాంగణంలో వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ, శంకుస్థాపనలు చేయనున్నారు. సాయంత్రం 3.15 గంటలకు మిడ్జిల్లో జరిగే బహిరంగ సభలో సిఎం రేవంత్ రెడ్డి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు జెడ్‌పిటిసి నుంచి ఎంఎల్‌సి , ఎంఎల్‌ఎ , ఎంపి, టిపిసిసి అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా సాగిన తన ప్రస్థానంలో మిడ్జిల్ ప్రజల ఆశీర్వాదం కీలకమని సిఎం రేవంత్ రెడ్డి వర్గీయులు చె బుతున్నారు.

## 15న ఇందిరాపార్క్ వద్ద సిపిఐ(ఎం) ధర్నా

(3వ పేజీ తరువాయి)

ఎంబిభవన్‌లో సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, టి.జ్యోతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీని అమలు చేయలేదని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. ప్రభుత్వం చెబుతున్న 62 వేల ఉద్యోగాల్లో ఎక్కువ నియామకాలు గత ప్రభుత్వ నోటిఫికేషన్ల ద్వారానే జరిగాయని, కొత్తగా కేవలం 16 వేల పోస్టులకే నోటిఫికేషన్లు ఇచ్చిందన్నారు. పోలీసు శాఖలో 20 వేల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పక్కనబెట్టి రాజకీయ పార్టీలు విమర్శలకే పరిమితమయ్యాయని, ఉద్యోగాలు, విద్య, వైద్యం, పేదల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని జాన్ వెస్లీ కోరారు. అదేవిధంగాఈ నెల 6న పేదలకు ఇండ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేదలకు 120 గజాల ఇంటి స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రూ.8,21,651 కోట్లు

(3వ పేజీ తరువాయి)

పెరగడంతో వాస్తవాలను బయటపెట్టాల్సి వచ్చిందన్నారు. గత పదేళ్లలో ఇరిగేషన్, రోడ్ల నిర్మాణాల పేరుతో ఎస్ఎస్ఆర్ రేట్లు పెంచిన బిఆర్ఎస్ ప్రభుత్వం రెసిడెన్షియల్ పాఠశాలల్లో పిల్లలు తినే ఆహారానికి,వారి కాస్మెటిక్ ఛార్జీలకు రేట్లు ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు.

**వడ్డీలను తగ్గించడంతో రాష్ట్రానికి రూ. 22,142 కోట్లు ఆదా చేశాం...**

బిఆర్ఎస్ ప్రభుత్వం కార్పొరేట్ బ్యాంకుల వద్ద 10 శాతం, నుంచి 10.5 శాతం వరకు భారీ వడ్డీ రేట్లతో అప్పులు తెచ్చి రాష్ట్రంపై పెనుభారం వేసిందని, తాము ఆ అప్పులను డెబిట్ రీస్ట్రక్చరింగ్ ప్రక్రియలోకి తీసుకొచ్చామని భట్టి విక్రమార్క వివరించారు. 202526 నుంచి 203132 మధ్య కాలంలో చెల్లించాల్సిన రూ. 34,058 కోట్ల రుణ భారాన్ని, రూ. 11,915 కోట్లకు తగ్గించామని వివరించారు. తద్వారా రాష్ట్రానికి రూ. 22,142 కోట్లు ఆదా జరిగిందన్నారు.

**కార్పొరేషన్ అప్పులనూ ప్రభుత్వమే చెల్లిస్తుంది.. కదా?**

రైతల నుంచి డబ్బులు వస్తాయని కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారా రుణాలు తీసుకొచ్చారని, ప్రజల నుంచి పన్నుల రూపంలో డబ్బులు వస్తాయని మిషన్ భగీరథ ప్రాజెక్టుకు మిషన్ భగీరథ కార్పొరేషన్ ద్వారా అప్పు చేశారని భట్టి విక్రమార్క వివరించారు. ఈ రెండు కార్పొరేషన్లకు ప్రభుత్వం కేవలం గ్యారంటీ మాత్రమేనని అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం చెప్పిందని, కానీ ప్రసుత్తం ఆ కార్పొరేషన్లు తీసుకున్న రుణాలను ప్రభుత్వమే చెల్లిస్తుందని వివరించారు. ఈకార్పొరేషన్ అప్పులను ప్రభుత్వం చెల్లించకపోతే ఎవరు చెల్లిస్తున్నారని? కెసిఆర్ ఏమైనా చెల్లిస్తారా? అని ఎద్దేవా చేశారు.

**కేజీ బొగ్గు కూడా అక్రమంగా వెళ్లే అవకాశమే లేదు..**

సింగరేణి కాలరీస్‌లో 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందనే బిఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని భట్టి విక్రమార్క అన్నారు. ఈ సంస్థలో ఎటువంటి అక్రమాలకు తావులేదని,ఆ సంస్థ భద్రత కోసం అత్యున్నత స్థాయి జియోఫెన్సింగ్ వ్యవస్థ ఉందన్నారు. ఒక్క కేజీ బొగ్గు కూడా అక్రమంగా బయటకు వెళ్లే అవకాశమే లేదన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో సింగరేణి సంస్థకు కొత్తగా ఒక్క కోల్ బ్లాక్స్‌నైనా తీసుకొచ్చారా? అని ప్రశ్నించారు. కనీసం ఉత్పత్తి అయిపోయి మూతపడిన మైనింగ్ బ్లాకులకు బదులుగా కొత్తవి తెచ్చారా? అని అన్నారు. భద్రాద్రి, యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులను భారీగా విస్తరించిన కెసిఆర్ ప్రభుత్వం, వాటికి అవసరమైన బొగ్గు గనులను మాత్రం ఎందుకు సమకూర్చలేదన్నారు. కేంద్రం వేలం వేసిన కోల్ బ్లాకుల్లో పాల్గొని సింగరేణికి ఆ గనులను ఎందుకు దక్కించుకోలేదని, సింగరేణికి గనులు వస్తే రాయల్టీ రూపంలో వచ్చే ఆదాయం తెలంగాణకే చెందేది కదా? అని అన్నారు. కోయగూడెం, సత్తుపల్లి3 వంటి బొగ్గు బ్లాకులను సింగరేణికి దక్కకుండా చేసిందే బిఆర్ఎస్ ప్రభుత్వమని ఆరోపించారు. వాటిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడంలో కెసిఆర్ ప్రభుత్వ పాత్ర ఉందన్నారు. దాదాపు 65 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్న సత్తుపల్లి3 బ్లాకును ప్రైవేటుకు ఎందుకు ఇచ్చారని భట్టి ప్రశ్నించారు. సింగరేణిని ఆర్థికంగా దెబ్బతీసి, థర్మల్ పవర్ ప్రాజెక్టులకు బొగ్గు కొరత సృష్టించి, ప్రైవేటు వ్యక్తుల నుంచి బొగ్గు కొనుగోలు చేయాలన్నదే బిఆర్ఎస్ దుర్మార్గపు ఆలోచన అని ఆయన ఆరోపించారు. సింగరేణి బొగ్గు విషయమంలో పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని సింగరేణి విజిలెన్స్ డైరెక్టర్‌ను ఆదేశించామని, సమగ్ర విచారణ నివేదికను ప్రభుత్వానికి అందజేస్తారని తెలిపారు. గురుకులాల టెండర్ విలువనే రూ. 1,142 కోట్లు అని, ఇందులో రూ.2వేల కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని భట్టి అన్నారు.

**కెసిఆర్ కోసం ప్రత్యేక అసెంబీపెట్టం.. షెడ్యూల్ ప్రకారమే సమావేశాలు...**

'రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందే కెసిఆర్ అని, అలాంటిది కెసిఆర్ రాకుండా,ఆయన తరపున హరీశ్‌రావు, కెటిఆర్ మాట్లాడేందుకు ఎవరని? భట్టి విక్రమార్క ప్రశ్నించారు. ప్రధానప్రతిపక్ష నాయకునిగా కెసిఆర్ బయటకు రావాలన్నారు. తాను ప్రతిపక్ష నాయకునిగా ప్రతి శాసనసభ సమావేశాలకూ హాజరయ్యాయనని గుర్తు చేశారు. కెసిఆర్ కోసం ప్రత్యేకంగా సమావేశాలను పెట్టబోమని, ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారమే సమావేశాలు జరుగుతాయని, ఆ సమావేశాలకు కెసిఆర్ రావాలని సూచించారు.

ఎవరి స్థాయి ఏమిటనేది ఇప్పటికే ప్రజలు నిర్ణయించారని, అయినా స్థాయి అనేది పుట్టుకను బట్టి రాదని, ప్రజాజీవితంలో పోషించే పాత్రను బట్టి వస్తుందన్నారు.

## హడలెత్తిస్తున్న 'ఎల్‌నినో'

(3వ పేజీ తరువాయి)

తగ్గిపోవడం, మరికొన్ని ప్రాంతాలలో అధికంగా వర్షాలు కురవడం వంటి పరిస్థితులు కనిపిస్తాయి. ఈ కారణంగా కొన్ని దేశాలు తీవ్రమైన కరువును ఎదుర్కొంటే, మరికొన్ని ప్రాంతాలు వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి ప్రకృతి విపత్తులను ఎదుర్కొంటాయి. వర్షపాతం సమయానికి లేకపోవడం వల్ల సాగు కాలం దెబ్బతింటుంది. ముఖ్యంగా భారతదేశం వంటి రుతుపవనాలపై ఆధారపడే దేశాలలో ఈ ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఎల్‌నినో కారణంగా ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు కూడా పెరుగుతాయి. వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవడంతో వేడి గాలుల తీవ్రత పెరుగుతుంది. ఈ పరిస్థితులు మానవ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపడమే కాకుండా నీటి ఆవిరి కావడాన్ని కూడా వేగవంతం చేస్తాయి. ఫలితంగా చెరువులు, సరస్సులు, జలాశయాలలో నీటి నిల్వలు తగ్గిపోతాయి. అధిక ఉష్ణోగ్రతల కారణంగా విద్యుత్ వినియోగం పెరగడం, శీతలీకరణ అవసరాలు అధికమవడం వంటి పరిణామాలు కూడా చోటుచేసుకుంటాయి. వ్యవసాయ రంగం ఎల్‌నినో ప్రభావానికి అత్యంత సున్నితమైన రంగంగా భావించబడుతుంది. వర్షపాతం తగ్గడం వల్ల వరి, గోధుమలు, మొక్కజొన్న, పత్తి, చెరకు, పప్పుధాన్యాలు వంటి పంటల దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుంది. విత్తనాల నాటకం ఆలస్యం కావడం, నేలలో తేమ తగ్గిపోవడం, సాగునీటి అవసరం పెరగడం వంటి సమస్యలు రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడతాయి. కొన్ని ప్రాంతాలలో పంటలు పూర్తిగా ఎండిపోవడం వల్ల రైతులకు ఆర్థిక నష్టాలు సంభవిస్తాయి. మరోవైపు, అధిక వర్షాలు కురిసే ప్రాంతాలలో పంటలు నీట మునిగి నష్టపోయే పరిస్థితులు కూడా ఏర్పడవచ్చు. నీటి వనరులపై కూడా ఎల్‌నినో గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. వర్షపాతం తగ్గడం వల్ల ఆనకట్టలు, జలాశయాలు, చెరువులు, నదులలో నీటి నిల్వలు క్రమంగా తగ్గిపోతాయి. భూగర్భ జలాలు పునరుద్ధరించబడే అవకాశం తగ్గిపోవడంతో బావులు, బోర్లు ఎండిపోయే ప్రమాదం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాలలో కూడా తాగునీటి కొరత ఏర్పడుతుంది. సాగునీటి లభ్యత తగ్గిపోవడం వల్ల వ్యవసాయం మరింత సంక్షోభంలో పడుతుంది. ఎల్‌నినో పరిస్థితుల వల్ల అడవుల్లో అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశాలు కూడా పెరుగుతాయి. పొడి వాతావరణం, అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ తేమ కారణంగా చిన్న మంటలు కూడా వేగంగా విస్తరించి పెద్ద అడవి మంటలుగా మారుతాయి. ఈ మంటల వల్ల అడవుల నాశనం, వన్యప్రాణుల మరణాలు, జీవవైవిధ్యానికి నష్టం, వాతావరణంలో కార్బన్ డైఆక్సైడ్ పరిమాణం పెరగడం వంటి తీవ్రమైన పరిణామాలు సంభవిస్తాయి. సముద్ర జలాల ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల పగడపు దిబ్బలు తీవ్రంగా దెబ్బతింటాయి. అధిక ఉష్ణోగ్రతల కారణంగా పగడాలు తెల్లబడే పరిస్థితిని 'కోరల్ బ్లీచింగ్' అని అంటారు. ఈ పరిస్థితి ఎక్కువకాలం కొనసాగితే పగడాలు మరణిస్తాయి. పగడపు దిబ్బలు వేలాది సముద్ర జీవులకు నివాసంగా ఉండటంతో వాటి నష్టం మొత్తం సముద్ర జీవవైవిధ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఎల్‌నినో మానవ ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతుంది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బలు, అలసట వంటి ఆరోగ్య సమస్యలు పెరుగుతాయి. అడవి మంటల వల్ల ఏర్పడే పొగ శ్వాసకోశ వ్యాధులకు కారణమవుతుంది. కొన్ని ప్రాంతాలలో అధిక వర్షాల కారణంగా నిల్వ నీరు పెరిగి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు విస్తరించే అవకాశం ఉంటుంది. వరదల తర్వాత పరిశుభ్రత సమస్యలు తలెత్తి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం కూడా ఉంటుంది. ఆర్థిక రంగంపై ఎల్‌నినో ప్రభావం చాలా విస్తృతంగా ఉంటుంది. వ్యవసాయ ఉత్పత్తి తగ్గిపోవడం వల్ల ఆహార పదార్థాల ధరలు పెరుగుతాయి. రైతుల ఆదాయం తగ్గుతుంది. చేపల ఉత్పత్తి తగ్గడం వల్ల మత్స్య పరిశ్రమ నష్టపోతుంది. వరదలు, కరువు వంటి ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ కోసం ప్రభుత్వాలు భారీ మొత్తంలో నిధులు ఖర్చు చేయాల్సి వస్తుంది. మౌలిక సదుపాయాలు దెబ్బతినడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలు కూడా ప్రభావితమవుతాయి. విద్యుత్ రంగంలో కూడా సమస్యలు తలెత్తుతాయి. జలాశయాలలో నీటి నిల్వలు తగ్గిపోవడం వల్ల జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గుతుంది. అదే సమయంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా విద్యుత్ వినియోగం పెరుగుతుంది. దీనివల్ల విద్యుత్ కొరత, విద్యుత్ కోతలు, ఉత్పత్తి వ్యయాలు పెరగడం వంటి పరిస్థితులు ఏర్పడవచ్చు. జీవవైవిధ్య పరిరక్షణకు కూడా ఎల్‌నినో సవాలుగా మారుతుంది. వాతావరణ మార్పుల కారణంగా అనేక జంతువులు, పక్షులు తమ నివాస ప్రాంతాలను మార్చుకోవాల్సి వస్తుంది. కొన్ని జాతుల సంతానోత్పత్తి తగ్గిపోతుంది. ఆహార లభ్యతలో మార్పులు సంభవిస్తాయి. ఇప్పటికే అంతరించిపోతున్న జాతులకు మరింత ప్రమాదం ఏర్పడుతుంది. భారతదేశంపై ఎల్‌నినో ప్రభావం ప్రధానంగా నైరుతి రుతుపవనాలపై కనిపిస్తుంది. సాధారణంగా ఎల్‌నినో సంవత్సరాలలో రుతుపవనాల బలం తగ్గే అవకాశం ఉంటుంది. ఫలితంగా దేశంలోని అనేక ప్రాంతాలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుంది. దీనివల్ల వ్యవసాయ ఉత్పత్తి తగ్గడం, జలాశయాలలో నీటి నిల్వలు క్షీణించడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా వర్షాధార వ్యవసాయంపై ఆధారపడే రైతులు తీవ్రంగా నష్టపోతారు. పంటల ఉత్పత్తి తగ్గడంతో ఆహార ధాన్యాల ధరలు పెరిగి ద్రవ్యోల్బణంపై కూడా ప్రభావం పడుతుంది. వేడి తరంగాల తీవ్రత పెరగడం వల్ల ప్రజారోగ్య సమస్యలు కూడా అధికమవుతాయి. అయితే ఎల్‌నినో అన్ని ప్రాంతాలకు పూర్తిగా ప్రతికూల ప్రభావాలనే కలిగించదు. కొన్ని ప్రాంతాలలో సాధారణంగా తక్కువగా ఉండే వర్షపాతం కొంత పెరగవచ్చు. ఉత్తర అమెరికాలోని కొన్ని ప్రాంతాలలో శీతాకాలం కొంత మృదువుగా ఉండే అవకాశం ఉంటుంది.

# భారీ స్కోర్ దిశగా భారత్-'ఎ'

### సాయి, పడిక్కల్ హాఫ్ సెంచరీ



రెండో అనధికారిక టెస్టులో భారత్-'ఎ' బ్యాటర్లు దంచేస్తున్నారు. గాలె స్టేడియంలో ఓపెనర్ సాయి సుదర్శన్ (87 నాటౌట్), దేవ్దత్ పడిక్కల్(74 నాటౌట్) అర్ధ శతకాలతో కదం తొక్కారు. శ్రీలంక ఏ బౌలర్లను ఉతికేసిన ఈ ద్వయం శతక భాగస్వామ్యం నెలకొల్పగా ఇండియా ఏ భారీ స్కోర్ దిశగా సాగుతోంది. సెంచరీకి చేరువైన వీరిద్దరూ.. చేతిలో మరో తొమ్మిది వికెట్లు ఉండడంతో ఆతిథ్య జట్టు స్కోర్ను దాటేసి ఆధిక్యంలోకి దూసుకెళ్లడం ఖాయం. శ్రీలంక పర్యటనలో భారత ఏ జట్టు ధీటుగా ఆడుతోంది. తొలి అనధికారిక టెస్టు డ్రాగా ముగియడంతో రెండో మ్యాచ్లో విజయమే లక్ష్యంగా ఇండియాఏ బ్యాటర్లు చెలరేగిపోతున్నారు. లంక ఏ బౌలర్లను బెంబేలెత్తిస్తూ ఓపెనర్ సాయి సుదర్శన్(87 నాటౌట్), దేవ్దత్ పడిక్కల్ (74 నాటౌట్) అర్ధ శతకాలతో రెచ్చిపోయారు. ఓపెనర్ అమన్ మొఖాడే(38) విఫలమైనా.. ఆతిథ్య జట్టుకు ఊపిరి సలపనివ్వని ఈ జోడీ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పింది. ఫలితంగా.. 50 ఓవర్లకు వికెట్ నష్టానికి 194 కొట్టిన భారత్ ఇంకా 172 పరుగులు వెనుకబడింది.

**బ్రార్, జైన్ విజృంభణ..** టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత ఏ జట్టు తొలి ఇన్నింగ్స్లో శ్రీలంకను గొప్పగా కట్టడి చేసింది. కెప్టెన్ సహన్ అరాచ్చిగా(127) శతకం బాదినా.. మిగతా బ్యాటర్లు తేలిపోయారు. గుర్నూర్ బ్రార్, సరాన్ష్ జైన్ నాలుగేసి వికెట్లు తీయగా.. లంక నాలుగొందలలోపే పరిమితమైంది. బ్రార్, జైన్ ధాటికి ఆతిథ్య లంక 366 పరుగులకే ఆలౌటైంది. భారత బౌలర్లలో యశ్ ఠాకూర్ రెండు వికెట్లతో రాణించాడు.

# క్రొయేషియాపై పోర్చుగల్ థ్రిల్లింగ్ విక్టరీ



వరల్డ్ కప్లో పోర్చుగల్ స్టన్నింగ్ విక్టరీ నమోదు చేసింది. రౌండ్32 మ్యాచ్లో క్రొయేషియాపై 2-1 గోల్స్ తేడాతో గెలుపొందింది. ఓ దశలో ఓటమి అంచున ఉన్న పోర్చుగల్ ఆ తర్వాత చివరి నిమిషాల్లో అనూహ్యంగా తేరుకున్నది. పోర్చుగల్ జట్టు తరఫున క్రిస్టియానో రొనాల్డో, ఆ తర్వాత గొంకలో రామోస్ గోల్స్ కొట్టడంతో థ్రిల్లింగ్ రీతిలో ఆ జట్టు విజయం సాధించింది. ఆట 94వ నిమిషంలో రామోస్ చేసిన గోల్తో పోర్చుగల్ ఊపిరిపోసుకున్నది. వాస్తవానికి తొలి అర్థభాగంలో ఇరు జట్లు తీవ్రంగా పోటీ పడ్డాయి. అయితే సెకండ్ హాఫ్లో క్రొయేషియా అద్భుతమైన గోల్ కొట్టింది. ఆట 53వ నిమిషంలో ఇవాన్ పెరిసిక్ ఆ జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు.

### వరుసగా నాలుగోసారి 16వ రౌండ్కు స్విట్జర్లాండ్

ఫిఫా వరల్డ్ కప్లో నాకౌట్ దశలో స్విట్జర్లాండ్ దుమ్మురేపింది. ఉత్కంఠ రేపిన 32వ రౌండ్లో సాంకేతికంగా బలమైన అల్జీరియాను చిత్తుగా ఓడించింది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా 2-0తో గెలుపొందిన స్విస్ టీమ్ 16వ రౌండ్కు దూసుకెళ్లింది. ఫిఫా వరల్డ్ కప్లో నాలుగోసారి స్విట్జర్లాండ్ ఈ రౌండ్లో ప్రవేశించింది. స్విట్జర్లాండ్ జట్టు 16వ రౌండ్లో అడుగుపెట్టింది. శుక్రవారం జరిగిన 32వ రౌండ్లో అల్జీరియాపై సంపూర్ణ ఆధిపత్యం చెలాయించిన స్విస్ టీమ్ 2-0తో ముందంజ వేసింది. మెగా టోర్నీలో గొప్పగా రాణిస్తున్న అల్జీరియా వ్యూహాల్ని స్విట్జర్లాండ్ సమర్థంగా తిప్పికొట్టింది. ఆట మొదలైన 10వ నిమిషంలోనే జోహన్ మన్జాంబీ గోల్ అందించాడు. అల్జీరియా ఆటగాళ్ల నుంచి బంతిని తప్పించిన జోహన్.. ఎడమవైపు నుంచి బంతిని గోల్ పోస్ట్లోకి పంపాడు. రెండో అర్థ భాగం ఆరంభంలోనే డాన్ దోయే మరో గోల్ కొట్టగా స్విట్జర్లాండ్ 2-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఊహించని ఓటమితో అట్లాస్ లయన్స్ ఇంటిదారి పట్టగా.. ఆ జట్టు కెప్టెన్ రియాద్ మహ్రేజ్ అంతర్జాతీయ కెరీర్ సైతం ముగిసినట్లైంది..

### ఆస్ట్రియాపై 3-0 గోల్స్ తేడాతో స్పెయిన్ విక్టరీ

ఫిఫా వరల్డ్ కప్లో 16 ఏళ్ల తర్వాత స్పెయిన్ నాకౌట్ మ్యాచ్ నెగ్గింది. లాస్ ఏంజిల్స్ స్టేడియంలో ఆస్ట్రియాతో జరిగిన రౌండ్32 మ్యాచ్లో 3-0 గోల్స్ తేడాతో స్పెయిన్ విజయాన్ని నమోదు చేసింది. స్పెయిన్ జట్టులో మైకెల్ ఒయర్జబల్, పెడ్రో పోరో గోల్స్ చేశారు. ఒయర్జబల్ రెండు గోల్స్ చేసి స్పెయిన్ జట్టుకు ఈజీ విక్టరీని అందించాడు. ఈ టోర్నమెంట్లో అతని ఖాతాలోకి నాలుగు గోల్స్ వెళ్లాయి. ఇక వచ్చే సోమవారం డల్లాస్లో బలమైన పోర్చుగల్తో స్పెయిన్ తలపడనున్నది. తొలి అర్థభాగం చివరలో ఒయర్జబల్ స్పెయిన్కు ఫస్ట్ గోల్ అందించాడు. 36వ నిమిషంలో అతను గోల్ కొట్టాడు. రెండో అర్థభాగం 66వ నిమిషంలో పెడ్రో పోరో గోల్ చేయడంతో స్పెయిన్ లీడింగ్ కొనసాగించింది. ఏ దశలోనూ ఆస్ట్రియా తన సత్తాను చాటలేకపోయింది. ఆట 89వ నిమిషంలో ఒయర్జబల్ రెండోసారి గోల్ చేసి స్పెయిన్కు భారీ విక్టరీని అందించాడు. 1954 తర్వాత తొలిసారి ఆస్ట్రియా నాకౌట్ మ్యాచ్ ఆడింది. కానీ దారుణ ఓటమితో టోర్నీ నుంచి ఔటైంది.


## సైన్స్



## భూమి చరిత్రను వివరించే పాలియోపాలినాలజీ

భూమి చరిత్రను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే ఒక ముఖ్యమైన శాస్త్రీయ పద్ధతిని పాలియోపాలినాలజీ అంటారు. ఇందులో భూమి పొరల్లో నిల్వైన పుప్పొడి కణాలు, స్పోర్లు వంటి సూక్ష్మ అవశేషాలను పరిశీలిస్తారు. ఈ కణాలు చాలా కాలం పాటు నశించకుండా నిలిచి ఉండగలవు కాబట్టి, అవి గత కాలాల గురించి విశ్వసనీయమైన సమాచారం అందిస్తాయి. ఈ విధానాన్ని కాల అంచనాకు అనుసంధానించడం ఎలా జరుగుతుందో చూడాలి. భూమిపై వివిధ కాలాల్లో వివిధ రకాల మొక్కలు పెరిగాయి. ప్రతి మొక్క జాతికి ఒక నిర్దిష్ట కాల పరిమితి ఉంటుంది. శాస్త్రవేత్తలు ఇప్పటికే కొన్ని మొక్కల జాతులు ఎప్పుడు ఉద్భవించాయి? ఎప్పుడు అంతరించిపోయాయి? అనే సమాచారాన్ని సేకరించారు. కాబట్టి, ఒక భూమి పొరలో కనిపించే పుప్పొడి కణాలను గుర్తించి, అవి ఏ మొక్కలకు చెందినవో తెలుసుకుంటే, ఆ పొర ఏ కాలానికి చెందినదో అంచనా వేయవచ్చు. ఇది ప్రధానంగా సాపేక్ష కాల నిర్ణయ విధానం. అంటే ఖచ్చితమైన సంవత్సరాలను చెప్పకపోయినా, ఏ పొర ముందుగా ఏర్పడింది? ఏది తరువాత ఏర్పడింది? అనే క్రమాన్ని నిర్ణయించవచ్చు. ముఖ్యంగా, ఒక నిర్దిష్ట కాలానికి మాత్రమే చెందిన మొక్కల పుప్పొడి కనిపిస్తే, ఆ పొర కూడా దాదాపు అదే కాలానికి చెందినదని భావిస్తారు. అయితే, ఈ పద్ధతిలో కొన్ని పరిమితులు కూడా ఉన్నాయి. పుప్పొడి గాలివల్ల దూర ప్రాంతాలకు చేరవచ్చు కాబట్టి, అది అక్కడి స్థానిక వృక్షజాలాన్ని తప్పుగా సూచించే అవకాశం ఉంటుంది. అందుకే, పాలియోపాలినాలజీని ఇతర శాస్త్రీయ పద్ధతులతో కలిపి ఉపయోగిస్తారు. ఏదిఏమైనా పాలియోపాలినాలజీ భూమి పొరల వయస్సును, గత వాతావరణ పరిస్థితులను, జీవ పరిణామ క్రమాన్ని అర్థం చేసుకోవడానికి ఒక కీలక సాధనంగా పనిచేస్తుంది. .

## గడియారం అవసరమా?



సమయాన్ని కొలవడానికి గడియారాలపై ఆధారపడుతున్నాం. అయితే, సమయం కోసం తప్పనిసరిగా గడియారం అవసరమా? అనే ప్రశ్నపై ఇప్పుడు జోరుగా చర్చ సాగుతున్నది. ప్రకృతిలోని కణాలు, శక్తివ్యవస్థలు ఎలా మారుతున్నాయో పరిశీలించడం ద్వారా సమయాన్ని నేరుగా అర్థం చేసుకోవచ్చా? అనే ఆలోచనే ఈ చర్చకు మూలం. ఈ పరిశోధనలో ముఖ్యంగా క్వాంటం ఫిజిక్స్ అనే శాస్త్ర శాఖ కీలక పాత్ర పోషించింది. క్వాంటం స్థాయిలో ఎలక్ట్రాన్లు, అణువులు, శక్తి తరంగాలు నిరంతరం మారుతూ ఉంటాయి. ఈ మార్పులు చాలా వేగంగా జరుగుతాయి. వాటిని ఖచ్చితంగా గమనించడానికి అత్యంత సున్నితమైన లేజర్ పరికరాలు ఉపయోగించాలి. కాగా, పరిశోధకులు ఒక క్వాంటం వ్యవస్థను ఒక నిర్దిష్ట ప్రారంభ స్థితిలో ఉంచి, ఆ వ్యవస్థలో తరువాత జరిగే మార్పులను పరిశీలించారు. కణాల శక్తి స్థితులు ఎలా మారుతున్నాయి? తరంగ లక్షణాలు ఎలా పరిణమిస్తున్నాయి అనే విషయాలను అత్యంత ఖచ్చితంగా కొలిచారు. ఈమార్పుల వేగాన్ని ఆధారంగా తీసుకుని ఎంత సమయం గడిచిందో అంచనా వేయగలమని వారు చూపించారు. అంటే ఇక్కడ గడియారం అవసరం లేదు. కణాల సహజ ప్రవర్తనే సమయ సూచికగా ఉపయోగించవచ్చు. ఇది ఒకవిధంగా సూర్యుడి కదలికను చూసి సమయం అంచనా వేయడాన్ని పోలి ఉంటుంది, కానీ ఇక్కడ పరిశీలించేది సూర్యుడు కాదు, సూక్ష్మ స్థాయిలో ఉన్న అణువులు మరియు కణాల ప్రవర్తన. ఈపద్ధతితో శాస్త్రవేత్తలు అతి చిన్న సమయ విభాగాలను కూడా గుర్తించగలిగారు. వారు సుమారు ఒక సెకను యొక్క ట్రిలియన్ వంతు స్థాయిలో సమయ మార్పులను గుర్తించే సామర్థ్యాన్ని ప్రదర్శించారు. ఇలాంటి సూక్ష్మ సమయాల్లోనే అణువుల మధ్య రసాయన చర్యలు ప్రారంభమవుతాయి, ఎలక్ట్రాన్లు కదులుతాయి. కాంతి పదార్థంతో పరస్పర చర్యలు చోటు చేసుకుంటాయి. ఈ స్థాయి పరిశీలనతో రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, పదార్థ శాస్త్రంలో కొత్త ప్రతిపాదనలకు ఆస్కారం ఏర్పడుతుంది. ఈ పరిశోధనకు భవిష్యత్తులో అనేక ప్రయోజనాలు ఉండవచ్చు.

## ధూళి మధ్య భూమి ప్రయాణం..



మనిషి ఆకాశాన్ని చూసి ఆశ్చర్యపడటం కొత్త విషయం కాదు. వేల సంవత్సరాలుగా అదే పని జరుగుతోంది. రాత్రి ఆకాశంలో మెరుస్తున్న నక్షత్రాలు, నెమ్మదిగా కదులుతున్న గ్రహాలు, ఒక్కసారిగా దూసుకెళ్లే కాంతి రేఖలలాంటి ఉల్కలు.. ఇలా అన్నింటినీ నిశితంగా చూస్తున్నాడు. గమనిస్తున్నాడు. ఇది ఎలా జరుగుతోంది? అని ప్రశ్నిస్తూనే ఉన్నాడు. ఖగోళ శాస్త్రం కూడా ఆ ప్రశ్నల నుంచే పుట్టింది. అలాంటి ఆసక్తికరమైన సంఘటనల్లో ఒకటి గామా నోర్మిడ మీటియర్ షవర్. ఈనెల 14, 15 తేదీల్లో కనిపించిన ఓ అద్భుతం. భూమి అంతరిక్షంలో ప్రయాణిస్తూ ఒక ప్రత్యేకమైన ధూళి ప్రవాహం గుండా వెళుతుంది. ఈ ధూళి సాధారణ ధూళి కాదు. ఇది ఒకప్పుడు సూర్యుడి చుట్టూ తిరిగిన పాత ధూమకేతువులు వదిలిన సూక్ష్మ కణాల సమాహారం. ధూమకేతువులు సూర్యుని దగ్గరకు వచ్చినప్పుడు వాటిలోని మంచు కరిగిపోతుంది, గ్యాస్లు బయటకు వస్తాయి, అలాగే చిన్న రాళ్లు, ధూళి కణాలు అంతరిక్షంలోకి విడిపోతాయి. కాలక్రమంలో అవి ఒక పొడవైన ధూళి ప్రవాహంగా మారిపోతాయి. భూమి తన కక్ష్యలో ప్రయాణిస్తూ కొన్నిసార్లు ఈ ధూళి ప్రవాహం గుండా వెళుతుంది. అప్పుడు ఆ కణాలు భూమి వాతావరణంలోకి భారీ వేగంతో దూసుకువస్తాయి. గాలి అణువులతో ఘర్షణ ఏర్పడటంతో అవి క్షణాల్లో మండిపోతాయి. ఆ మండే కాంతి రేఖ మనకు ఆకాశంలో ఒక్కసారిగా మెరుస్తూ కనిపిస్తుంది. అదే మనం సాధారణంగా షూటింగ్ స్టార్ లేదా ఉల్క అని పిలుస్తాం. ఈ విధంగా ఒకేసారి అనేక ఉల్కలు కనిపించే సంఘటననే మీటియర్ షవర్ అంటారు. ఈ ప్రత్యేక సంఘటనకు కారణమైన ధూళి ప్రవాహం ఆకాశంలో 'నోర్మా' అనే నక్షత్రరాశి దిశలో ఉండటం వల్ల దీనిని గామా నోర్మిడ్స్ అని పిలుస్తారు. ఈ ఉల్కలు సాధారణంగా చాలా చిన్నవే. మనకు ఆకాశంలో పెద్ద అగ్ని బంతిలా కనిపించినా వాస్తవానికి అవి చాలాసార్లు ఇసుక గింజంత పరిమాణంలో ఉంటాయి. కానీ వాటి వేగం అత్యంత ఎక్కువగా ఉంటుంది.

# రహీంఖాన్ పేట స్టేజీ వద్ద అన్నిబస్సులు ఆపాలని సిపిఐ ధర్నా



**ప్రజాపక్షం/ఆత్మకూర్(ఎం) :** మండలంలోని రహీంఖాన్ పేట స్టేజీ వద్ద అన్ని డిపోలో చెందిన బస్సులను ఆపాలని డిమాండ్ చేస్తూ సిపిఐ మండలం సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్రెడ్డి మాట్లాడుతూ పది గ్రామాలకు కూడలిగా ఉన్న రహీంఖాన్ పేట వద్ద బస్సులు ఆగకపోవడం వల్ల ప్రజలు తీవ్రఇబ్బందికి గురవుతున్నారన్నారు, రహీంఖాన్ పేట స్టేజీని ఎస్సార్లో నమోదు చేసి అన్ని బస్సులు ఆపాలని డిమాండ్ చేశారు. పలు మార్లు డిపో మేనేజర్, మంత్రులు, ఎమ్మెల్యేలకు విన్నవించుకున్న స్పందన లేదన్నారు. రహీంఖాన్పేట స్టేజి వద్ద స్టేజి అన్ని రకాల సర్వీసులను ఆపాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ లక్ష్మి నారాయణ పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.కార్యక్రమంలో నాయకులు ఉప్పల ముత్యాలు, చేనేత సంఘం ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మి నరసయ్య, సిపిఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్, సహాయ కార్యదర్శి ఎండి నయీమ్, నాయకులు కూరేళ్ల మచ్చగిరి పాల్గొనగా కార్యక్రమానికి మద్దతుగా సర్పంచ్లు సుధగాని కళావతి లింగయ్య, గడ్డం ముత్తమ్మ, సంగపాక శ్రీవాణి మహేష్, నారాముల రామలింగయ్య, ఎరుకల యతీశ్వర్, నాయకులు కలువల నరసయ్య, మారుపాక అంజయ్య, జక్క దయాకర్ రెడ్డి, కూరెళ్ల ఉపసర్పంచ్ అనుమతుల రమేష్, పుల్లాయగూడెం ఉపసర్పంచ్ తండా రమేష్, తాళ్లపల్లి నర్సయ్య, సోమన బోయిన నరసింహ, మారుపాక యాదయ్య, బత్తిని లింగయ్య, మజ్జిగ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# కొత్త లేబర్ కోడ్లు రద్దు చేయాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు



**ప్రజాపక్షం/మంచిర్యాల :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు నూతన లేబర్ కోడ్లతో కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, వెంటనే వాటిని రద్దు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు డిమాండ్ చేశారు. మంచిర్యాలలోని సిపిఐ కార్యాలయంలో శుక్రవారం ఆగస్టు 2న నిర్వహించబోయే ఎఐటియుసి జిల్లా నాల్గవ మహాసభల పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేకల దాసు మాట్లాడుతూ ఆగస్టు 2న జరిగే ఎఐటియుసి జిల్లా మహాసభల్లో జిల్లాలోని కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎండి అక్బర్ అలీ, ఖలిందర్ అలీ ఖాన్, మిట్టపల్లి పౌలు, దాగం మల్లేష్, లింగం రవి, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి మధు, హమాలీ యూనియన్ అధ్యక్షులు పానుగంటి సత్యనారాయణ, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పట్టింపేదీ?

### సిపిఐ నాగర్కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి.ఫయాజ్



**ప్రజాపక్షం/నాగర్కర్నూల్ :** రాష్ట్రంలో ప్రజలు, రైతులు తీవ్రమైన సమస్యలతో సతమతమవుతుంటే వాటిని పరిష్కరించాల్సింది పోయి రాష్ట్ర మంత్రులు, ప్రతిపక్ష నాయకులు సవాళ్లు, ప్రతి సవాళ్లతో అలజడి వాతావరణాన్ని సృష్టిస్తున్నాయని సిపిఐ నాగర్కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ విమర్శించారు. మంత్రులు, ప్రతిపక్షాలకు సమస్యలపై పట్టింపులేకుండా పోయిందన్నారు. శుక్రవారం కొల్లాపూర్ పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫయాజ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడానికి, సమస్యల నుండి సమాజ దృష్టి మళ్లించడానికి డ్రామాలాడతారని ఆయన విమర్శించారు. ఒకపక్క బాధ్యత కలిగిన రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, మరొపక్క అంతే బాధ్యత కలిగిన ప్రధాన ప్రతిపక్ష పార్టీ వీధి పోరాటాలకు దిగి రాజకీయ విలువలను దిగజారుస్తున్నారు. రాష్ట్రంలో ప్రజలు, విద్యార్థులు, రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలపై దృష్టి పెట్టకుండా రోజు ప్రచారంలో ఉండాలని, ఇటువంటి వైఖరి ద్వారా అనవసరమైన హంగామాన్ని సృష్టించడానికి స్వస్తి , మంత్రులు ప్రజాపాలనపై దృష్టి పెట్టి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం వైపు ముందుకెళ్లాలని, ప్రతిపక్ష పార్టీ కూడా ఆరోగ్యకరమైన రాజకీయ విమర్శల ద్వారా ప్రభుత్వం విఫలమైన అంశాలను ఎత్తిచూపేలా నడుచుకుంటే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి తుమ్మల శివుడు, సిపిఐ కొల్లాపూర్ పట్టణ కార్యదర్శి ఎం.డి.యూసుఫ్, మండల కార్యవర్గ సభ్యులు జంగం శివుడు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్లు కార్మికులకు శాపం

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్లుగా మార్చిందని, ఇది కార్మికులకు శాపంగా మారిందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ ముక్దూం భవన్లో జరిగిన ఎఐటియుసి నల్లగొండ నియోజకవర్గ 5వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. దశాబ్దాలు పోరాడి సాధించుకున్న హక్కులు మోదీ సర్కార్ హయాంలో కనుమరుగవుతున్నాయన్నారు. పాలకులు కార్పొరేట్ శక్తులకు తొత్తులుగా మారారన్నారు. మోదీకి కార్పొరేట్ల రక్షణ తప్పా, కార్మిక సంక్షేమం పట్టదని విమర్శించారు. కార్మిక హక్కుల రక్షణకు ఎఐటియుసి నిరంతరం పోరాడుతుందని దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి, గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు పబ్బు వీరస్వామి మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ విధానం రద్దు చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం కార్మి కులకు ఇచ్చిన ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలన్నారు. 19న గుర్రంపోడ్లో ఎఐటియుసి జిల్లా మహాసభ జరుగుతుందని, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సభకు నియోజకవర్గ అధ్యక్షుడు కెవిఎస్ రెడ్డి అధ్యక్షత వహించగా. నియోజకవర్గ కార్యదర్శి విశ్వనాథుల లెనిన్, నాయకులు పెద్ది నాగరాజు, గుండె రవి, ఎం.నందం, బాసాని వెంకటయ్య, యూసుఫ్, జి.నరేందర్, పి.వెంకన్న, సీతారాములు, పద్మ, ఎల్లమ్మ, ఉశమ్మ, సబిత, వీరయ్య, విజేందర్ రెడ్డి,అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్న పాలకులు

### వామపక్ష విద్యార్థి సంఘాల ఆరోపణ

### 10న విద్యాసంస్థల బంద్ను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** విద్యార్థుల సమస్యలను పూర్తిగా విస్మరించి, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విధానాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరిని వెమార్చుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసప్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజకుమార్ డిమాండ్ చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రావినారాయణరెడ్డి భవన్లో ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అధ్యాపకుల ఖాళీలు భారీగా పేరుకుపోయినా భర్తీ చేయడం లేదన్నారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్కాలర్షిప్లు, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, ప్రైవేటీకరణకు ప్రోత్సాహం ఇస్తూ పేద విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చుతుందన్నారు. ఎన్నికల సమయంలో విద్యారంగ అభివృద్ధిపై అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించిందని, విద్యార్థుల సమస్యలపై స్పందించకుండా కాలయాపన చేయడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, సంక్షేమ హాస్టళ్లలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లు, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి ప్రైవేటీకరణ విధానాలను నిలిపివేయాలని ఈనెల 10న జరుగనున్న విద్యాసంస్థల బంద్ను పాఠశాల, కళాశాల విద్యార్థులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ఉల్లేరావు బన్నీ, స్మరణ్, రాజుల శివ, దొగ్గల చరణ్ తదితరులు పాల్గొన్నారు.

**నల్లగొండ టౌన్ :** విద్యా రంగంలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్ను విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి పవన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను నాలుగు వేలకే పరిమితం చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే చర్య అన్నారు. విద్యాసంస్థల బంద్కు విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రజాసంఘాలు సహకారం అందించి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో విద్యార్థి నాయకులు సాగర్, మల్ల మహేష్, కిరణ్ మహేష్, చరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

**నర్సంపేట :** విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షులు దిడ్డి పార్థసారథి, పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు గుర్రం అజయ్, ఎఐఎఫ్డిఎస్ జిల్లా అధ్యక్షులు జన్ను రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పైసా గణేష్, పిడిఎస్యు జిల్లా జిల్లా అధ్యక్షులు రాజు డిమాండ్ చేశారు. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నర్సంపేటలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఎఐఎఫ్డిఎస్ డివిజన్ కార్యదర్శి మార్త నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అద్దె భవనాలలో నడుస్తున్న పాఠశాలలు, హాస్టల్స్, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు సిద్ధు, వంశీ, ప్రశాంత్, కళ్యాణ్, శ్యామ్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.





# కొనసాగుతున్న సవాళ్ల పర్వం



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అప్పులపైన అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ మధ్య సవాళ్ల పర్వం కొనసాగుతోంది. తాజాగా మరోసారి మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ శుక్రవారం చర్చకు సిద్ధమయ్యారు. తాము తోకముడిచేవాళ్లం కాదని, చర్చించేందుకు సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌కు రావాలని సవాల్ విసిరిన మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ శుక్రవారం సాయంత్రం ప్రెస్ క్లబ్‌కు చేరుకున్నారు. అయితే బిఆర్ఎస్ తరపున ప్రెస్‌క్లబ్‌కు ఎవ్వరూ రాకపోవడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇం కోవైపు అప్పుల అంశంపైన మంత్రి జూపల్లి,మాజీ మంత్రి హరీశ్‌రావు పరస్పరం 'లేఖల అస్త్రాల'ను సంధించుకున్నారు. బిఆర్ఎస్ హయాంలో రూ. 8,21, 651 కోట్ల అప్పు చేశారని మంత్రి జూపల్లి కృష్ణారావు బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయుడు తన్నీరు హరీశ్‌రావుకు లేఖ రాయగా,దీనిపైన హరీశ్‌రావు స్పందిస్తూ బిఆర్ఎస్ హయాంలో మొత్తం అప్పులు కలిపి రూ.4.17 లక్షల కోట్లు మాత్రమేనని మంత్రి జూపల్లికి లేఖ ద్వారా సమాధానమిచ్చారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ పరస్పర సవాళ్ల నేపథ్యంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ గన్‌పార్క్ వద్దకు చేరుకోగా, గన్‌పార్క్ వద్దకు తెలంగాణ భవన్ నుంచి బయల్దేరిన బిఆర్ఎస్ మాజీ మం త్రులు తన్నీరు హరీశ్ రావు,శ్రీనివాస్‌గౌడ్, బిఆర్ఎస్ నాయకుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి తెలంగాణ రాష్ట్ర అప్పుల అంశం చర్చనీయాంశంగా మారింది. ఇందుకు ప్రెస్ట్ క్లబ్, గన్‌పార్క్ వేదికగా మారుతోంది.

### అబద్ధమని నిరూపిస్తే పదవులకు రాజీనామా

అంతకుముందు సిఎల్‌పి కార్యాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ అప్పుల విషయంలో తాను తన మాటకు కట్టుబడి ఉన్నానని, ఇందుకు రాజీనామా చేయడానికైనా తాను సిద్ధమేనని, హరీశ్‌రావు, కెటిఆర్ చెప్పింది అబద్ధమైతే, వాళ్లు ఏం చేస్తా రో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయానిన రుజువు చేయపోతే ఎంఎల్‌ఎ పదవులకు రాజీనామా చేస్తారా? లేదా కెసిఆర్ బిఆర్ఎస్‌ను రద్దు చేస్తారా అని సవాల్ విసిరారు. తాము చేసిన అప్పులు రూ.3.17కోట్లు అని, ఒకసారి, రూ. 3.85 కోట్లు అని ఇంకోసారి కెటిఆర్ చెప్పారని, కానీ హరీశ్‌రావు రూ.4.26 కోట్లు అని చెబుతున్నారన్నా రు. అప్పులపైన హరీష్ రావు, కెటిఆర్ అసెంబ్లీలో మాట్లాడేందుకు కట్టుబడి ఉన్నారా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ నాయకులు కార్పొరేషన్ల ద్వారా తీసుకొచ్చిన అప్పులతో తమకు సంబంధం లేదని చెబుతున్నారని, ప్రభుత్వానికి సంబంధం లేకపోతే ప్రభుత్వ ఖజానా నుంచే ఆ అప్పులకు ఎందుకు చెల్లించారని ప్రశ్నించారు. కాళేశ్వరం, పాలమూరు కోసం అప్పులు తీసుకొస్తే వాటిని రైతులతో కట్టిస్తారా..?,మిషన్ భగీరథ పేరుతో తెచ్చిన అప్పులను మంచి నీళ్లు తాగుతున్న ప్రజలతో కట్టిస్తారా..? అని ప్రశ్నించారు.

## చీము నెత్తురు ఉంటే...
# జుపల్లి రాజీనామా చేయాలి

**బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు**



ప్రజాపక్షం/సంగారెడ్డి : సంగారెడ్డి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం సభ్యత్వ నమోదు అవగాహన కా ర్యక్రమంలో బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను మంత్రుల అబద్ధాలను ఎండగట్టారు. హరీష్‌రావు కామెంట్స్ చేస్తు జుపల్లి కృష్ణారావు మళ్లీ ప్రెస్ మీట్ పెట్టిండు , నిన్న వాళ్లు గోల్ కొడుదాం అనుకుంటే సెల్ఫ్ గోల్ అయిపోయింది. అందుకే డ్యామెజ్ కంట్రోల్ మెదలు పెటిర్రు అందులో కూడా పప్పులో కాలు వేసిర్రు దాని సంగతి ఎందో చూదామన్నా రు. మొన్న సవాల్ విసిరి నిన్న తోక ముడిచి నాకు వాట్సాప్ లో ఒక ఉత్తరం పెట్టిండు, పూటకో సవాలు, రో జుకో అడ్రస్ లెక్క ఉంది జుపల్లి సంగతి మొదలే మో తెలంగాణ భవన్ అన్నడు. తర్వాత అమరవీరుల స్థూపం అన్నడు ఇప్పుడేమో సోమాజీగూడ ప్రెస్ క్లబ్ అంటుండు. ముందు నన్ను కెటిఆర్‌ను చర్చకు రమ్మన్నాడు. ఇప్పుడు కెసిఆర్‌ను రావాలంటున్నారు. 2023 డిసెంబర్ నుండి 2025 జు న్ వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ ఆర్‌బిఎం కింద తెచ్చిన అప్పు రూ.1,86,087 కోట్లు అయితే ఆయన నాకు రాసిన ఉత్తరంలో రూ. 1,77,058 కోట్లు అని చెప్తుండు మరి ఆ 10వేల కోట్లు ఎక్కడి కి పోయినాయి. మార్చి 18,2026 నాడు అ సెంబ్లీలో నేను గట్టిగా నిలదీస్తే రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మా ప్రభుత్వం 27 నెలల్లో చేసిన అ ప్పు రూ.3,47,294 కోట్లు అని అసెంబ్లీ సాక్షిగా చెప్పిండు ఇందులో ఏది నిజం అని ప్రశ్నించాడు. 4 నెలల క్రింద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పింది నిజమా? మంత్రి జుపల్లి కృష్ణారావు చె ప్పింది నిజ మా? అంటే ఇప్పుడు రాజీనామా ఎవరు చేయాలని ప్రశ్నించా రు. పాలమూరు బిడ్డవైతే పౌరుషం ఉంటే చీము నెత్తురు ఉంటే వెంట నే రాజీనామ చేయి మిస్టర్ జుపల్లి అని డిమాండ్ చేశారు. కాగ్ రిపో ర్టు కూడా బిఆర్ఎస్ ప్రభుత్వం చేసి న అప్పు రూ. 4.15 లక్షల కోట్లు అని అసెంబ్లీలో చెప్పింది. నేనూ చెప్పింది కాగ్ చెప్పింది ఒక్కటే అబద్దాలు చెబుతే గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు. జుపల్లి, నేను అసెంబ్లీలో మాట్లాడిన వీడియో రేవంత్‌రెడ్డి రెడ్డి మాట్లాడిన వీడియో ఆర్‌బిఐ లెక్కలు మీకు వాట్సఫ్‌లో పంపుతున్నా చదువుకో, చీము నెత్తురు ఉంటే రాజీనామ చేయాలని సవాల్ విసురుతున్నా అని అన్నారు. సంగారెడ్డి జిల్లాకు రావాల్సిన ఆ నిధులు ఇప్పటికి ఎందుకు విడుదల చేయలేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. సింగూరు ప్రాజెక్టుకు మరమ్మతు చేస్తాం అని చెప్పి ఇప్పటికి చర్యలు తీసుకోలేదు. ఎన్నికల మెనిపెస్టోలో ఎస్ సి, ఎస్‌టి, బిసి అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు ఉన్న భూములనే లాక్కుంటోంది. ఒక్క సంగారెడ్డిలోనే 700 ఎకరాలు, రాష్ట్రవ్యాప్తంగా 50 వేల ఎకరాల అసైన్డ్ భూ ములను లాకునే కుట్ర జరుగుతుంది. ఎకరం రూ. 3కోట్లు ఉంటే 40 లక్షలు ఇస్తామని గిరిజనులను మోసం చేస్తున్నారు. మహిలకు నెలకు రూ. 2,500 ,వృద్దులకు రూ,4000 పెన్షన్ఇలా ఏ ఒక్క హామీని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నెరవేర్చలేదు అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు చింతాప్రభాకర్ ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, సునీతా లక్ష్మారెడ్డి ,మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి
# రాష్ట్రాన్ని దివాలా తీయించారు

**టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్**



ప్రజాపక్షం/కరీంనగర్ : పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు.. రూ. 8లక్షల కోట్ల అప్పుల చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించారు. చేసిన అప్పుల గురించి చెబితే కెటి రామారావు, హరీష్ రావులకు ఎందుకు అంతా అక్కసు వెళ్లగక్కుతున్నారని పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. పెళ్లి వేడుకకు హాజరయ్యేందుకు శుక్రవారం కరీంనగర్‌కు వచ్చిన టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు చొప్పదండి ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు మేడిపల్లి సత్యం వి–పార్క్ హోటల్ వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం కాంగ్రెస్ నేతలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ వ్యవస్థతో సొసైటీలు ఏర్పాటు చేసి ముందస్తు ఆలోచన లేకుండా ఇష్టం వచ్చినట్లుగా అప్పులు తీసుకురావడం వల్ల నేడు ప్రజలపై భారంగా మారిందని, 2023 కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నెలకు 60వేల కోట్ల రూపాయలు గత ప్రభుత్వం చేసిన అప్పులకు వాయిదా పద్ధతిలో వడ్డీలు కడుతున్నామన్నారు. వాళ్ళు చేసినా అప్పు ఎనిమిది లక్షల కోట్ల పైగానే ఉన్నాయని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బిఆర్ఎస్‌కు మరొకసారి అధికారం ఇస్తే రాష్ట్రానికి కుదవ బెడతారని ప్రజలు బిఆర్ ఎస్‌ను గద్దె దింపారని అన్నారు. పదేళ్ల కాలంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ప్రభుత్వ ఉద్యోగాలతో ప్రజలకు ఎన్నో ఆశలు చూపించి మోసం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు కన్న కళలను నెరవేరుస్తుందన్నారు. ప్రతి నియోజకవర్గంలో మూడు వేలకు పైగా ఇందిర మైండ్లను నిర్మిస్తుంది ఇప్పటివరకు దాదాపు 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించినట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్ష ఇరవై వేల కోట్ల రూపాయలను గోదావరి పాలు చేశారని ఆరోపించారు. సిరిసిల్లలో నడిచిన ఇసుక మాఫియా, నేరెళ్ల బాధితులను కొట్టిన తీరు తెలుసని, అడ్డుపడిన యువకులను పోలీసులతో కొట్టించిన సంఘటనలు.. బిఆర్ఎస్ చేసిన ప్రతి నిర్వాకం ప్రజల మనసుల్లో ఉందన్నారు. జిల్లా వాసి కేంద్ర మంత్రి బండి సంజయ్ బిఆర్ఎస్ కాంగ్రెస్ ఒకటని అంటున్నారని, పదేళ్ళు కేంద్రంలోని మోడీ సర్కారుకు బిఆర్ఎస్ అన్ని విధాలుగా సహకరించిన విషయం మరిచారని, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలు, పార్లమెంట్ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నికల్లో తలాకు బిల్లు ఆఖరికి రైతు వ్యతిరేక చట్టాలకు కూడా బిఆర్ఎస్ పార్టీ ఎంపిలు బిజెపికి ఓటు వేశారని అన్నారు. లోపాయికార ఒప్పందంతో ఢిల్లీలో పని చేశారని.. ఇక్కడ మాత్రం పైకి శత్రువులుగా నటించారని విమర్శించారు. బిజెపి జాతీయ అధ్యక్షుడి సమావేశం అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. 11 సంవత్సరాలకు పైగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి సామాన్యునికి ఏమి ఒరగ బెట్టిందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలను అమాంతంగా పెంచి సామాన్యుడు వాహనం నడపడానికి భయపడే విధంగా చేశారన్నారు. అదానీలను అంబానీలను, సంపన్నులను పెంచి పోషించడం తప్ప మోడీ ఏం ఘనత సాధించారో ప్రజల కు చెప్పాలన్నారు.ఈ విలేకరుల సమావేశంలో సు డా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్నూరు కాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చ క్రవర్తి, కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాలకు అడవులను సంరక్షించి అందించడం ప్రతీ ఒక్కరి బాధ్యత

**అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**



ప్రజాపక్షం/హైదరాబాద్: భవిష్యత్ తరాలకు అడవులను సంరక్షించి అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రాష్ట్ర అటవీ సంపద పరిరక్షణ, పచ్చదనం విస్తరణ, జీవవైవిధ్య సంరక్షణలో మరింత వేగం పెంచాలని నూతన ప్రధాన అటవీ సంరక్షణాధికారి (పిసిసిఎఫ్) బాధ్యతలు స్వీకరించిన వినయ్ కుమార్‌కు మంత్రి ది శానిర్దేశం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేసి, ప్రజల భాగస్వామ్యంతో వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని సూచించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంత్రి కొండా సురేఖను మ ర్యాదపూర్వకంగా కలిసిన నూతన పిసిసిఎఫ్ వినయ్ కుమార్‌కు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం పెంపు, జీవ వైవిధ్య పరిరక్షణ, సామాజిక అటవీ కార్యక్రమాలు, అటవీ శాఖ చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఇద్దరూ సమగ్రంగా చర్చించారు. పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్ర భుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అధికారులు, సిబ్బంది సమన్వయం తో పనిచేసి ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అటవీ రక్షణలో సాంకేతికత వినియోగం పెంచడంతో పాటు పచ్చదనం విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అటవీ శాఖ పూర్తిస్థాయిలో కట్టుబడి పనిచేస్తుందని పిసిసిఎఫ్ వినయ్ కుమార్ హామీ ఇచ్చారు.

# 2027 డిసెంబర్ నాటికి నూతన హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి సిద్ధం

- నాణ్యమైన రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం
- జులైలోనే 10 హ్యామ్ రోడ్ల ప్యాకేజీకి శ్రీకారం
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: మంత్రి కోమటిరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్:రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నూతన హైకోర్టు భవనం, న్యాయమూర్తుల నివాస స ముదాయం, ఉస్మానియా జనరల్ ఆసుపత్రి ని ర్మాణ పనులను 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంబంధిత అధికారుల ను ఆదేశించారు. రాష్ట్రంలో నాణ్యమైన రహదారుల ని ర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇ స్తోందని,కార్మికుల సంఖ్య పెంచి మూడు షిఫ్టు ల్లో పనులు నిర్వహించాలని సూచించారు. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆర్ అండ్ బి శాఖ ఉన్నతాధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

### ఈ నెల 6న కరీంనగర్ జిల్లాలో హ్యామ్, సిఆర్ఎఫ్ రోడ్ల పనులకు శంకుస్థాపన

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 'అద్దంలాంటి రోడ్లు' నిర్మించాలనే లక్ష్యంతో తొలి దశలో రూ.13 వేల కోట్ల వ్యయంతో 6,092 కిలోమీటర్ల మేర 34 ప్యాకేజీల్లో పనులు చేపడుతున్నామని మంత్రి తెలిపా రు. ఇందులో భాగంగా ఈ జూలై నెలలోనే మరో 10 ప్యాకేజీల పనులు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. ఇప్పటికే ప్రారంభమైన నల్లగొండ మహబూబ్ నగర్ డబుల్ రోడ్డు పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించా రు. వర్షాకాలం ముగిసిన వెంటనే మూడు షిఫ్టు ల్లో, అవసరమైతే రాత్రివేళల్లో కూడా రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయడం చీఫ్ ఇంజినీర్ల బాధ్యత అని పేర్కొన్నారు. జూలై 6న కరీంనగర్ జిల్లాలో హ్యామ్, సిఆర్ఎఫ్ రోడ్ల పనులకు శంకుస్థాపన నిర్వహించనున్నట్లు తెలిపారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను వెంట నే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రి ప్రారంభానికి సిద్ధం గా ఉందని, అల్వాల్, ఎల్‌బినగర్ టిమ్స్, నిమ్స్ విస్తరణ, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో సాంకేతిక పరిజ్ఞానం, పనిపట్ల అంకితభావం ఉన్న ఇంజినీర్లను మాత్ర మే నియమించాలని మంత్రి సూచించారు. ఈ వారం నుంచే తాను ఆకస్మికంగా నిర్మాణ పనులను పరిశీలిస్తానని, నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా బాసర, భద్రాచలం ఆలయ నిర్మాణ పనుల పురోగతి, గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై కూడా మంత్రి సమీక్ష నిర్వహించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుం టూ పనులు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.

ఈ సమావేశంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఇఎన్‌సి జయ భారతి, అన్ని విభాగాల సిఇలు, బి.వి రావు, రాజేశ్వర్‌రెడ్డి, ధర్మారెడ్డి, వసంత్ నాయక్, వనజ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మూగబోయిన అరుణ గానం

**అరుణోదయ నాగన్న మృతి పట్ల -వామపక్ష నేతల నివాళి**

ప్రజాపక్షం/ఖమ్మం : జీవిత కాలం ప్రజా చైతన్యానికి కృషి చేసిన ఓ గానం అమరత్వాన్ని సంతరించుకున్నది. అరుణోదయ నాగన్నగా కీర్తి నొందిన నాగయ్య (68) శుక్రవారం మృతిచెందారు. ఆయన గత కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. పరకాల నాగయ్య ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాజారాం గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించారు. చైతన్యానికి మారుపేరైనా రాజారాం గ్రామంలో తన తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన పాటలు పాడుతూ వ్యవసాయ కూలీగా తన జీవితాన్ని ప్రారంభించాడు. సిపిఐ మార్క్సిస్టు, లెనినిస్ట్ పార్టీలో రాష్ట్ర స్థాయి నాయకునిగా ఉండి రాజారాం గ్రామానికే చెందిన మద్ది వెంకటరెడ్డి సహచర్యంలో ఎర్ర జెండా వైపు ఆకర్షితుడయ్యాడు. శ్రీపాద శ్రీహరి, పెద్దినేని చలపతిరావు, వెంకటేశ్వరరావు, పెద్ద చంద్రన్న తదితరుల నేతృత్వంలో గొప్ప కళాకారునిగా ఎదిగాడు. నాగన్న ఎమర్జెన్సీ తర్వాత మార్క్సిస్టు, లెనినిస్ట్ భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ గ్రామ గ్రామాన సభలు, సమావేశాల్లో పాల్గొన్నారు. అరుణోదయ నాగన్న పాట వినడానికే బహిరంగ సభలకు జనం వచ్చే వారంటే అతిశయోక్తి కాదు. ఎమర్జెన్సీలో హత్య గావించబడిన పోట్ల రామనర్సయ్య పేరుతో వచ్చిన అమరుడు మన రామనర్సయ్య అనే పాటలు నాగన్న పాడుతుంటే విన్న వారి కండ్లు చేమర్చేవి. తన పాటలతో రౌద్రాన్ని రగిలించగలిగిన నాగన్న ఉమ్మడి రాష్ట్రంలో చిరపరిచితులు. కళను అమ్ముకుంటున్న నేటి రోజుల్లో ఎర్రజెండా పాట తప్ప అద్దెకు తన గొంతు ఇవ్వని అరుణోదయం నాగన్న ఆర్థిక పరిస్థితులు చుట్టుముట్టిన కాలువ వెంట ప్రభుత్వ స్థలంలో చిన్న నివాసాన్ని ఏర్పాటు చేసుకుని జీవించారు తప్ప ఎవరి వద్ద చేయి చాచని గొప్ప వ్యక్తిత్వం నాగన్నది. బుర్రకథ కళాకారునిగా మొత్తం తెలంగాణలోనూ గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లోనూ ప్రదర్శనలు ఇచ్చారు. నాగన్న మరణించిన ఆయన గానం చిరస్థాయిగా నిలిచిపోతుంది. నాగన్న కుమారుడు అజయ్ కూడా తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ ప్రజా కళాకారునిగా గుర్తింపు పొందగా నాగన్న సతీమణి సైతం కళాకారిణిగా, నాయకురాలిగా ప్రజా ఉద్యమాల్లో పాల్గొంది.

### పలువురి సంతాపం

అరుణోదయ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన నాగన్న మృతి పట్ల పలువురు సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ఆ పార్టీ నాయకులు నాగన్న మృత దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ప్రజా నాట్య మండలి కళాకారులు, అరుణోదయ కళాకారులు, వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు.



# పన్నుల వసూళ్లే పనితీరుకు కొలమానం కాకూడదు


- ఆదివాసీ, వెనుకబడిన గ్రామాలకు ప్రత్యేక వెయిటేజ్ ఇవ్వాలి
- స్థానిక అవసరాల కోసం అన్‌టైడ్ గ్రాంట్లను కొనసాగించాలి
- 16వ ఆర్థిక సంఘం వర్క్‌షాప్‌లో కేంద్రానికి మంత్రి సీతక్క విజ్ఞప్తి



ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్ర నిధుల కేటాయింపులో పన్నుల వసూళ్లే పనితీరుకు కొలమానం కాకూడదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 16వ ఆర్థిక సంఘం గ్రామీణ స్థానిక సంస్థల సిఫార్సులపై కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌లో మంత్రి సీతక్క తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనలను వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ సిఎస్ దానకిశోర్‌తో పాటు ఇతర రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 16వ ఆర్థిక సంఘం ప్రతిపాదించిన పనితీరు ఆధారిత గ్రాంట్‌లు, ఓన్ సోర్స్ రెవిన్యూ వంటి నిబంధనల్లో ఆదివాసి, గిరిజన, షెడ్యూల్డ్ ప్రాంతాలు, వెనుకబడిన గ్రామ పంచాయతీలకు ప్రత్యేక వెసులుబాటు కల్పించాలని మంత్రి సీతక్క కోరారు. గ్రామ పంచాయతీల పనితీరును కేవలం పన్నుల వసూళ్లతోనే అంచనా వేయకుండా, ప్రజలకు అందిస్తున్న సేవలు, పారిశుద్ధ్యం, పారదర్శకత, డిజిటల్ పాలన, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. జిపిలకు పనితీరు ఆధారిత గ్రాంట్లను తెలంగాణ ప్రభుత్వం స్వాగతిస్తోందని, అయితే ఆదా య సామర్థ్యం తక్కువగా ఉన్న ఆదివాసీ, గిరిజన, మారుమూల ప్రాంతాల గ్రామ పంచాయతీలపై అదనపు పన్నుల భారం మోపే విధంగా నిబంధనలు ఉండకూడదన్నారు. అభివృద్ధిని ప్ర జల ఆర్థిక స్థితితో ముడిపెట్టడం ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో అనేక గ్రామ పంచాయతీల జనాభా చాలా తక్కువగా ఉండటంతో వాటి సొంత ఆదాయ వనరులు కూడా పరిమితంగానే ఉంటాయని తెలిపారు. అలాంటి ప్రాంతాలకు ప్రత్యేక సడలింపులు ఇవ్వాలని, ఆదివాసీ, గిరిజన, షెడ్యూల్డ్ కులాల జనాభా అధికంగా ఉన్న గ్రామ పంచాయతీలు, మండల స్థాయి స్థానిక సంస్థలకు కూడా పనితీరు గ్రాంట్ల అర్హతలో వెసులుబాటు కల్పించాలని కోరారు.

### కోర్టు కేసుల వల్ల నిధులు ఆపడం అన్యాయం

న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల కారణంగా ఎన్నికలు జరగని 62 గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి నిధులు నిలిపివేయడం వల్ల అక్కడి ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాల వల్ల ఎన్నికలు ఆలస్యమైన ప్రత్యేక పరిస్థితుల్లో నిధులు కొనసాగించేలా నిబంధనలు సవరించాలని విజ్ఞప్తి చేశారు. అన్‌టైడ్ బేసిక్ గ్రాంట్ల ను కొనసాగించాలి ప్రతి గ్రామ అవసరం భిన్నంగా ఉంటుందని, అందువల్ల స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామ సభలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునేలా అన్‌టైడ్ బేసిక్ గ్రాంట్లను తగిన స్థాయిలో కొనసాగించాలని మంత్రి సీత క్క అన్నారు. డిజిటల్ గవర్నెన్స్, ఈగ్రామ్ స్వరా జ్, పిఎఫ్ఎంఎస్ వంటి సాంకేతిక వ్యవస్థలను తెలంగాణ ప్రభుత్వం స్వాగతిస్తోందన్నారు. వా టి అమలుకు అవసరమైన శిక్షణ, సిబ్బంది, ఇంటర్నెట్ కనెక్టివిటీ, సాంకేతిక మౌలిక వసతులను మారుమూల గ్రామాల్లో కేంద్రం బలోపే తం చేయాలని కోరారు. షెడ్యూల్డ్ ప్రాంతాలు, వెనుకబడిన జిల్లాలు, భౌగోళికంగా క్లిష్టమైన ప్రాంతాల్లో ప్రజా సేవలను అందచేసేందుకు అధిక వ్యయం అవుతున్నందున నిధుల కేటాయింపులో అలాంటి ప్రాంతాలకు ప్రత్యేక వెయిటేజ్ ఇవ్వాలన్నారు. గ్రామీణ స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేయాలంటే రాష్ట్రాలకు తగిన ఆర్థిక సామర్థ్యం ఉండాలన్నారు. సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను బలోపేతం చేస్తూనే పంచాయతీలను మరింత శక్తివంతం చేసే విధంగా 16వ ఆర్థిక సంఘం సిఫార్సులు ఉండాలని మంత్రి కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.



సోమాజిగూడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రభుత్వ సలహాదారు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావును కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కె.జానారెడ్డి శుక్రవారం పరామర్శించారు.

# వైద్య విద్యార్థులకు స్టైఫండ్ చెల్లించకపోవడం తీవ్ర అన్యాయం

**సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ**

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో హౌస్ సర్జన్‌గా పనిచేస్తున్న వైద్య విద్యార్థులకు స్టైఫండ్ చెల్లించకపోవడం తీవ్ర అన్యాయమని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్ కె. నారాయణ అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో స్టైఫండ్ అందుతుండగా, ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నిరాకరించడం వివక్షకు నిదర్శనమని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హౌస్ సర్జన్లు ఆసుపత్రుల్లో రోగులకు ప్రత్యక్షంగా వైద్య సేవలు అందిస్తూ, ఆరోగ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలను గుర్తించి, ప్రభుత్వ మెడికల్ కళాశాల తరహాలోనే ప్రైవేటు మెడికల్ కళాశాలల హౌస్ సర్జన్లకు కూడా సమాన స్థాయిలో స్టైఫండ్ చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైతే ఈ విషయంలో ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసి, అన్ని ప్రైవేటు మెడికల్ కళాశాలలు తప్పనిసరిగా స్టైఫండ్ చెల్లించేలా పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, వైద్య విద్యార్థుల శ్రమకు తగిన గౌరవం, ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. న్యాయమైన ఈ డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం అత్యవసరంగా పరిశీలించి, వెంటనే అమలు చేయాలని నారాయణ డిమాండ్ చేశారు.

# క్రిస్టియన్ మైనారిటీల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధికి అధిక ప్రాధాన్యం

**సంక్షేమ పథకాల ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించిన మంత్రి అజారుద్దీన్**



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం క్రిస్టియన్ మైనారిటీల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర మైనారిటీల సంక్షేమ, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. పారదర్శకత, సాంకేతికత ఆధారిత సేవల ద్వారా యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ (టిజిసిఎంఎఫ్‌సి) ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలోని తన కార్యాలయంలో శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రిస్టియన్ మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్ పథకం, మోటార్ బైక్, ఇ బైక్, స్కూటీ, ఇ స్కూటర్, అలాగే పెట్టీ బిజినెస్ పథకాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

### జూలై 18 వరకు దరఖాస్తుల స్వీకరణ..

అర్హులైన క్రిస్టియన్ మైనారిటీ అభ్యర్థులు జూలై 3 నుంచి జూలై 18 సాయంత్రం 5 గంటల వరకు tsobmms.cgg.gov.in వెబ్‌సై ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. కుట్టు మిషన్, పెట్టీ బిజినెస్ పథకాలకు వయస్సు 21 నుంచి 55 సంవత్సరాలు, మోటార్ బైక్, ఇ బైక్, స్కూటీ, ఇ స్కూటర్ పథకాలకు వయస్సు 21 నుంచి 50 సంవత్సరాలు, కుటుంబ వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల లోపు ఉండాలని తెలిపారు. మరిన్ని వివరా లకు 04023391067 నంబర్‌ను సంప్రదించవచ్చని లేదా tscmfc.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మైనారిటీస్ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, టిజిసిఎంఎఫ్‌సి చైర్మన్ దీపక్ జాన్, మైనారిటీస్ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి బి. షఫీయుల్లా, డైరెక్టర్ అబ్దుల్ హమీద్, మేనేజింగ్ డైరెక్టర్ పి. సబితతో పాటు హైదరాబాద్ జిల్లా కలెక్టర్, తదితరులు పాల్గొన్నారు.

# 4 రోజుల్లో రూ.6,590 కోట్ల రైతు భరోసా నిధులు పంపిణీ

**నాలుగో విడతలో 4–5 ఎకరాల రైతులకు రూ.1,188 కోట్లు జమ : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

ప్రజాపక్షం/హైదరాబాద్ : రైతు భరోసా నిధుల విడుదలలో రాష్ట్ర ప్రభుత్వం మరో రికార్డు సృష్టించిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జూన్ 30న ప్రారంభమైన రైతు భరోసా నిధుల పంపిణీ కార్యక్రమంలో కేవలం 4 రోజుల్లోనే 65.76 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.6,590.37 కోట్లుజమ చేసినట్లు వెల్లడించారు. శుక్రవారం నాలుగో విడతలో 4 నుంచి 5 ఎకరాల వరకు సాగుభూమి ఉన్న 4.41 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 1,188 కోట్లు నేరుగా జమ చేసినట్లు చెప్పారు. మొదటి మూడు విడతల్లో 4 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు రైతు భరోసా సాయం అందించగా, నాలుగో విడతలో 4 నుంచి 5 ఎకరాల రైతులందరికీ నిధులు విడుదల చేసినట్లు మంత్రి వివరించారు.రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా సాయాన్ని వేగంగా, పారదర్శకంగా అందిస్తున్నామని, వ్యవసాయానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## కార్మిక చట్టాలను రద్దు చేస్తే ఊరుకోం

ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు



ప్రజాపక్షం/లక్షెట్టిపేట : కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మిక చట్టాలను రద్దు చేస్తే ఊరుకునేది లేదని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు హెచ్చరించారు. లక్సెట్టిపేట మండల కేంద్రంలో ఏఐటియుసి మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మేకల దాసు మాట్లాడుతూ రాజీలేని పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నేడు కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్లుగా మార్చి కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడు తోం దని మండిపడ్డారు.కార్మికులకు వేతనాలు పెరగక ఉపాధి దొరకక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సో ర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 25 మంచిర్యాలలో జరిగే ఏఐటియుసి జిల్లా మహాస భలను జయప్రదం చేయాలని కోరారు.

మండల నూతన కమిటీ ఎన్నిక:

లక్సెట్టిపేట మండల ఏఐటియుసి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా లింగంపల్లి భానుచందర్, ఉపాధ్యక్షులుగా రాచర్ల రవి కిరణ్, ప్రధాన కార్యదర్శిగా కేతిరెడ్డి రమణ రెడ్డి, సహాయ కార్యదర్శిగా బైరి రాజన్న, కోశాధికారిగా దుర్గం దేవదాస్, సభ్యులుగా తిప్పని సత్తన్న, పెద్ద బోయిన రాజ్ కుమార్, బీచుపల్లి కుమార్, చింతల్ ఐలయ్య ఎన్నికయ్యారు. సిపిఐ మండల కార్యదర్శి మేదరి దేవవరం, ఉపసర్పంచ్ సంతపురి మధు పాల్గొన్నారు.

## 'సిఎంఆర్' లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి

కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం/నస్పూర్ : జిల్లాలో సామర్థ్యానికి అనుగుణంగా రైస్ మిల్లులకు కేటాయించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, టాస్క్ ఫోర్స్ ఒఎస్డి శ్రీధర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు కేటాయించిందని, మిల్లర్లు లక్ష్య సాధన దిశగా అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. రైస్ మిల్లర్లు చేయవలసిన చెల్లింపులను త్వరగా పూర్తి చేయాలని, డీలర్లకు కేటాయించిన ప్రకారంగా ధాన్యం తరలింపును వేగవంతం చేయాలని ఆదేశించారు. డిఫాల్టర్లు త్వరగా బకాయిలను 70 శాతం వరకు చెల్లించాలని స్పష్టం చేశారు. ఆగస్టు 31వ తేదీ లోగా సిఎంఆర్ డెలివరీ పూర్తి చేసే విధంగా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

## వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్



ప్రజాపక్షం/దండేపల్లి : ప్రభుత్వ వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ హెచ్చరించారు. తాళ్లపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు.గర్భవతుల నమోదు వంద శాతం పూర్తి చేసి, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. ఆశ కార్యకర్తలు గర్భవతులను ప్రైవేట్ ఆసుపత్రులకు తరలిస్తే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. 14 ఏళ్ల బాలికలకు హెచ్ పివి వ్యాక్సిన్ ఇప్పించాలని, ఐదేళ్ల లోపు పిల్లల ఇళ్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు.30 ఏళ్ల పైబడిన వారికి అసంక్రమణ వ్యాధుల పరీక్షలు పూర్తి చేసి, మందుల వివరాలను ఈహెచ్ఐ పోర్టల్ లో నమోదు చేయాలన్నారు. వైద్యులు, సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని, అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేయాలని జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ స్నేహిత, నర్సింగ్ అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, జూనియర్ అసిస్టెంట్ వెంకట సాయి పాల్గొన్నారు.

## మెందోరా పిఎస్‌ను సిపి తనిఖీ

ప్రజాపక్షం/ముప్కాల్ : మెందోరా పోలీస్‌స్టేషన్‌ను సీపీ సాయిచైతన్య శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి వివిధ రకాల ఫైల్స్‌ను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. పోలీసు విభాగం నిర్వహిస్తున్న పనితీరును పరిశీలించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం తీసుకోవల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. పిఎస్ సరిహద్దులో నిర్మల్, మెట్‌పల్లి ఉన్నందున వాహనాల రాకపోకలపై ఎల్లప్పుడూ నిర్విరామంగా నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిరోజు ట్రాఫిక్ సమస్య అధిగమించటానికి ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చేయాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సులభ మార్గంలో అధిక డబ్బులు సంపాదించాలనే ఆశ్యాతో యువత ఆన్‌లైన్ బెట్టింగ్స్ ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ సైబర్ మోసగాళ్ల చేతిలో చిక్కి డబ్బులు కోల్పోతూ అప్పులు చేసి చేసిన అప్పులను తీర్చలేక తనువును చాలిస్తున్నారని గేమింగ్ యాప్‌తో అప్రమత్తంగా ఉండాలని ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని యువత డ్రగ్స్ బారిన పడకుండా అనునిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సిబ్బందినుద్దేశించి అధికారులు, సిబ్బంది 24 గంటల తమ హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని, దూరప్రాంతాల నుండి ప్రయాణాలకు దూరంగా ఉండాలని, సిబ్బంది ప్రతి ఆరు నెలలకొకసారి తమ హెల్త్ చెకప్ చేయించుకోవాలని, ము ఖ్యంగా బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఆర్మూర్ రూరల్ సిఐ జాన్‌రెడ్డి, మెందోరా ఎస్సై సుహాసిని సిబ్బంది పాల్గొన్నారు.



# పారదర్శకంగా భూ రీసర్వే పూర్తి

భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డి.ఎస్. లోకేష్ కుమార్



ప్రజాపక్షం/మెదక్ : భూ రీసర్వే ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా, పారదర్శకంగా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డి ఎస్ లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మెదక్ జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్, భూభారతి ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్, ఏడి ల్యాండ్ సర్వేకిషన్ సంబంధిత ఆర్డీఓలు, తహసీల్దార్లు, లైసెన్స్ సర్వేయర్లతో కలిసి డి ఎస్ లోకేష్ కుమార్ భూ రీసర్వే, భూభారతి, సాదా బైనామా దరఖాస్తుల పురోగతిని సమీక్షించారు.మెదక్ జిల్లాలో ఎంపికైన 24 గ్రామాల్లో 7 గ్రామాల రీ సర్వే పూర్తయిందని, 18 గ్రామసభలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు నిజమైన భూ లబ్దిదారులకు న్యాయం జరిగేలా రీ సర్వే నిర్వహించాలని సూచించారు. సరిహద్దు వివాదాల పరిష్కారం, డిజిటల్ సర్వే, ల్యాండ్ పార్సిల్ మ్యాప్‌ల అమలు, మ్యుటేషన్ సేవలను పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు.సాదా బైనామా, భూ భారతి పెండింగ్ దరఖాస్తులపై మండలాల వారీగా సమీక్ష నిర్వహించి, కట్‌ఆఫ్ తేదీ నిర్ణయించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ మరియు భూభారతి ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహణ అత్యంత పారదర్శకంగా జరగాలని గతంలో నిర్వహించే సర్వే సాధారణ ఎక్విప్మెంట్‌తో జరిగిందని ఇది పూర్తిగా డిజిటల్ సర్వేనని సమర్ధతతో పూర్తిచేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ రీసర్వేను నిర్దేశిత గడువులోగా అత్యంత ఖచ్చితత్వంతో పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతోందని తెలిపారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భూ సర్వేతో భూ సమస్యలకు.. శాశ్వత పరిష్కారం

కలెక్టర్ కుమార్ దీపక్




ప్రజాపక్షం/చెన్నూర్ : ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో భూ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టి రెవెన్యూ గ్రామాల హద్దుల నిర్ధారణతో భూ సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సుకు తహసిల్దార్ మల్లికార్జున్, ఎంపిడిఒ మోహన్ లతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డుల ప్రకారం పరిష్కరిస్తామన్నారు. గ్రామాల హద్దులను నిర్ధారించి ప్రభుత్వ భూముల స్పష్టత తీసుకువస్తామని, ఆక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. భవిష్యత్తులో వివాదాలు రాకుండా వాడుకలో ఉన్న దారులను సైతం మ్యాపింగ్ లో నమోదు చేస్తామన్నారు.చెన్నూర్ లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, నాణ్యమైన విద్య అందించాలని సూచించారు.

## రూ. 2.37 కోట్లతో .. అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం/పటాన్‌చెరు : ముత్తంగి డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌళిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ముత్తంగి డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలో రెండు కోట్ల 37 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు అంతర్గత మురుగు నీటి కాలుకవలు ,బోర్ వెల్స్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రహదారులు,పారిశుద్ధ్య సౌకర్యాలు రక్షిత మంచినీటి వసతులు కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముత్తంగి డివిజన్ ను అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన డివిజన్ గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నిరంతర పనిచేస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలకు ,అకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనుల కోసం దశల వారీగా నిధులు, కేటాయిస్తూ నిర్దేశిత గడువుగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసమే క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఉపేందర్, మాజీ జెడ్పిటీసీ శ్రీకాంత్ గౌడ్, మాజీ వైస్ ఎంపిపి ప్రభాకర్ ,ఆత్మకమిటీ మాజీ చైర్మన్ కుమార్ గౌడ్, ఇంజనీరింగ్ విభాగం డీఈ కృష్ణవేణి ఏఈ ఫైజన్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కిట్టు మేరాజ్ ఖాన్, సందీప్, అబీద్ ,రామకృష్ణ, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంపొందేలా కృషి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/నిజామాబాద్ : నిర్దేశిత లక్ష్యానికనుగుణంగా జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంపొందేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. క్షేత్రస్థాయిలో రైతులను ప్రోత్సహిస్తూ జిల్లాలో ఈ సీజన్‌లో 2 వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవలని లక్ష్యంగా నిర్దేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో, ఆయిల్‌పామ్ నర్సరీని నిర్వహిస్తున్న ప్రీయూనిక్ కంపెనీ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయిల్‌పామ్ సాగు పురోగతిపై క్లస్టర్ల వారిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం నందిపేట్ మండలం లక్కంపల్లి సెజ్ ప్రాంతంలో గుర్తించిన స్థలం అనుకూలతపై చర్చించారు. భవిష్యత్తులో ఇదే ప్రాంతంలో రిఫైనరీ ఏర్పాటుకు సైతం స్థలం అందుబాటులో ఉండటం, పొరుగు జిల్లాలకు సెంటర్ పాయింట్ కావటంతో లక్కంపల్లి సెజ్ స్థలం ఫ్యాక్టరీ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అయితే ఆయిల్‌పామ్ పంటను సేకరించే కలెక్షన్ సెంటర్లను రైతులకు అనువైన ప్రాంతాలలో అందుబాటులో ఉంచాలని ఫ్రీయూనిక్ కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. ఎంతో లాభదాయకమైన ఆయిల్‌పామ్ పంట సాగును చేపట్టి రైతులు ఆర్థిక అభ్యున్నతి సాధించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని, దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఆయిల్‌పామ్ సాగు చేపట్టేలా విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా మాక్లూర్, డోంకేశ్వర్, బాల్కొండ, ముప్కాల్, మెండోరా, సిరికొండ మండలాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఒక్కో మండలంలో కనీసం 100 ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా ఆయిల్‌పామ్ సాగు చేపట్టేలా చూడాలన్నారు. వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగు దిశగా రైతులను ప్రోత్సహించలన్నారు. ఎంతో లాభదాయకమైన ఈ పంట సాగు దిశగా రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున తోడ్పాటునందిస్తోందని, ఈ అవకాశాన్ని జిల్లా రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# రూ. కోట్లాది నిధులతో అన్ని తండాలను అభివృద్ధి చేస్తాం

మోసానికి మరో పేరు బిజెపి
రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



ప్రజాపక్షం/నిజామాబాద్ రూరల్ : అన్ని తండాలను అభివృద్ధి చేస్తామని సబ్‌ప్లాన్ కింద కోట్లాది నిధులు కేటాయించామని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ధర్పల్లి మండలంలోని మద్దుల్ తండాలో కళ్యాణ మండపం కళ్యాణ మండపం భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చటం కోసం మద్దుల్ తండాకు కళ్యాణ మండపం కోసం నిధులు మంజూరు చేశామన్నారు. ఈ తండా చైతన్యమైనదని ఇక్కడి ప్రజలు అన్ని రంగాలలో ముందుంటారన్నారు. తాను తెలంగాణ ఉద్యమ సమయంలో 2001 నుంచి ఇక్కడి ప్రజలతో మంచి పరిచయాలున్నాయని, కాంగ్రెస్‌కు కంచుకోట అని గుర్తు చేశారు. రూరల్ నియోజకవర్గానికి ఎక్కువ నిధులు తీసుకవచ్చామని అందులో ధర్పల్లి ముందుందన్నారు. సీసీ, తా రు రోడ్లు వేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, ప్రతి తండాను అభివృద్ధి చేయటం కోసం ప్రత్యేక శ్రద్ధ వహించారని, మద్దుల్ తండా ఐక్యత అన్ని గ్రామాల్లో రావలన్నారు. అభివృద్ధి కోసం స్వయంగా తండా ప్రజలు డబ్బులు వెచ్చించటం గొప్ప విషయమన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డీసీసీ వైస్‌చైర్మన్ ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, రూరల్ నాయకులు ఉమ్మాజీ నరేష్, సర్పంచ్ మెగావత్ అరుణ గోపాల్, గాదె నరేష్, మంగిత్యానాయక్, శంకర్, రవీందర్, ప్రభు, పరశురాం, దూస్‌ఆరవు, వాల్యా, లింబ్యానాయక్, సుదర్శన్, సుభాష్‌రెడ్డి, సర్పంచ్‌లు, సొసైటీ చైర్మన్, వీడీసీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కళ్ళకల్‌లో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/మనోహరాబాద్: మనోహరాబాద్ మండలం లోని మేజర్ గ్రామ పంచాయతీ కళ్ళకల్ గ్రామంలో సర్పంచ్ మద్దూరి నవ్య నాగరాజు గౌడ్, ఉప సర్పంచ్ వీరబోయిన ప్రవీణ్ కుమార్ ముదిరాజ్ లు, పాలకవర్గ సభ్యులతో కలిసి గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంతోష, సమీనా బేగం లకు మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి వంటి పథకాలు పేదింటి ఆడపిల్లలకూ ఒక వరం లాంటిదని అన్నారు. ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కనిగిరి అనసూయ కృష్ణ, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు జోన్నోజి రంగాచారి, నాయకులు అజీమ్, సురేష్ యాదవ్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## అంబం గ్రామంలో విషాదం

కల్తీ కల్లుకు ఒకరి బలి, మరొకరి పరిస్థితి విషమం

ప్రజాపక్షం/ఎడపల్లి: నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలో కల్తీ కల్లు మహమ్మారి ఒకరి ప్రాణాన్ని బలితీసుకొగా, మరొకరిని మృత్యువుతో పోరాడేలా చేసింది. అంబం(వై) గ్రామంలో శుక్రవారం చోటుచేసుకున్న ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం చేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అంబం గ్రామానికి చెందిన నీరడి విఠల్(45) జుడగలి లక్ష్మయ్యలు కల్లు తాగేందుకు బోధన్‌నిజామాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న నర్సాపూర్ గేటు వద్ద గల ఒక కల్లు దుకాణానికి వెళ్లారు. అక్కడ కల్లు సేవించిన కొద్దిసేపటికే వారిద్దరూ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కల్తీ కల్లు ప్రభావంతో నీరడి విఠల్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, జుడగలి లక్ష్మయ్య పరిస్థితి అత్యంత విషమంగా మారింది. గమనించిన స్థానికులు వెంటనే లక్ష్మయ్యను చికిత్స నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ ఘోర ఘటనపై అంబం గ్రామస్తులు బోధన్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రసాయనాలు కలిపి కల్తీ కల్లు విక్రయిస్తున్న దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

## ఎండు గంజాయి అమ్ముతున్న ఇద్దరి అరెస్ట్



ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ : ఎండు గంజాయి అమ్ముతున్నట్టు సమాచారంతో ఇద్దరిని బుధవారం రాత్రి సుమారు 8 గంటల ప్రాంతంలో ఎన్‌ఫోర్సుమెంట్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు నిజామాబాద్‌లోని పూలాంగ్ చౌరస్తా, బోధన్ బస్టాండ్ ఏరియాలలో ఎండు గంజాయి అమ్ముతున్న షేక్ సమీర్ (23), మమ్మద్ రిజ్వాన్ సన్ ఆఫ్ సిరాజుద్దీన్ (30) అరెస్టు చేసి వారి నుండి 200 గ్రాములు ఎండు గంజాయిని, రెండు మోబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు సిఐ వెంకటేశ్ తెలిపారు. ఇట్టి తనిఖీలలో ఎస్ఐ రామ్ కుమార్, సిబ్బంది భూమన్న, విఠల్, లక్ష్మి నరసయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేరాలు లేని సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలి

మంచిర్యాల డిసిపి భాస్కర్



ప్రజాపక్షం/తాండూర్/మంచిర్యాల : డ్రగ్స్, నేర రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు సహకరించాలని మంచిర్యాల డిసిపి ఎ. భాస్కర్ కోరారు. తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థులకు శుక్రవారం గంజాయి, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బెల్లంపల్లి ఎసిపి కిరణ్ కుమార్, తాండూర్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ దేవయ్యలతో కలిసి హాజరైన డిసిపి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిసిపి భాస్కర్ మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తు, విద్య, ఉపాధి అవకాశాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని, మత్తు పదార్థాలకు బానిసలైతే కుటుంబానికి, సమాజానికి భారంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ఆన్ లైన్ మోసాలు, ఓటిపి మోసాలు, నకిలీ పెట్టుబడి పథకాలు, ఫేక్ లింకుల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటిపిలు, పాస్ వర్డ్ లు ఎవరికీ చెప్పకూడదని, మోసపోతే వెంటనే 1930 హెల్ప్ లైన్ నంబర్ కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండాపోలీసులను సంప్రదించాలన్నారు. మాదక ద్రవ్యాల విక్రయం, రవాణా, సైబర్ మోసాల సమాచారాన్ని పోలీసులకు అందించాలని కోరారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రహరీ క్లబ్ పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల పరిసర ప్రాంతాలను, సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాదారం సబ్ ఇన్ స్పెక్టర్ సౌజన్య, పాఠశాల ప్రిన్సిపాల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు అవగాహన కల్పించిన వ్యవసాయ అధికారులు



ప్రజాపక్షం/మోర్తాడ్: నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని అన్ని గ్రామాల రైతులకు శుక్రవారం మోర్తాడ్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి హరీష్ కుమార్ బై బ్యాక్ విత్తన పంటలు వరి, మొక్కజొన్న, జొన్నలు, సజ్జలు, తీసుకునేటప్పుడు రైతులు తీసుకోవాల్సిన జాగ్రతలు వివరాలను అవగాహన కల్పించారు. సీడ్స్ లైసెన్స్ ఉన్న అధికృత డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు తీసుకోవాలని విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు. ఆ బిల్లు పైన డీలర్ యొక్క జిఎస్టి నంబర్, సీడ్స్ లైసెన్స్ నంబర్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. బిల్లు పైన తప్పనిసరిగా కొనుగోలు చేసిన విత్తనాలు వివరాలు రాయాలి. దాని పైన విత్తనాలు ఇచ్చిన తేది, విత్తనాలు ఇచ్చిన డీలర్ అలాగే విత్తనాలు తీసుకున్న రైతు సంతకం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. అగ్రిమెంట్ బాండ్ అనేది ఖచ్చితంగా బాండ్ పేపర్ పైన మాతర్మే ఉండాలని, అగ్రిమెంట్ బాండ్ పైన రెవెన్యూ స్టాంప్ అతికించి దానిపైన డీలర్ సంతకం తప్పనిసరిగా ఉండాలని, దానిపై సాక్షుల సంతకాలు ఉండాలన్నారు. విత్తనాలు తీసుకున్న తరువాత ఇచ్చిన బిల్లు, విత్తనాల బ్యాగ్స్ పంటకాలం పూర్తి అయ్యేవరకు తప్పనిసరిగా భద్రపర్చుకోవాలని రైతులకు సూచించారు. బై బ్యాక్ అగ్రిమెంట్ వేరే రాష్ట్రాల డీలర్స్ వద్ద తీసుకొని, అలాగే బై బ్యాక్ అగ్రిమెంట్ తెల్ల కాగితాలపై రాసుకొని మోసపోకండని అవగాహన కల్పించారు.మండల వ్యవసాయ అధికారి హరీష్ కుమార్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
శనివారం
04-07-2026
www.prajapaksham.in

'రక్త చరిత్ర సినిమా అప్పట్లో ఒక సంచలనం. రాయలసీమ ఫ్యాక్షన్ నేపథ్యంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవలను కళ్ళకు కట్టినట్టుగా తెరకెక్కించిన సినిమా రక్త చరిత్ర. రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ సినిమా అప్పట్లో వివాదాలను కూడా సృష్టించింది.'

రీల్

## అర్జున్‌కు, ఆర్‌జివికి థ్యాంక్స్ : విశాల్



సూపర్ గుడ్ ఫిలిమ్స్ బ్యానర్ మీద 99వ ప్రాజెక్ట్‌గా విశాల్ హీరోగా, దర్శకుడిగా చేస్తున్న చిత్రం 'మకుటం'. స్వర్గీయ ఆర్ బీ చౌదరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో అంజలి, దుషార విజయన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. తాజాగా సెకండ్ సింగిల్ 'నచ్చాకే వచ్చేరా' అనే పాటను విడుదల చేశారు. ఈ క్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో విశాల్ మాట్లాడుతూ 'మకుటం'తో దర్శకుడిగా మారి ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నాను. ఆర్బీ చౌదరి ని నేను మిస్ అవుతున్నాను. 99వ ప్రాజెక్ట్ బాధ్యతల్ని ఆయన నాకు ఇచ్చారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ మూవీకి దర్శకుడిగా మారాను. ఆయన నా మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నానే అనుకుంటున్నాను. ఆయన బ్యానర్ నుంచి పరిచయం అయిన దర్శకుల్లో నేను 45వ వ్యక్తిని. సుబ్రహ్మణ్యం నా మీద పెట్టుకున్న నమ్మకంతోనే 'మకుటం' ఈ స్థాయి వరకు వచ్చింది. ఈ మూవీ కోసమే ఏడాదిపాటుగా నా పర్సనల్ విషయాల్ని పక్కన పెట్టాను. నాకు ఈ ప్రయాణంలో సాయి ధన్సిక ఎంతో అండగా నిలిచారు. 'లింగా' పాట మంచి హిట్ అయింది. అందులో నన్ను సింగర్గా చేయడం జీవీ ప్రకాష్ తీసుకున్న రిస్క్ . 'నచ్చాకే వచ్చేరా' పాటను ప్రభ అద్భుతంగా పాడింది. ఆమె పాడిన ప్రతీ పాట బ్లాక్ బస్టర్ హిట్ అయింది. దర్శకుడిగా ఇది నా మొదటి చిత్రం. నన్ను నమ్మి ఈ ప్రయాణంలో తోడుగా నిలిచిన తోటి ఆర్టిస్టులందరికీ థాంక్స్.'పందెంకోడి' మూవీని ఆయనే పట్టుబట్టి తెలుగులో రిలీజ్ చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తెలుగు ప్రేక్షకులు నన్ను ఆదరిస్తూనే ఉన్నారు. నన్ను ప్రభావితం చేసిన అర్జున్ కి, ఆర్జీవీ కి థాంక్స్. గత 22 ఏళ్లలో 35 చిత్రాలు చేశాను. ఇంత వరకు నన్ను అభిమానించిన, ఆదరించిన ప్రేక్షకదేవుళ్లకు థాంక్స్. 'మకుటం' ఎలా ఉంది అనేది నేనే ఆడియెన్స్ వద్దకు వచ్చి తెలుసుకుంటాను. ఓ మంచి సినిమాటిక్ ఎక్స్పీరియెన్స్ ఇస్తాను అని అన్నారు.అంజలి మాట్లాడుతూ మదగదరాజా తరువాత విశాల్తో కలిసి 'మకుటం' చేశాను. విశాల్తో నాకు 15 ఏళ్ల బంధం ఉంది. 'మకుటం'తో హీరోగా, దర్శకుడిగా పెద్ద విజయం దక్కాలి.ఈ చిత్రంలోని 'నచ్చాకే వచ్చేరా' పాట నాకెంతో ఇష్టం. ఈ పాట పెద్ద హిట్ అవుతుంది. 'మకుటం' పెద్ద హిట్ అవుతుందని ఆశిస్తున్నాను అని అన్నారు.జితన్ రమేష్, నటుడు అజయ్, నటి ఝాన్సీ, సింగర్ ప్రభ పాల్గొన్నారు.

## 'లవ్-యు లవ్-యు రాకాసి' అంటున్న జీవి. ప్రకాష్




మల్టీ టాలెంటెడ్ జీ.వి. ప్రకాష్ కుమార్, కయదు లోహర్ జంటగా నటిస్తున్న డార్క్ ఫాంటసీ సూపర్ నేచురల్ థ్రిల్లర్ గా వస్తున్న సినిమా 'ఇమ్మోర్టల్' మరియప్పన్ చిన్న దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అరుణ్ కుమార్ ధనశేఖరన్ నిర్మిస్తున్నారు.ఈ చిత్రంలోని 'లవ్-యు లవ్-యు రాకాసి' సాంగ్ రిలీజ్ చేశారు. యువతను అలరించే క్యాచీ ట్యూన్, ఉత్సాహభరితమైన బీట్తో రూపొందిన ఈ పాట ఇప్పటికే మంచి స్పందనను అందుకుంటోంది.ఈ పాటకు సామ్ సి.ఎస్ అద్భుతమైన ట్యూన్ అందించగా, అరవింద్, రేష్మా శ్యామ్ తమ ఎనర్జిటిక్ వోకల్స్ తో పాటకు ప్రత్యేక ఆకర్షణ తీసుకొచ్చారు. ప్రేమలోని సరదా, అల్లరి భావాలను ప్రతిబింబించేలా రాజశ్రీ సుధాకర్ సాహిత్యాన్ని అందించారు.మెలోడీ, బీట్, లిరిక్స్ సమన్వయంతో రూపొందిన ఈ పాటలో జీ.వి. ప్రకాష్ కుమార్, కయదు లోహర్ మధ్య కెమిస్ట్రీ ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. కలర్ ఫుల్ విజువల్స్, ఆకట్టుకునే డాన్స్ మూవ్మెంట్స్, స్టైలిష్ ప్రెజెంటేషన్తో రూపొందిన ఈ గీతం సినిమా మీద అంచనాలను మరింత పెంచుతోంది. ఈ చిత్రానికి డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: అరుణ్ రాధాకృష్ణన్, సంగీతం: సామ్ సిఎస్, ఎడిటర్: రాజేష్ ఎం, ఆర్ట్ డైరెక్టర్: శివశంకర్, స్టంట్స్ : ఆర్.శక్తి శరవణన్, జి.ఎన్.మురుగన్, కొరియోగ్రఫీ : ఎం. షరీఫ్, శబరీష్.

## 17న 'రక్త చరిత్ర' రీ–రిలీజ్




రక్త చరిత్ర సినిమా అప్పట్లో ఒక సంచలనం. రాయలసీమ ఫ్యాక్షన్ నేపథ్యంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవలను కళ్ళకు కట్టినట్టుగా తెరకెక్కించిన సినిమా రక్త చరిత్ర. రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ సినిమా అప్పట్లో వివాదాలను కూడా సృష్టించింది. ఉత్కంఠ వాతావరణం మధ్య రెండు పార్ట్ లుగా రక్తచరిత్రను రిలీజ్ చేశారు. తిరిగి ఇప్పుడు మరో సారి ఫ్యాక్షన్ కథను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. మొదటి సారి 2010లో రిలీజ్ అయిన ఈ సినిమాను పదహారేళ్ళ తరువాత మరోసారి థియేటర్లోకి విడుదల చేయనున్నారు. జూలై 17వ తేదీన రక్త చరిత్ర సినిమాను రీ రిలీజ్ చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు.పరిటాల రవి, మద్దెల చెరువు సూరి కుటుంబాల మధ్య చెలరేగిన ఫ్యాక్షన్ గొడవ రక్త చరిత్ర సినిమాలో అసలు కథ. సినిమా రిలీజ్ సమయంలో రామ్ గోపాల్ వర్మ అనంతపూర్ థియేటర్ లో సినిమా చూశారు. రాయలసీమలోని అనంతపూర్ లో రెండు గ్రూపుల మధ్య జరిగిన ఫ్యాక్షనిజంలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి అన్న అంశాన్ని తెరపై ఆవిష్కరించారుపరిటాల రవి గా బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ నటించగా, మద్దెల చెరువు సూరి పాత్రలో తమిళ నటుడు సూర్య కనిపించరు. రాధికా ఆప్టే, ప్రియమణి ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ చిత్రం 2010లో విడుదలై, అప్పట్లో సూపర్ హిట్ అయింది. 16 ఏళ్ల తర్వాత ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా రామ్ గోపాల్ వర్మ స్పందిస్తూ ఈ సినిమాను రీ రిలీజ్ చేయమని ప్రేక్షకులు వివిధ ఫ్లాట్ ఫారమ్స్ లో కోరుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అప్పట్లో చూడని నేటి తరం ప్రేక్షకులకు కూడా ఈ చిత్రం చేరువ కావాలన్న సంకల్పంతో జూలై 17న ఈ చిత్రం థియేట్రికల్ రిలీజ్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. జూలై 17న రక్త చరిత్ర పార్ట్ 1 ను , ఆగష్టు నెలలో 'రక్త చరిత్ర' పార్ట్ 2ను రీ రిలీజ్ చేయాలని నిర్ణయించాం అని చెప్పారు.

## వింటూరా సరదాగా 'చింగారి' పాట రిలీజ్



వీసా వింటూరా సరదాగా' చిత్ర బృందం రెండో గీతం 'చింగారి'ని విడుదల చేసింది. హృదయాన్ని హత్తుకునే బాణీలు అందించడంలో పేరుగాంచిన విజయ్ బుల్గానిన్ అద్భుతమైన సంగీతాన్ని సమకూర్చిన ఈ మెలోడీ గీతాన్ని, తన ప్రత్యేకమైన గానంతో శ్రోతలను అలరించే సిద్ శ్రీరామ్, లిప్సిక ఎంతో అందంగా ఆలపించారు. సనారే రచించిన 'చింగారి' పాట ప్రతి ఒక్కరి గుండెల్ని తాకేలా ఉంది. ప్రేమలోని నిశ్శబ్ద వేదనను, మనసులో రగిలే భావోద్వేగాలను ఎంతో కవితాత్మకంగా ఆవిష్కరిస్తుంది. మాటల్లో చెప్పలేని ప్రేమ అనుభూతిని సంగీతం ద్వారా అద్భుతంగా వ్యక్తపరిచే ఈ పాట ప్రతి ఒక్కరికీ దగ్గరయ్యేలా రూపొందింది.ఈ చిత్ర టీజర్ ఒక సరికొత్త కథనంతో, విదేశాల్లోని తెలుగు విద్యార్థుల జీవితాన్ని ఆవిష్కరిస్తూ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. తొలి గీతం 'అనగనగా అమెరికా' ఒక హుషారైన పాటగా నిలిచింది. సొంత ఊరిని వదిలి దూరంగా వెళ్ళి, విదేశాల్లో తమ కలలను సాకారం చేసుకునేందుకు ప్రయత్నించే యువత భావోద్వేగాలను ప్రతిబింబించే చిత్రంగా వింటూరా సరదాగా'పై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి.ఇప్పుడు విడుదలైన 'చింగారి' పాటతో ఈ చిత్రం తనలోని రొమాంటిక్ కోణాన్ని ఆవిష్కరించింది. హృదయాన్ని తాకే స్వరాలు, సాహిత్యంతో ఈ పాట సంగీత ప్రియుల మనసులను గెలుచుకుంటోంది.నూతన దర్శకుడు ఉద్భవ్ రఘు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో అశోక్ గల్లా, శ్రీ గౌరీ ప్రియ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. రాహుల్ విజయ్, శివాత్మిక రాజశేఖర్, సత్య, వైవా హర్ష, గుండు సుదర్శన్ ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. అమెరికాలోని తెలుగు విద్యార్థుల జీవితాల నేపథ్యంతో ఎంతో వైవిధ్యంగా, హృద్యమైన భావోద్వేగాలతో ఈ సినిమా రూపొందుతోంది. స్నేహం, ఆశయాలు, సాంస్కృతిక గుర్తింపు, ఊహించని ప్రేమ వంటి అంశాలను నేటి తరం ప్రేక్షకులు కోరుకునే విధంగా సరికొత్తగా ఆవిష్కరించనుంది. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అశోక్ గల్లా, శ్రీ గౌరీ ప్రియ, రాహుల్ విజయ్, శివాత్మిక రాజశేఖర్ తదితరులు నటిస్తున్నారు.

## 'బాలన్ – ది బాయ్' పై మణిరత్నం ప్రశంసలు




కేవీఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మించిన మూవీ 'బాలన్ ది బాయ్'. ఈ చిత్రానికి 'ఆవేశం' ఫేమ్ డైరెక్టర్ జితూ మాధవన్ అందించిన స్క్రిప్ట్ తో 'మంజుమ్మెల్ బాయ్స్' చిత్ర దర్శకుడు చిదంబరం దర్శకత్వం వహించారు. వెంకట్ కె నారాయణ, శైలజా దేశాయి ఫెన్ నిర్మాతలుగా వ్యవహరించారు. ఇటీవలే ఈ సినిమా హిందీతో పాటు మలయాళం, తెలుగు, కన్నడ, తమిళంలో ప్రేక్షకుల ముందుకు వచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. 'బాలన్ ది బాయ్' సినిమాను తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ డిస్ట్రిబ్యూట్ చేసింది. ఈ సినిమా తెలుగులో సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. హీరో నాగచైతన్యతో పాటు పలువురు టాలీవుడ్ సెలబ్రిటీలు 'బాలన్ ది బాయ్' సినిమాకు సపోర్ట్ గా నిలిచారు. మలయాళంలో డైరెక్టర్ ప్రియదర్శన్ అప్రిషియేట్ చేశారు. మరోవైపు కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, జ్యోతిక దంపతుల ప్రశంసలు అందుకుందీ మూవీ. తాజాగా లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం 'బాలన్ ది బాయ్' సినిమాపై ప్రశంసలు కురిపించారు.'బాలన్ ది బాయ్' సినిమా స్పెషల్ స్క్రీనింగ్ కు హాజరైన డైరెక్టర్ మణిరత్నం ఈ చిత్రాన్ని తిలకించారు. ఈ సినిమా స్క్రిప్ట్ ను, నటీనటుల పర్ ఫార్మెన్స్ ను మణిరత్నం అభినందించారు. మణిరత్నం ప్రశంసలు ఎంతో విలువైనవిగా భావిస్తున్నట్లు మూవీ టీమ్ ప్రకటించారు. ఇండియన్ సినిమా గర్వించే దర్శకుడు మణిరత్నం నుంచి తమ సినిమాకు ప్రశంసలు రావడం సంతోషంగా ఉందని 'బాలన్ ది బాయ్' టీమ్ తెలిపారు.

## 5న అమీర్ ఖాన్ మూడో పెళ్లి



బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ ముచ్చటగా మూడో పెళ్లి చేసుకోబోతున్నారు. ఈనెల 5వ తేదీన ముంబైలో తన ప్రియురాలు గౌరిని వివాహమాడనున్నారు. ఈ విషయాన్నీ అమీర్ ఖాన్ స్వయంగా ప్రకటించారు. ఇంతకు ముందు రీనా దత్త, కిరణ్ రావులను పెళ్లి చేసుకున్నారు. వీరితో విడాకులు తీసుకున్న తరువాత ఇప్పుడు ముచ్చటగా మూడో పెళ్ళికి సిద్ధమైయ్యారు. రెండేళ్లుగా గౌరిఅమీర్ ఖాన్ డేటింగ్ లో ఉన్నారు. అయిదవ తేదీన జరిగే పెళ్లి వేడుకకు ఇరు కుటుంబాలకు చెందిన సన్నిహితులు మాత్రమే హాజరు కానున్నారు. ''జూలై 5వ తేదీ నాకు ఎంతో ప్రత్యేకమైన రోజు. మా ఇంట్లో చిన్న వేడుకగా పిల్ల చేయుకుంటున్నాం'' అని అమీర్ ఖాన్ వ్యాఖ్యానించారు. అమీర్ ఖాన్ ముచ్చటపడి చేసుకుంటున్న ఈ మూడో పెళ్లి వీరి జీవితంలో సుఖ సంతోషాలను నింపాలని మనమూ కోరుకుందాం.

# మూడు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు

### ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు

### గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురుగాలులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రానున్న మూడు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండగా, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ నుం తచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశముందని హెచ్చరించారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉరుములు, మెరుపులు, గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శుక్ర, శనివారం ఆదిలాబాద్, కోమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షా లు కురిసే అవకాశం ఉందని తెలిపారు. శని, ఆదివారం ఆదిలాబాద్, కోమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మ హబూబాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆది, సోమవార ం ఆదిలాబాద్, కోమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. ఈ కాలంలోనూ రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులు, గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ నాలుగు రోజులపాటు గంటకు 3050 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ కేంద్రం అధికారులు సూచించారు.

# రోడ్డు ప్రమాదంలో మరణించిన ఇంజినీరింగ్ విద్యార్థి కుటుంబానికి... రూ.కోటి పరిహారం మంజూరు

### ఢిల్లీ హైకోర్టు తీర్పు

**న్యూఢిల్లీ :** రోడ్డు ప్రమాదంలో మరణించిన నేతాజీ సుభాష్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ ( ఎన్ఎస్ఐఇటి) నాలుగవ సంవత్సరం విద్యార్థికి ఢిల్లీ హైకోర్టు రూ.కోటికి పైగా పరిహారం మంజూరు చేసింది.ఈ రోడ్డు ప్రమాదం 2017 సంవత్సరంలో జరిగింది. ఇదే రోడ్డు ప్రమాదంలో మరణించిన ఇంజినీరింగ్ మూడవ సంవత్సరం విద్యార్థికి కూడా కోర్టు రూ.84లక్షల పరిహారం మంజూరు చేసింది. 2020 సెప్టెంబర్లో మోటార్ యాక్సిడెంట్స్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ తమకు మంజూరు చేసిన నష్టపరిహారాన్ని పెంచాలని కోరుతూ మరణించిన ఇద్దరు విద్యార్థుల కుటుంబాలు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ అనీష్ దయాళ్ శుక్రవారం ఈ తీర్పును వెలువరించారు. హైకోర్టులో మృతుల కుటుంబం తరపున సీనియర్ న్యాయవాది సుమీత్ వర్మ హాజరయ్యారు. కాగా, ట్రిబ్యునల్ ప్రబ్లీన్ కౌర్, వినయ్ ఖురానాల కుటుంబాలకు వరుసగా రూ.38.50లక్షలు, రూ.83.86లక్షలు మంజూరుచేసింది. 2017 ఫిబ్రవరిలో వారిద్దరూ ఒక ఉమ్మడి స్నేహితుడు నడుపుతున్న కారులో ఢిల్లీకి ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అతివేగంగా, నిర్లక్ష్యంగా కారును నడపడంతో అదుపుతప్పి డివైడర్పై ఉన్న రెయిలింగ్ను ఢీకొనడంతో ఇద్దరు విద్యార్థులు మరణించారనే ఆరోపణలు చోటుచేసుకున్నాయి. ట్రిబ్యునల్ ద్వారా మంజూరు చేసిన పరిహారాన్ని తగ్గించాలని కోరుతూ ఐసిఐసిఐ లోంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ అనే బీమా సంస్థ అప్పీళ్లను దాఖలు చేసింది. జులై 1న వెలువరించిన తీర్పులో మరణించిన విద్యార్థులు జెఇఇ పరీక్షలో మంచి మార్కులు సాధించి ఒక ప్రతిష్ఠాత్మక ఇంజినీరింగ్ కళాశాలలో చేరిన తెలివైన, ప్రతిభావంతులైన విద్యార్థులని కోర్టు పేర్కొంది.ఈ కేసులో దాఖలు చేసిన ఎఫ్ఐఆర్, ఛార్జిషీట్లో, నేరానికి పాల్పడిన వాహనం రోడ్డు డివైడర్ను గణనీయమైన బలంతో ఢీకొట్టిన కారణంగా ఆ ఇద్దరు విద్యార్థులూ మరణించినట్లు స్పష్టంగా రుజువైందని కోర్టు గమనించింది. నష్టపరిహార గణన కోసం మృతులు సంపాదించి ఉండగల ఆదాయం విషయంలో ప్రమాదం జరిగిన సంవత్సరం అయిన 2017ను ఒక కీలకమైన సంవత్సరంగా పరిగణించాలని కోర్టు పేర్కొంది. ' దీనిప్రకారం వినయ్ ఖురానా విషయంలో పరిహారాన్ని రూ.23,85,800/–, ప్రబ్లీన్ కౌర్కు రూ.45,82,600/–కు పెంచాం అని కోర్టు ఉత్తర్వు జారీ చేసింది. ఖురానా కుటుంబానికి రూ.1,07,71,800, ప్రబ్లీన్ కౌర్ కుటుంబానికి రూ.84,32,600 పరిహారం అందేలా తీర్పు ఇస్తున్నాం' అని కోర్టు తెలిపింది.





## ఇండ్ల కూల్చివేతలేనా?

(3వ పేజీ తరువాయి)

సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి, తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దశాబ్దాలుగా పేదలకు భూములు, గృహ వసతి కోసం కమ్యూనిస్టులే నిరంతరం పోరాడుతున్నారని గుర్తుచేశారు. నిరుపేదలు ఎంతో ఆశతో కాంగ్రెస్కు ఓట్లేసి గెలిపిస్తే, నేడు వారి ఇండ్లను కూల్చి రోడ్డున పడేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. నిరుపేదలు నిర్మించుకున్న ఇండ్ల కూల్చివేతలను ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని అన్నారు.హనుమకొండ గుండ్ల సింగారంలో సర్వే నెంబర్లు 174,175లలో నేడు చెరువు శిఖం భూమి లేనే లేదని, గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పేదలకు 1360 మందికి ఇంటి స్థలాలు ఇచ్చారని అన్నారు. గత ఐదేళ్ళుగా అక్కడ పేదలు సిపిఐ ఆధ్వర్యంలో భూ పోరాటం నిర్వహించి గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని అన్నారు. గుండ్ల సింగారంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇండ్ల స్థలాలు కేటాయించి, పట్టాలు ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం మొండివైఖరి వీడకపోతే కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా భూపోరాటాలను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యురాలు మండ సదాలక్ష్మి, ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, సిపిఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు వుట్కూరి రాములు, కర్రె లక్ష్మ ణ్, బత్తిని సదానందం, మునిగాల బిక్షపతి, గ్రామ పెద్దలు గాదె మొగిలి, జన్ను కృష్ణ, సిపిఐ నాయకులు మాలోత్ శంకర్ నాయక్, గుంటి రాజేందర్, పొనుగోటి రాముగోపాల్ చారి, పూజారి అమృతయ్య, మామునూరి దామోదర్, పూజారి నరేందర్, కేతపాక ప్రసాద్, తాటికొండ ప్రశాంత్, మాలోత్ మంగ, నలువాల సంధ్య, తాటికంటి మమత, గుంటి రజిత, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భూపోరాట కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రూ.2.21 కోట్ల వసూలు

(3వ పేజీ తరువాయి)

కుటుంబాన్ని అంతం చేస్తానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇతర వ్యక్తులపై తన అనుచరులతో దాడు లు చేసిన వీడియోలను కూడా పంపి భయాందోళనలకు గురిచేశాడని బాధి తుడు తెలిపాడు. విచారణలో నింది తుడు ఇదే తరహాలో పలువురిని మోసం చేసినట్లు, అతనిపై హైదరాబాద్, సైబ రాబాద్, మహబూబ్నగర్, విశాఖపట్నం ప్రాంతాల్లో ఇప్పటికే పలు క్రిమినల్ కేసులు నమోదై ఉన్నట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు సమగ్ర దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## తప్పు చేస్తే బాధ్యత లేదా?

(3వ పేజీ తరువాయి)

ఇప్పుడు పరిగణలోకి తీసుకుంటున్నారు. ఆ ఓటర్ లిస్టులో పేర్లు తప్పుగా అధికారులు రాశారు. 2024 ఓటర్ లిస్టులో మాత్రం పేర్లు సరిగానే ఉన్నాయి, ఎలాంటి తప్పులు లేవు. అయితే ఇప్పుడు ఎస్ఐఆర్లో అధికారులు 2002 పరిగణలోకి తీసుకుంటే ఓటర్ లిస్టులో ఉన్న పేరు ప్రస్తుతం ఉన్న ఓటర్ లిస్ట్లో ఉన్న పేరు వేరువేరుగా ఉన్నది కాబట్టి ఓటును తొలగించే హక్కు అధికారులకు ఉంది. 2002లో సదరు ఓటరు తన పేరుని కరెక్టుగానే ఇచ్చిన అధికారులు మాత్రం తప్పుగా ప్రింట్ చేశారు. అధికారులు చేసిన తప్పిదానికి ఇప్పుడు ఓటరుకు శిక్ష పడాలా ?. ఇలాంటి అంశాలపై అధికారులు దృష్టి పెట్టి ఇప్పటికైనా సరి చేయాలి కానీ, ఓటర్లను మాత్రం తొలగించ కూడదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది..**

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన రాజ్యాంగ హక్కుల్లో ఒకటి. ఒక చిన్న నమోదు పొరపాటు వల్ల ఓటరు పేరు జాబితాలో లేకపోవడం, పోలింగ్ రోజున ఓటు వేయలేకపోవడం వంటి పరిస్థితులు ఏర్పడవచ్చు. దీని వల్ల నష్టపోయేది సాధారణ పౌరుడే. చట్టం ప్రకారం ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చిన ఓటరుపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అదే సమయంలో ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు కూడా నిర్లక్ష్యం, విధి నిర్వహణలో వైఫల్యం లేదా ఉద్దేశపూర్వక అక్రమాలకు పాల్పడితే సంబంధిత సేవా నిబంధనలు, ఎన్నికల చట్టాలు, ఇతర వర్తించే చట్టాల ప్రకారం శాఖాపరమైన లేదా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అయితే ప్రతి నమోదు పొరపాటు స్వయంచాలకంగా నేరంగా పరిగణించబడదు. అది సాధారణ మానవ తప్పిదమా, నిర్లక్ష్యమా, లేక ఉద్దేశపూర్వక చర్యా అనే అంశాలు విచారణలో తేలాలి. అందువల్ల ప్రజల్లో వినిపిస్తున్న ప్రధాన ప్రశ్న ఒక్కటేచట్టం అందరికీ సమానంగా వర్తించాలి. ఓటరు తప్పు చేస్తే చర్యలు ఉంటే, అధికారి నిర్లక్ష్యం వల్ల ఓటరు హక్కు దెబ్బతింటే ఆ అధికారిపైనా బాధ్యతను నిర్ధారించాలి. జవాబుదారీతనం ఒకవైపు మాత్రమే కాకుండా రెండు వైపులా ఉండాలి. ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసం నిలవాలంటే పారదర్శకతతో పాటు జవాబుదారీతనం కూడా సమానంగా అమలు కావాలి.

ప్రజాస్వామ్య బలం కేవలం ఓటు హక్కులోనే కాదు, ఆ హక్కును కాపాడే వ్యవస్థలోనూ ఉంది. కాబట్టి అధికారులు కూడా తప్పు చేసినప్పుడు కేసులు నమోదు చేసే విధానం తీసుకువస్తే అధికారులకు కూడా భయం ఉంటుంది. పొరపాటుకు ఆస్కారం ఉండదు అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## 'మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ'

(3వ పేజీ తరువాయి)

ప్రతి రైతుకు విత్తనాలు అందేలా అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. తెలంగాణలో పత్తి సాగును మరింత ఉన్నత స్థితికి తీసుకెళ్లడంలో ఈ పథకం మైలురాయిగా నిలవనుంది.

**ఆధునిక సాంకేతికతతో పత్తి విత్తన విప్లవం :**

సాంప్రదాయ పద్ధతులకు భిన్నంగా పత్తి దిగుబడిని పెంచడమే ఈ మిషన్ యొక్క ప్రధాన ఉద్దేశం. క్షేత్ర స్థాయిలో ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేయడం ద్వారా (హైడెన్సిటీ ప్లాంటింగ్ సిస్టమ్) సాంద్ర పద్ధతి, (క్లోజర్ స్పేసింగ్) దగ్గరగా మొక్కలు నాటడం, (ఇంటిగ్రేటెడ్ క్రాప్ మేనేజ్మెంట్) సమగ్ర పంట యాజమాన్యం వంటి అత్యాధునిక సాంకేతికతలను రైతులకు విస్తృతంగా చేరువ చేయనున్నారు. దీని ద్వారా పత్తి నాణ్యత, ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని నివేదిక స్పష్టం చేసింది.

కేంద్రం ఎంపిక చేసిన 19 జిల్లాలు ఇవే:

రాష్ట్రంలో ఈ పథకాన్ని అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తెలంగాణలోని 19 జిల్లాలను ప్రత్యేకంగా ఎంపిక చేసింది. ఇందులో ఆదిలాబాద్, సంగారెడ్డి, కొమరంభీం ఆసిఫాబాద్, ఖమ్మం, సిద్ధిపేట, మంచిర్యాల, వరంగల్, 8. నల్గొండ, నాగర్కర్నూల్, వికారాబాద్, జోగులాంబ, గద్వాల, రంగారెడ్డి, నారాయణపేట, జనగామ, నిర్మల్, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్నగర్, కరీంనగర్ జిల్లాలు ఉన్నాయి.

**100 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ :**

ఈ వానాకాలం సీజన్లో 16 జిల్లాల నుంచి సుమారు 6.33 లక్షల ప్యాకెట్ల పత్తి విత్తనాల కోసం జిల్లా వ్యవసాయ అధికారులు ఇండెంట్లు సమర్పించారు. ఈ విత్తనాల ద్వారా దాదాపు 1,27,374 ఎకరాలలో 50,950 మంది రైతులు సాగు చేయనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.57.02 కోట్ల భారీ సబ్సిడీని భరించనుంది. మరోవైపు జనగామ, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు సంబంధించిన ఇండెంట్లను ఆయా జిల్లాల కలెక్టర్ల ద్వారా పంపించే ప్రక్రియ వేగంగా జరుగుతోందని అధికారులు తెలిపారు. కాగా, ఇప్పటివరకు 16 జిల్లాల్లో రైతులకు పంపిణీ చేయడానికి వీలుగా రూ. 56.79 కోట్ల విలువైన 6,31,009 ప్యాకెట్ల విత్తనాలను వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉంచింది.

**రైతుకు గరిష్ఠంగా 2.5 ఎకరాలకు ఉచిత విత్తనాలు :**

ఈ కాటన్ మిషన్ కింద చేపట్టే సాంకేతిక ప్రదర్శనల కోసం ఒక్కొక్క రైతుకు గరిష్టంగా 2.5 ఎకరాలకు సరిపడా విత్తనాలను 100 శాతం సబ్సిడీతో ఉచితంగా సరఫరా చేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ ( టిజిఎస్డిసి) ద్వారా అత్యంత నాణ్యమైన, నోటిఫైడ్ చేసిన బిటి పత్తి హైబ్రిడ్ విత్తనాలను రైతులకు అందిస్తారు. అదేవిధంగాహెచ్డిపిఎస్, క్లోజర్ స్పేసింగ్, ఐసిఎం పద్ధతులకు అనువైన ఈ హైబ్రిడ్ విత్తనాలను హైదరాబాద్ లోని 'అటారీ' సంస్థ సిఫార్సుల మేరకు ఎంపిక చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com